




మహాళద్వీపానికి రాజైన మందరదేవుడు, ఒకనాడు ఉద్యానవనంలో విహరిస్తూండగా కోటద్వారంవద్ద పెద్ద కలకలం బయలు దేరింది. ప్రజల కేకలూ, సైనికుల హెచ్చరికలతో కోటప్రాంతమంతా మారుమోగ సాగింది. ఇంత కలకలానికి కారణమేమిటా అని మందరదేవుడు ఉద్యానవనంనుంచి కోటద్వారంకేసి బయలుదేరాడు.

కొద్దిసేపటిలో మందరదేవుడు కోట ద్వారాన్ని సమీపించేసరికి మంత్రి ప్రజలను శాంతంగా వుండవలసిందని హెచ్చరించటం అతడి కంటబడింది. రాజు రాక గమనించిన కొందరు సైనికులు, ఆ సంగతి మంత్రితో చెప్పారు. వెంటనే మంత్రి వెను దిరిగి రాజును సమీపించాడు.

"ఏమిటీ కలకలం?" అని ప్రశ్నించాడు మందరదేవుడు. మంత్రి క్షణకాలం కోట ద్వారంకేసి చూసి, "ప్రభూ, నిజమో అబద్ధమో యింకా ధృవపడలేదు. నావరకు నేను యిందులో కొంత నిజం వుండవచ్చునని భావిస్తున్నాను. కుండలినీద్వీపం యీ మధ్య అరాజక స్థితిలో వున్నదని మన అందరికీ తెలిసినదే. పోతే యిప్పుడువచ్చిన వార్త ఏమిటంటే — ఆ ద్వీప రాజ్యాధికారాన్ని నరవాహనమిత్రుడనే సేనాని హస్తగతం చేసుకుని మన రాజ్యంమీదికి దాడి బయలుదేరాడని. ఇది చేపలు పట్టబోయిన బాలురులు తెచ్చిన వార్త. ప్రజలు కలవరపడుతున్నారు. శాంతంగా వుండవలసిందని హెచ్చరిక చేశాను," అన్నాడు.




మందరదేవుడు తల పంకించి వూరుకున్నాడు. మంత్రి భావించినట్టు ఇందులో కొంత సత్యం వుండవచ్చునని అతడికి తోచింది. రాజు మౌనం వహించటంతో, ఆయనా ప్రమాదాన్ని శంకిస్తున్నాడని గ్రహించిన మంత్రి, "ప్రభూ, ముందు జాగ్రత్తకోసం తగు ఏర్పాటులు చేయవలసిందిగా సేనానికి కబురు పంపాను. ఈ వార్తలోని నిజానిజాలు సూర్యాస్తమయంలోపల మన వేగులద్వారా తెలుసుకోవచ్చు. వారు వచ్చేవేళ అయింది," అన్నాడు.

మందరదేవుడు మంత్రికేసి ప్రశ్నార్థకంగాచూసి, క్షణం ఆగి, "సరే, ఆ వార్తలోని నిజానిజాలు తెలియగానే, నాకు తెలియపరుచు. నీకోసం చూస్తూంటాను," అంటూ భవనంవేపుకు సాగిపోయాడు.

రాజు వెళ్ళగానే మంత్రి సరాసరి పోయి కోటబురుజు ఎక్కాడు. అక్కడ నిలబడి చూస్తే, దూరంగావున్న సముద్రం, అందులో తేలియాడుతున్న నావలూ కనబడతై. మంత్రి ఆశించిన విధంగానే దూరాన తెరచాప ఎత్తిన ఒకనావ కనిపించింది. అది సూటిగా మరాళద్వీపానికేసి వస్తున్న సూచనగా క్షణక్షణానికి మరింత స్పష్టంగా కనిపించసాగింది.


ఇక సేనాని మంత్రినుంచి వార్త రాగానే ముందుజాగ్రతకోసం సైనికులను సమీకరించాడు. చుట్టూ సముద్రంచేత ఆవరింపబడివున్న మరాళద్వీపానికి అప్పుడప్పుడు చేరువలో వున్న ద్వీపరాజ్యాలనుంచి ప్రమాదం సంభవిస్తూండేది. ఆ కారణంవల్ల మరాళద్వీపంలోని ప్రతి పురుషుడూ అంతోయింతో సైనికశిక్షణ పొందడం రాజశాసనంగా వుండేది.

సేనాని కొందరు సైనికులతో సముద్రతీరానికి బయలుదేరాడు. మరాళద్వీప నావికాదళంకూడా అవసరమైతే శత్రునావలతో యుద్ధానికి తలపడేందుకు సిద్ధ

మోగింది. శంఖనాదాలద్వారా, చాటింపుల ద్వారా ప్రతి నావికుడూ, సముద్రతీరాన వున్న తమతమ నావలకు రావలసిందిగా ఆజ్ఞాపించబడ్డారు.

కోట బురుజుపై వుండి ఈ సన్నాహాలను చూస్తున్న మంత్రి, సేనానుల జాగ్రతకూ, విధి నిర్వహణలో వారు చూపుతున్న శ్రద్ధకూ చాలా ఆనందపడ్డాడు. కాని మంత్రి పొందిన ఆనందం, అంతలోనే ఆదుర్దాగా పరిణమించింది. వేగులు వస్తున్న నావకు వెనకగా కొంతదూరంలో హఠాత్తుగా నల్లని మేఘాలు కమ్మినట్టయింది. అది తుఫాను సూచనేమో అని మంత్రి అటు పరికించి చూసేటంతలో—అవి మేఘాలు కావనీ, కొన్నియుద్ధనావలు గుంపుగా మరాళ ద్వీపంకేసి రావటమనీ అతడు గ్రహించాడు. ఆ మరుక్షణంలోనే ఆ యుద్ధనావలనుండి నల్లని పొగలు బయలుదేరినై. కొద్దిసేపటి కల్లా నూనె గుడ్డలు చుట్టి నిప్పంటించటం వల్ల మండుతూన్న కొన్ని బాణాలు వేగులు వస్తూన్న నావమీదికి రాసాగినై.

జాలరులు తెచ్చిన వార్తలు నిజమని అప్పటికి మంత్రి అర్థంచేసుకున్నాడు. ముందు ఏ హెచ్చరికా యివ్వకుండా, యుద్ధప్రకటనకూడా చేయకుండా, పర దేశాలమీద దాడిచేసే కొత్త సంప్రదాయాన్ని





కుండలినీ రాజరికాన్ని హస్తగతం చేసుకున్న నరవాహనమిశ్రుడు ప్రారంభించాడని మంత్రి పళ్లు కొరికాడు. ఒకటి రెండు వందల సంవత్సరాలక్రిందట శాక్తేయుడనే మాంత్రికుడు ఈవిధంగా, యుద్ధ ప్రకటన చేయకుండానే చాలా ద్వీపరాజ్యాలను దోచుకున్నాడు. అతడు రాజవంశీయుడు కాడనీ, మాంత్రికుడు గనక అలా అధర్మంగా ప్రవర్తించాడనీ అప్పట్లో చాలా మంది సరిపెట్టుకున్నారు.

మంత్రి ఇలాంటి ఆలోచనలతో వుండగా, మరాళద్వీప నావికా సైన్యం, తమ నావకు రానున్న ప్రమాదాన్ని గ్రహించి ముందుకు వురికింది. సైనికులు సింహనాదాలు చేస్తూ నావలను ముందుకు నడిపించారు. కొద్ది సేపట్లో సముద్రతీరానికి నాలుగైదు మైళ్ళ లోపల కుండలినీ - మరాళద్వీప నావికా దళాలు యుద్ధానికి తలపడినై.

ఇంతలో సైనికులు కోట బురుజుపైకి రాసాగారు. ఒకవేళ మరాళద్వీప నావికా దళం ఓడింపబడితే, పట్టణాన్ని, రక్షించేందుకు ముందు జాగ్రతగా సైనికులు అక్కడికి పంపబడ్డారు. మంత్రి ఆ సైనికులలో ఒకరిని పిలిచి యుద్ధవార్తలను రాజుకు చెప్పేందుకు పంపాడు.

ఈలోపల సముద్రంలో నావికా యుద్ధం ముమ్మరంగా సాగుతోంది. ఇరుపక్షాల నావికులు ప్రాణాలకు తెగించి పోరాడసాగారు. నూనెలో ముంచిన గుడ్డలను బాణాలకు చుట్టి నిప్పంటించి ఒకరినావల మీదికి ఒకరు విసురుకోసాగారు. నిప్పంటుకున్న నావలనుంచి సైనికులు సముద్రంలోకి దూకుతూంటే, మండుతున్న నావల లోని మంటలను ఆర్పి, వాటిని వశపరుచుకునేటందుకు ఎదిరిపక్షపు సైనికులు వాటిని ఎక్కుతున్నారు.

కోట బురుజుమీంచి ఇదంతా చూస్తున్న మంత్రికి ఇప్పుడు జరుగుతున్న నావికా





యుద్ధ పర్యవసానం తన రాజ్యానికి అనుకూలంగా పరిణమిస్తుందన్న నమ్మకం సన్నగిల్లసాగింది. అతడికి వున్న ఒక ఆశా తాను పంపిన వేగులతో వున్న నావ సురక్షితంగా తీరం చేరాలని. అప్పుడుగాని తనకు కుండలినీ రాజ్యంలో జరిగిన మార్పులూ, నరవాహనమిత్రుడి సంగతీ, ప్రజల మనస్థితీ అర్థంకాదు

ఇంతలో వెనక అడుగుల చప్పుడు వినబడింది. మంత్రి తలతిప్పి చూసేసరికి, రాజుకు యుద్ధవార్త తెలియపర్చేందుకు పంపబడిన సైనికుడు రొప్పుతూ, రొస్తూ అక్కడికి వచ్చాడు.


"ఏమి జరిగింది? ఎందుకలా పరుగెత్తుకుంటూ వచ్చావు?" అంటూ మంత్రి సైనికుణ్ణి ఆదుర్దాగా ప్రశ్నించాడు.

"రాజుగారు ఎక్కడ వున్నదీ తెలియటం లేదు!" అంటూ సైనికుడు తడబడుతూ జవాబిచ్చాడు.

"ఆ సంగతి నీకెలా తెలుసు?" అని అడిగాడు మంత్రి.

"అయ్యా, నే వెళ్ళేసరికే రాజభవనం అంతా గందరగోళంగా వుంది. కొద్ది నిమిషాలకిందట రాజుగారు వారి గదిలోనుంచి సహాయానికై కేకలు వేయటం ఒకళ్ళిద్దరు దాసీలు విన్నామని చెపుతున్నారు. భటులు ఆయనకోసం భవనమంతా వెతికారు. ఆయన జాడ లేదు. అంగరక్షకులు ఇద్దరు కూడా కనుపించటంలేదు," అన్నాడు.

అంగరక్షకులు కనిపించటంలేదనేసరికి, మంత్రికి ఏదో ద్రోహం జరిగిందన్న అనుమానం కలిగింది. బహుశా యిది కుండలినీద్వీప రాజ్యాన్ని చేజిక్కించుకున్న నరవాహనమిత్రుడి కొత్త రాజనీతి ప్రభావం కావచ్చనుకున్నాడు. రాజు భవనంలో లేడనేది ఆయనకోసం వెతికిన భటులు చెపుతున్నారు కనక—ఆయనను బంధించినవారెవరైనా యీసరికి రాజును కోటగోడ



అవలికి తీసుకుపోయివుండవచ్చునన్న అనుమానంకూడా మంత్రికి కలిగింది.

అలాంటి అనుమానం కలగటమే తడవుగా మంత్రి కొందరు సైనికులను తీసుకుని, కోటపైని ఒక బురుజునుండి మరొక బురుజుకు పరుగెత్తుతూ, వెలపల వున్న అగడ్తకేసి చూడసాగారు. ఒకచోట కోట గోడకు వేలాడుతున్న తాడూ, దానిని పట్టుకుని కిందకు దిగుతున్న ముగ్గురు మనుషులూ ఆయన కంటపడ్డారు. వెంటనే మంత్రితో వున్న సైనికులు, "అదుగో, మహారాజూ, ఆయన అంగరక్షకులూ!" అంటూ కేకలువేశారు.

ఇప్పుడేం చేయాలి? మంత్రికి పెద్ద గడ్డుసమస్య ఎదురైంది. కోటగోడను వున్న మేకునుంచి వేలాడుతున్న తాడును ఛేదించవచ్చు. కాని అలా చేస్తే రాజూ, అతనిని నిర్బంధించి తీసుకుపోతున్న ద్రోహులైన అంగరక్షకులూ అగడ్తలో పడిపోతారు. అలాకాక చూస్తూ వూరుకుంటే వాళ్ళు రాజును బంధించి నిరాటంకంగా తమ రాజ్యానికి తీసుకు పోగలరు.

మంత్రి యిలాంటి సంశయాలతో కొట్టుమిట్టాడుతుండగా ఒక సైనికుడు, "అయ్యా, అటు చూడండి. అగడ్తఒడ్డునే మూడు గుర్రాలు సిద్ధంగా వున్నవి," అంటూ ఆశ్చర్యంతో అరిచాడు. మంత్రి ఆ వైపుకు చూచేసరికి జీనులతో సర్వసిద్ధంగా వున్న మూడు గుర్రాలు కనిపించనై. సమయం చూచి రాజును బంధించి తెచ్చేందుకు నరవాహనమిశ్రుడు రాజభవనంలో తన బంట్లను ప్రవేశపెట్టగలిగాడని మంత్రికి అర్థమైంది. మంత్రి సముద్రంకేసి చూచాడు. వేగులు వున్న నావ తీరాన్ని సమీపిస్తోంది. కుండలినీద్వీప యుద్ధనావలు కూడా రెండు తీరంవైపుకు వస్తున్నవి.

పరిస్థితి విషమంగా వున్నదని గ్రహించిన మంత్రి, సైనికులకేసి తిరిగి, "మీలో నలుగు

ఐదుగురు గుర్రాలెక్కి రాజుగారి రక్షణకు వెళ్ళండి. ఈ దుర్ఘటననుగురించి మాత్రం మీరు బయటవున్న ప్రజలతో అనకండి. వెంటనే పొండి," అని ఆజ్ఞాపించాడు.

సైనికులు అక్కడినించి పరుగెత్తారు. మంత్రి కిందకు చూశాడు. అప్పటికి రాజును ద్రోహులైన అంగరక్షకులిద్దరూ అగడ్త దాటించి గుర్రాలు వున్నచోటుకు నడుపుతున్నారు. రాజు ముందు నడుస్తూండగా, వాళ్ళిద్దరూ కత్తులు చేతబట్టి ఆయన వెనక నడుస్తున్నారు. కొద్దిసేపట్లో వాళ్ళు గుర్రాలెక్కి రాజు ఎక్కిన గుర్రానికి వెనకగా తమ గుర్రాలను పరిగెత్తించసాగారు. వాళ్ళు రాజును సముద్రతీరంకేసి తీసుకుపోతున్నట్టు మంత్రి గ్రహించాడు.


ఇక రాజు రక్షణకై బయలుదేరిన సైనికులు నలుగురూ, గుర్రాలెక్కి బయలుదేరారు. వాళ్ళు కోట తూర్పుద్వారంనుంచి బయటపడి కొద్దిసేపట్లో, రాజును బంధించి తీసుకుపోతున్న ద్రోహులకేసి తమ గుర్రాలను పరిగెత్తించసాగారు. గిట్టల చప్పుడు విని వెనుదిరిగి చూచిన ద్రోహులు యిద్దరూ తమను సైనికులు వెంబడిస్తున్నారని గ్రహించి, రాజువీపుకు తమ కత్తులను గురిచేసి ఆయనను వేగంగా గుర్రాన్ని పరుగెత్తించవలసిందని ఆజ్ఞాపించారు.

కోట బురుజుపైనుంచి యిదంతా గమనిస్తున్న మంత్రి ఒకమారు బంధితుడైన రాజుకేసీ, మరోమారు తీరాన్ని సమీపిస్తున్న శత్రునావలకేసీ చూస్తూ, "మరాళదేవీ, నీ భక్తులను కఠినపరీక్షకు గురిచేస్తున్నావా?" అంటూ హృదయంమీద చేతులు పెట్టుకుని ఆకాశంకేసి తల ఎత్తాడు.

మరుక్షణంలోనే ప్రళయభయంకరమైన ఫెళఫెళారావాలతో ఉరుములూ, మెరుపులూ, ప్రారంభమై, మరాళద్వీపాన్ని దద్దరిల్లచేసినై. మంత్రి నివ్వెరపోయాడు.

—(ఇంకా వుంది)







## 2

[శాంతి సంపదలతో తులతూగుతున్న మరాళద్వీపానికి మందరదేవుడు రాజు. పొరుగున వున్న కుండలినీద్వీపంలో అరాచకం బయలుదేరింది. నరవాహనమిత్రుడనే సేనాని అధికారాన్ని హస్తగతం చేసుకుని, మరాళద్వీపంమీదికి దాడి బయలుదేరాడు. అదే సమయంలో అతడి వేగులు మందరదేవుణ్ణి బంధించి తీసుకుపోసాగారు. అప్పుడు—]

ఉరుములూ మెరుపులతో జడివాన ప్రారంభమైంది. సముద్రపుతీరాన గల నిడుపాటి కొబ్బరిచెట్లనూ, సరుగుడు చెట్లనూ కూకటి వేళ్ళతో పెళ్ళగిస్తూ తుఫానుగాలి వీచింది. సముద్రంలో ప్రాణాలకు తెగించి యుద్ధం చేస్తున్న మరాళ, కుండలినీద్వీప నావికాదళాలు చెల్లాచెదరు కాసాగినై. అప్పటికే తీరం చేరిన కొన్ని నావలనుంచి కుండలినీ సైనికులు దిగి, మరాళద్వీప సైనికులతో బాహాబాహి యుద్ధానికి తలపడ్డారు.

గుర్రాన్ని అదలించి అతివేగంగా స్వారి చేస్తున్న మందరదేవుని చెవులకు కుండలినీ, మరాళసేనల యుద్ధధ్వానాలు వినబడుతున్నవి. 'జై కుండలినీ!' అని అరుస్తూ భీకరంగా ముందుకు చొచ్చుకు వచ్చే కుండలినీ సైనికులను, 'జై మరాళీ!' అని చెవులు చిల్లులు పడేలా అరుస్తూ మరాళ సైనికులు ఎదుర్కొంటున్నారు. ఆకాశాన పెనుమబ్బులు, గాలి తాకుడుకు చెల్లాచెదరవుతూండగా, ఉరుముల కఠోర శబ్దం భూమ్యాకాశాలను బద్దలు చేస్తున్నది.



"నా రాజ్యానికీ నాకూ యింతటితో సరి!" అనుకున్నాడు మందరదేవుడు. తను తప్పించుకు పారిపోయే మార్గం లేదు. ఎదురు తిరిగి ద్రోహులైన తన అంగరక్షకులతో పోరాడేందుకైనా, తను నిరాయుధుడు. ఇలాంటి ఆపదనుంచి బయటపడటం ఎలానా అని అతడు ఆలోచించేటంతలో, "జై మరాళీ!" అన్న సింహనాదాలు అతడిని ఆశ్చర్యపరిచినై.

ఆ విధంగా నినాదాలు చేసినవారు మంత్రి పంపగా, మందరదేవుడి రక్షణకు బయలుదేరిన సైనికులు. వాళ్ళు అతి వేగంగా గుర్రాలను ముందుకురికిస్తూ, మందరదేవుడిని బంధించిన ద్రోహులను సమీపిస్తున్నారు. ఆ నినాదాలు వినగానే మందరదేవుడు వెనుదిరిగి చూశాడు. మరుక్షణంలోనే అతడి కళ్ళు మిరుమిట్లు కొలిపేంత కాంతితో, చెవులు బద్దలయేంత ధ్వనితో పెద్ద పిడుగు పడింది. అతడు త్రుటికాలంలో కళ్ళు తెరిచేవరికి ద్రోహులైన ఇద్దరు అంగరక్షకులూ నేలమీద పడి గిలగిల తన్నుకుంటున్నారు. వాళ్లు ఎక్కిన గుర్రాలలో ఒకటి మరణబాధతో తన్నుకుంటోంది. రెండవది పిచ్చి ఎత్తినదానిలా దారీతెన్నూ లేకుండా పరిగెత్తుతున్నది.

మందరదేవుడు దఢాలున గుర్రం దిగాడు. ఇంతలో అతడి రక్షణకై బయలుదేరిన సైనికులు నలుగురూ అక్కడికి చేరారు. అందరూ మరణబాధతో విలవిస్తున్న అంగరక్షకులకేసి నడిచారు.

మరణిస్తున్న అంగరక్షకులలో ఒకడు, మందరదేవుడికేసి చేయి ఎత్తి దగ్గరకు రమ్మన్నట్టు సౌజ్ఞచేశాడు. మందరదేవుడు అతణ్ణి సమీపించి దగ్గరగా కూర్చున్నాడు. అప్పుడు ఆ సైనికుడు ఆయాసపడుతూ,

"మహారాజా! మేం ఇద్దరం మీకు ద్రోహం తలపెట్టాం. కాని ఆ నీచకార్యానికి మేం ఒడిగట్టింది ధనంకోసం కాదు. ఈ

కార్యంలో తనకు సహాయపడకపోతే, మా కుటుంబాలను సర్వనాశనం చేస్తానని, ఆ నీచుడు—నరవాహనమిశ్రుడు మాకు వర్తమానం పంపాడు. మేం కుండలినీ ద్వీపవాసులమని మీకు తెలియంది కాదు. మా ద్రోహానికి ప్రాయశ్చిత్తం అనుభవించాం. కాని మీకు చేసిన ద్రోహానికి పరిహారంగా ఒక సహాయం చేయదలిచాను. మీరు ఏ కారణంచేతనైనా యీ ద్వీపాన్ని వదలదలిస్తే—యిక్కడికి సూటిగా వున్న ఆ కొబ్బరితోటకు అవల, తీరానికి అనుకుని రెండు పడవలు వున్నవి" అంటూ ఆ అంగరక్షకుడు ప్రాణంవిడిచాడు.

మందరదేవుడు లేచి తన కోటకేసి పరికించిచూశాడు. కోట బురుజులపైనుండి సైనికులు అగడ్తలకేసి బాణాలు వదులుతున్నారు. కొందరు పెద్ద పెద్ద రాతి బండలను కిందకు దొర్లిస్తున్నారు. కుండలినీ సైనికులు నిచ్చెనలతో కోట గోడలు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నారు.

తన సైనికుల పరిస్థితి విషమంగా వున్నదని మందరదేవుడు గ్రహించాడు. అంత పెనుతుఫానులోనూ కుండలినీ సైనికులు తన రక్షణ సైనికులను ఓడించి కోటను ముట్టడించారు. తను యిప్పుడు శత్రు సైనికుల వెనకభాగాన వున్నాడు. నలుగురు





సైనికులతో తను వాళ్లను వెనకనుంచి ఎదుర్కోవటం ఆత్మహత్యతో సమానం.

ఇలాంటి ఆలోచనలతో మందరదేవుడు కొట్టుమిట్టాడుతుండగా, అగ్నిపర్వతం బద్దలైనంత భయంకర శబ్దం వినిపించింది. మరుక్షణంలోనే అతడి కాళ్లకింద భూమి దద్దరిల్లింది. నిర్విణ్ణుడై అతడు కోటకేసి చూశాడు. కోట బురుజు ఒకటి గాలిలోకి లేచి, ముక్కలు చెక్కలుగా కిందకు ఒరగటం కనిపించింది. సైనికుల హాహాకారాలూ, కేకలూ మిన్నుముట్టినై.

"సర్వనాశనమైంది! మందు దట్టించి కుండలినీ సైనికులు మన కోటగోడను బద్దలుకొట్టారు. మన ఓటమి క్షణాల్లో ఉంది," అన్నారు మందరదేవుడు. "అవును మహారాజా!" అంటూ పక్కన వున్న నలుగురు సైనికులూ తలలు వంచారు.

ఇక తను మరాళ ద్వీపాన్ని వదలక తప్పదన్న నిశ్చయానికి వచ్చాడు మందరదేవుడు. ఒకసారి శత్రువు కోటను భేదించిన తరువాత దానిని వశపరుచుకోవటం ఏమంత కష్టంకాదు. ఆ పని ముగియగానే శత్రువులు తనకోసం వెతుకుతారు. తను ఖైదుగా చిక్కితే, చిత్రహింసలకు గురి చేయకపోయినా, ఆ క్రూర నరవాహన మిశ్రుడి చేతులలో అవమానం తప్పదు.

"పదండి, ఈ ద్రోహి చెప్పిన పడవల మాట నిజమే అయివుంటుంది. మరాళ దేవి కరుణ వుంటే మనం సురక్షితంగా మరో ద్వీపం చేరగలం. ఆ దేవి సహాయంతోనే ఈ మరాళరాజ్యాన్ని తిరిగి జయించగలం కూడా!" అన్నాడు మందరదేవుడు.


సైనికులు విచార వదనాలతో కోట వైపుకు చూచారు. కోట బురుజులనుండి ప్రతిఘటిస్తున్న మరాళ సైనికుల జాడ లేదు. కుండలినీ సైనికులు నిచ్చెనల సహాయంతో కోట గోడలపైకి నిర్భయంగా ఎగబాకుతున్నారు.



మందరదేవుడు ముందుకుసాగాడు. తమ రాజు నిరాయుధుడుగా వున్నాడని గ్రహించిన ఒక సైనికుడు, మరణించిన అంగరక్షకులదగ్గర వున్న ఒక కత్తిని తీసి రాజుకు అందించాడు. అందరూ సముద్ర తీరాన గుబురుగా కనబడుతున్న కొబ్బరి తోటకేసి బయలుదేరారు. ఉరుములూ, మెరుపులతో ధారాపాతంగా వర్షం కురుస్తూనే వుంది.

నిరాశా నిరుత్సాహాలతో కుంగిపోతూ తలలు వంచుకుని నడుస్తున్న మందరదేవుడూ, సైనికులుకూడా—వెనుక భాగాన అల్లంత దూరంలో చెలరేగిన కోలాహలం విని గిరుక్కున వెనుదిరిగి చూచారు. కోట వైపునుంచి తమకేసి హుటాహుటిగా వస్తున్న కొందరు అశ్వికులు వాళ్ళకు కనిపించారు. వెంటనే మందరదేవుడు పెద్దగా కేకవేసి—

"అరుగో, వాళ్ళు కుండలినీ సైనికులు. మనను పట్టి బంధించేందుకు వస్తున్నారు. ఈ బయలు ప్రదేశంలో మనం అశ్వికులను ఎదిరించటం ప్రమాదకరం. ముందు ఆ కొబ్బరితోట చేరటం మంచిది!" అంటూ అటుకేసి పరిగెత్తసాగాడు. సైనికులుకూడా తమ రాజును అనుసరించి పరిగెత్తారు. అందరూ కొబ్బరితోట చేరి అక్కడచెట్ల వెనక నక్కి కోటదిక్కుకేసి చూచారు. కుండలినీ అశ్వసైనికులు కొందరు వాయు వేగంతో అటువైపు వస్తున్నారు. మందరదేవుడు కత్తిదూసి, అక్కడకు అతిదాపులనున్న సముద్రంకేసి చూచాడు. ద్రోహి అంగరక్షకుడు చెప్పినట్టు అక్కడ రెండు పడవలు ఒడ్డున తేలిఆడుతున్నవి. ఒక్క ఉరుకున ఆ పడవలను చేరి సముద్ర మార్గాన్ని అనుసరించటం క్షేమమా అన్న ఆలోచన కలిగింది మందరదేవుడికి. కాని రెండవవైపుకు చూచేసరికి కుండలినీ అశ్వికులు—పదిహేనుమంది దృఢకాయులు కోటను సమీపిస్తున్నారు. వారి చేతులలో





తళతళ లాడుతున్న కత్తులు మెరుపుల్లా కాంతిని ప్రసరిస్తున్నై.

"విజయమో, వీర స్వర్గమో! మరి మార్గాంతరం లేదు," అంటూ మందర దేవుడు కత్తి ఝళిపించి, సైనికులను హెచ్చరించాడు. వారుకూడా కత్తులు దూసి చెట్లచాటున పొంచి నిలబడ్డారు. తమ శత్రువులు ఏ చెట్టుచాటున దాగివున్నదీ తెలియని కుండలినీ అశ్వికులు గుడ్డిగా తమ గుర్రాలతో చెట్ల మధ్యకు వచ్చేశారు. 'జై మరాళీ!' అంటూ మందరదేవుడు బెబ్బులిలా ముందుకు ఉరికి ఒక శత్రు సైనికుడి కంఠాన్ని కత్తితో నరికివేశాడు.

మందరదేవుడి సింహగర్జన, కుండలినీ అశ్వికుల గుండె నిబ్బరాన్ని చీకాకుపరిచింది. ఇరుకు చెట్లమధ్య చిక్కుకుపోయిన గుర్రాలను ఎటు తిప్పుకునేందుకూ సాధ్యం కాక వాళ్లు తబ్బిబ్బు పడసాగారు. ఇదే అదనుగా మందరదేవుడూ అతని సైనికులూ అశ్వికులలో ఒక్కొక్కరినే తమ వాడికత్తులతో గాయపరచసాగారు.

అశ్వికులలో నలుగురైదుగురు కింద పడగానే, ఇది పనిగాదని మిగిలిన అశ్వికులు కింద దిగి మందరదేవుడినీ, అతని సైకులనూ ఎదుర్కొన్నారు. చెట్లమధ్య బాహాబాహి యుద్ధం ప్రారంభమయింది. ఆ సంకులసమరంలో కత్తిదెబ్బలు కొన్ని శత్రువులకూ, కొన్ని గురి తప్పి చెట్ల బోదెలకూ తగలసాగినై.

పోరాటం ప్రారంభమై ఒకటి రెండు ఘడియలు జరిగేసరికి కుండలినీ సైనికులలో చాలామంది మరణించారు. చెట్ల చాటున తప్పుకుంటూ దొంగ మాటుగా ముందుకు దూకి, అంతలోనే చెట్టుచాటుకు తప్పుకుంటూ మందరదేవుడూ, అతడి సైనికులూ చాలామంది శత్రువులను తుద ముట్టించారు. అక్కడకు వచ్చిన పదిహేను మంది అశ్వికులలో అధిక భాగం మర

ణించటమో, గాయపడి బొబ్బరించటమో ప్రారంభించేసరికి , మిగతావాళ్ళు గుండె ధైర్యం సన్నగిల్లి అక్కడినుంచి పారిపోసాగారు. అలా పారిపోయే శత్రువులను, 'జై మరాళీ!' అని అరుస్తూ మందరదేవుడి సైనికులు వెనుకనుంచి కత్తులతో ఎదుర్కొని మరికొందరిని హతమార్చారు.

కొద్దిసేపటిలో అంతా సద్దుమణిగింది. ఆకాశాన ఉరుముల రణగొణ ధ్వనితప్ప— కోట ప్రాంతంనుంచికూడా ఏ ధ్వనీ రావటం లేదు. చావు తప్పించుకున్న కుండలినీ సైనికులు కొందరు మాత్రం గుర్రాలను ఆ కొబ్బరితోటలోనే వదిలి, కోటకేసి పరిగెత్తుతున్నారు. ఆసరికి కోట కుండలినీ సైనికులవశం అయిపోయింది. రాజప్రాసాద ప్రాంతంలో యింకా ఎదిరిస్తున్న కొద్దిమంది మరాళ సైనికులు మాత్రం వున్నారు.

మందరదేవుడికీ, అతడి సైనికులకూ స్వల్పమైన దెబ్బలు తప్ప ప్రమాదకరమైన గాయాలేమీ తగలలేదు. కాని అందరూ బాగా డస్సిపోయివున్నారు.


మందరదేవుడు కత్తి ఒరలో పెట్టి "ఇకమనం జాగుచేయటం క్షేమంకాదు," అంటూ తీరం దగ్గిర వున్న పడవలకేసి బయలుదేరాడు. నలుగురు సైనికులూ ఒకసారి తలలుఎత్తి కోటప్రాంతంకేసి చూసి తమరాజును అనుసరించి నడిచారు.

ద్రోహి అయిన అంగరక్షకుడు చెప్పినట్టుగా రెండు పడవలైతే సముద్రతీరాన వున్నవికాని—అవి సముద్రంమీద దూర ప్రయాణానికి పనికివచ్చేవి కావు. అవి చాలా చిన్న పడవలు. తెరచాపల్లాంటి సాధనాలతో కాక కేవలం తెడ్ల సహాయంతోనే వాటిని నడపవలసివుంటుంది.

మందరదేవుడు పడవలను సమీపించి హఠాత్తుగా ఏదో ఆలోచన వచ్చినవాడులా సైనికులకేసి చూసి తల పంకించాడు.

—(ఇంకావుంది)






## 3

[నిరాయుధుడైన మందరదేవుణ్ణి బంధించి సముద్రతీరంకేసి తీసుకుపోతున్న ద్రోహులిద్దరూ, హఠాత్తుగా పిడుగుపడి మరణించారుగదా? తరవాత మందరదేవుణ్ణి, అతడి సైనికులనూ కుండలినీ అశ్వికులు ముట్టడించారు. అప్పుడు జరిగిన పోరాటంలో అశ్వికులలో చచ్చినవారు చావగా మిగిలినవారు కోటవైపుకు పరుగెత్తారు. తరవాత—]

మందరదేవుడి ముఖ లక్షణాలనుబట్టి, ఆయన ఏదో దీర్ఘాలోచనలో వున్నాడని సైనికులు గ్రహించారు. ఆయన ఒకమారు సముద్రంకేసీ, కోటకేసీ చూసి పెద్దగా నిట్టూర్చాడు. సైనికులు తమ రాజును కలవరపరుస్తున్న సంగతి ఏమిటా అనుకునేంతలో మందరదేవుడు యిలా చెప్పాడు.

"మనం ఈ రాజ్యాన్ని ఎంత త్వరగా వదిలిపోతే అంత క్షేమం. చావు దెబ్బలు తిని పారిపోయిన ఆ కుండలినీ అశ్వికులు, మనసుగురించిన వర్తమానం వాళ్ళ నాయకుడికి తెలియబరుస్తారు. ఆతరవాత వాళ్ళు ఇనుమడించిన బలగంతో మనను ముట్టడిస్తారు. ఈ చిన్న పడవలలో యీ మహాసముద్రంమీద బయలుదేరి కానని ద్వీపాలకేసి మనం పోవలసి వుంటుంది. ఏ క్షణాన ఏ ప్రమాదం మనను చుట్టుముట్టుతుందో తెలీదు. మీ నలుగురు కూడా నాతోపాటు యీద్వీపాన్ని వదలదలుచుకున్నారా ?" అని అడిగాడు.

అందుకు సైనికులు నలుగురూ ఏకకంఠంతో, "మహారాజా! మేం యింత



కాలంగా మీ ఆశ్రయంలో బ్రతికినవాళ్ళం. కష్టసమయంలో మిమ్మల్ని విడిచిపోయేంత విశ్వాశఘాతకులం కాదు," అన్నారు. మందరదేవుడు సైనికుల రాజభక్తిని మెచ్చుకుంటూ యిలా అన్నాడు.

"నేను మీ రాజభక్తిని శంకించటం లేదు. నావరకు నేను అవివాహితుణ్ణి. యుద్ధ ప్రకటనలాటి రాజధర్మాన్నికూడా పాటించకుండా, హఠాత్తుగా నా రాజ్యంమీద దాడి చేసి వశపరుచుకున్న నరవాహనమిశ్రుడిని ఏనాటికైనా హతమార్చటం తప్ప, నాకు మరో జీవితాశయంలేదు. కాని మీరు... భార్యాబిడ్డల్నీ, బంధువర్గాన్నీ...."

"అలాంటి బంధనాలేమీ మాకులేవు మహారాజా!" అన్నారు సైనికులు.

మందరదేవుడు సైనికులకేసి వాత్సల్యం వుట్టిపడేలా చూచి, "ఐతే, యిక మనం జాగుచేయుటం మంచిదికాదు. పడవ లెక్కండి," అంటూ వారిని హెచ్చరించాడు.

పడవలు రెండూ పెద్దతాళ్ళతో ఒడ్డున పాతివున్న కొయ్యమేకులకు బంధించబడి వున్నవి. సైనికులు వాటితాళ్ళను విప్పారు. ఒక పడవలో రాజూ, ఇద్దరు సైనికులూ, రెండవ పడవలో మిగిలిన యిద్దరు సైనికులూ ఎక్కి కూర్చున్నారు.

పడవలు రెండూ తెడ్లసహాయంతో అల్లకల్లోలంగావున్న సముద్రంలోకి నడవబడినై. ఆసరికి తుఫాను కొంత శాంతించింది. ఉరుములూ, మెరుపులూ కూడా తగ్గిపోతున్నై. వానజల్లు మాత్రం వుండి వుండి పడుతోంది. సూర్యుడు అస్తమించాడు. అన్నిదిక్కులా కమ్ముకుంటున్న చీకటిని పున్నమిచంద్రుడు, సముద్రతీరాన వున్న గుబురుచెట్లల్లోకి, సముద్రగర్భంలోకి తరిమేస్తున్నాడు.

పడవలు సముద్రంలోకి చాలా దూరం వెళ్లినై. ఎటుపోతున్నాం, ఎక్కడికి పోతున్నాం? అన్న ఆలోచన ఎవరికీ కలగలేదు.

నరవాహనమిశ్రుడి చేతికి అందకుండా వున్నంతవరకూ, ఎక్కడికి వెళ్ళినా ఒకటే అన్నట్టు భావించారు మందరదేవుడూ, అతడి సైనికులూ.

సముద్రంలో నాలుగైదు గంటల ప్రయాణం తర్వాత వారికి దూరంగా మినుకుమినుకుమంటూ అలలమీద తేలియాడుతున్న కాంతి కనిపించింది. ఇంత తుఫానులో, చేపలు పట్టేందుకు అంత దూరం సముద్రంలో ప్రయాణించే పల్లెవాళ్ళు ఎవరూ వుండరు. ఐతే, ఒకవేళ అవి తమను వెంబడిస్తున్న నరవాహనమిశ్రుడి నావలు కావుగదా?



ఈ సంశయం, భయం కలిగిందే తడవుగా మందరదేవుడు పడవలో లేచి నిలబడ్డాడు. మినుకుమినుకుమంటున్న దీపాల కాంతి క్రమక్రమంగా అటుకేసే వస్తోంది. బాగా పరీక్షించి చూచినమీదట అవి అంత పెద్దవికాని రెండు పడవలని మందరదేవుడు గ్రహించాడు.

"అల్లకల్లోలంగావున్న యీ సముద్రం మీద మరో యుద్ధం తప్పక పోవచ్చు. ఆ దీపాలకాంతి, మనలాగే తప్పుకు పారిపోతున్న మనదేశపు పడవలదైతే ఫరవాలేదు. అలా కానప్పుడు అవి కుండలినీ నావలే అయివుంటవి. మనలో ఎవరిదగ్గరా విల్లంబులు లేవుగదా?" అని అడిగాడు మందరదేవుడు. సైనికులలో ఒకడు వెంటనే యిలా జవాబిచ్చాడు.

"మహారాజా! మనదగ్గర ఖడ్గాలుతప్ప మరేంలేవు. మహామంత్రి మమ్ము నలుగురనూ, మీరక్షణకు పొమ్మనప్పుడు—వున్నవాళ్ళం వున్నట్టు బయలుదేరాం."

"ఫరవాలేదు," అన్నాడు మందరదేవుడు. "మహాళదేవికరుణా, మనచేతి పదునుకత్తులూ మనరక్షణకు చాలు! ఒకవేళ మరణమే తప్పనిసరైతే—ప్రాణం పోయింతరవాత యీ శరీరం సముద్ర

గర్భంలో చేపలకు ఆహారమైతేనేం? భూగర్భంలో క్రిమికీటకాలకు ఆహారమైతే నేం? ఏదైనా ఒకటే!"

మందరదేవుడి యీ మాటలు సైనికులకు ధైర్యాన్ని కలిగించినై. అంతలో, దూరంగా మినుమినుకుమంటున్న పడవలు దగ్గరదగ్గరకు రాసాగినై. బాగా కనుచూపు దూరంలోకి వచ్చేసరికి—ఆ పడవలలో నుంచి ఒక దీర్ఘకాయుడు ధనుస్సు చేబూని లేచి నిలబడ్డాడు.

చంద్రకాంతిలో ఆతడి ముఖకవళికలు సరిగా కనుపించకపోయినా, అతడు ఆజానుబాహువని మాత్రం తెలుస్తూనేవుంది.


"అనుమానం రూఢీ అయింది. వాళ్ళు విల్లంబులతో సర్వసన్నద్ధంగా వచ్చారు. మనం మాత్రం వాళ్ళ పడవలు అందుబాటులోకి వచ్చేవరకు, వాళ్ళ బాణాల బారిపడకుండా—లోపలకు దిగి కూర్చోవటం మంచిది," మందరదేవుడు యిలా హెచ్చరించేలోపల రివ్వుమంటూ ఒక బాణం వచ్చి, అతడు నుంచున్న పడవకు తగిలింది. వెంటనే మందరదేవుడూ, సైనికులూ పడవ లోపలిభాగంలోకి దూకి, తలలు వంచుకు కూర్చున్నారు.

మనుషులు ఒకరినొకరు హెచ్చరించుకోవటమూ, బలంగా తెడ్లువేయటమూ,



దాక్కున్న మందరదేవుడికీ, సైనికులకూ వినబడుతూనేవుంది. శత్రువులు అతి వేగంగా తమను సమీపిస్తున్నారని వారు గ్రహించారు. శత్రువులు కత్తివేటుకు అందేంతదగ్గరకు వచ్చేవరకు యిలా పడవలలో వంగి కూర్చోవలసిందే, తరవాత బాహాబాహీ యుద్ధంలో—ఎవరు అదృష్టవంతులో, సాహసవంతులో వాళ్లు గెలుస్తారు!

ఇలాంటి ఆలోచనలతో ప్రాణాలు వుగ్గపట్టుకు కూర్చున్న సైనికులకూ, మందరదేవుడికీ, 'జై సమరసేన్!' అన్న భీకర నినాదాలు వినిపించినై. ఈ కొత్త జయ జయధ్వానం ఏమిటా అన్న ఆశ్చర్యంలోంచి బయటపడకముందే మందరదేవుడు కూర్చున్న పడవను, మరో పడవ వేగంగా తాకి, తల్లకిందులు చేసేంత ప్రమాదం సంభవించింది. తృటిలో మందరదేవుడు కత్తిదూసి లేచి నిలబడ్డాడు. 'జైమరాళీ!' అన్న అతడి సింహనాదం సముద్రంమీద మారుమోగింది. ఆక్షణంలోనే అతడి చేతనున్న కత్తి మెరుపులా ఒక శత్రువును తాకింది. వాడు చావుకేక పెట్టి సముద్రంలో పడిపోయాడు. అంతలో మందరదేవుడి నలుగురు సైనికులూ భీకరంగా అరుస్తూ ఎదిరి పడవలమీదికి లంఘించారు. కాని అంతలోనే "ఆగండి, ఆగండి! మనం శత్రు





ఫలం కాదు!" అన్న పెద్దకేక అందరినీ నిర్విణ్ణులనుచేసింది. అసలికే మరో యిద్దరు మందరదేవుడి సైనికుల కత్తిపోట్లకు, అరుస్తూ సముద్రంలోకి దొర్లిపోయారు.

మందరదేవుడు కత్తి పైకెత్తి "ఐతే మీరెవరు? కుండలినీ నరవాహనమిత్రుడి సైనికులు కారా?" అంటూ కఠినంగా ప్రశ్నించాడు.

"మేము కుండలినీవాసులమే! కాని, నరవాహనమిత్రుడు మాకు ప్రబల శత్రువు. మీరు మరాళద్వీపవాసులైతే—మనమంతా స్నేహితులం, కత్తులు దించండి!" అన్నాడు ఒక దీర్ఘకాయుడు.

ఇందులో ఏమైనా మోసంవున్నదా అన్న సంశయం కలిగింది మందరదేవుడికి. కాని, అంతలోనే అతడు స్థిమితపడి, "ఐతే మీ నాయకుడెవరు? అతడి పేరేమిటి?" అని ప్రశ్నించాడు.

"నాపేరు శివదత్తుడు. ఈ పడవలలో వున్నవారందరూ నా అనుచరులు!" అన్న జవాబు వచ్చింది.

"స్వాగతం, శివదత్తా! స్వాగతం," అన్నాడు మందరదేవుడు మహోత్సాహంతో, "అప్పటికి ఇరవైఏళ్లక్రితం–అంటే నేను పది సంవత్సరాల ప్రాయపువాడుగా వుండగా, మీపేరూ, కుండలినీ మహాసేనాని అయిన సమరసేనుడి పేరూ విన్నాను. మీరూ, సమరసేనుడూ ఎక్కడో భయంకర ద్వీపాల్లో చేసిన సాహసోపేత కార్యాలు, కథలలా వినేవాడిని. ఇప్పుడు స్వయంగా ఆ మహాసేనాని ముఖ్యానుచరులైన మిమ్మల్ని చూచేభాగ్యం కలిగింది. హృదయపూర్వక స్వాగతం!"

"మీరెవరు? మరాళద్వీపరాజైన మందరదేవులు కాదుగదా?" అన్నాడు శివదత్తుడు.

"అవును. నేను రెండుగంటల కిందటి వరకూ మరాళద్వీపరాజైన మందరదేవుణ్ణి! కాని, యిప్పుడు కేవలం మందరదేవుణ్ణి!



నారాజ్యం, నాకిరీటం నరవాహనమిత్రుడి పాదాక్రాంతమైపోయినవి!" అన్నాడు మందరదేవుడు.

శివదత్తుడు జవాబేమీ యివ్వలేదు. అతడి అనుచరులతోవున్న రెండు పడవలూ, మందరదేవుడి పడవలపక్కగా వచ్చి ఆగినై. శివదత్తుడు, మందరదేవుడున్న పడవలోకి వచ్చాడు. అతడేదో చెప్ప దలచి అలా వచ్చినట్టు గ్రహించిన మందరదేవుడు, తనపక్కగా అతడికి కూర్చునేందుకు చోటు చూపాడు.

శివదత్తుడు కూర్చుంటూనే, "రాజ్యంతోపాటు, రాజబిరుదంకూడా పోతుందనటంలో సత్యం లేకపోలేదు. సరే, మిమ్మల్ని మందరదేవులనే పిలుస్తాను. ఇప్పుడు తమ ప్రయాణం ఎక్కడికి? గమ్యస్థానం ఏదో నాకు చెప్పవచ్చునా?" అని అడిగాడు.

మందరదేవుడు నిట్టూర్చి, అంతలో చిరునవ్వు నవ్వాడు. "నాగమ్యస్థానం ఏదో నాకే తెలియదు. నరవాహనమిత్రుడి చేతులలో పడకుండా తప్పించుకు పోవటమే ప్రస్తుతానికి నేను చేస్తున్నపని. వీరు నలుగురూ నా సైనికులు," అన్నాడు.

"చాలా బావుంది. అంటే యిద్దరం ఒకేరకమైన పరిస్థితులలో వున్నామన్న మాట! నేనూ అక్రూరుడి బారినుంచి తప్పించుకు పోవటమే ఆశయంగా బయలుదేరాను." అన్నాడు శివదత్తుడు.

అంతలో మందరదేవుడి సైనికులలో ఒకడు లేచి, "మహారాజా! తీరంకేసి చూడండి! ఒకేసారి అన్ని దీపాలు కదలటం ఆశ్చర్యంగాలేదా? అవన్నీ సముద్రం మీదికి బయలుదేరిన పడవలని నావుద్దేశం. శత్రువులు మనకోసమై బయలుదేరటం లేదుగదా?" అన్నాడు.

శివదత్తుడూ, మందరదేవుడూ తీరంకేసి చూచారు. సైనికుడు చెప్పినదానిలో అతిశయోక్తి ఏమీలేదు. తీరప్రాంతమంతా

దీపాలకాంతితో ప్రకాశిస్తున్నది. గాలిలో ఎగిరే పెద్దపెద్ద మిణుగురు పురుగులా అన్నట్టు అలలతాకిడికి, దీపాలతోవున్న పడవలు పైకి కిందికీ కదులుతున్నవి.


"మనం సూటిగా సముద్రంలోకి పోగలిగినంత దూరం పోవటం, అన్నివిధాలా శ్రేయస్కరం. అదృష్టవంతులమైతే ఏదైనా ద్వీపాన్ని చేరగలం, లేకపోతే విధివ్రాత... అంతకన్న మరేంలేదు. ఏపరిస్థితులలోనూ నరవాహనమిశ్రుడి చేతబడటం సహించరానిది," అన్నాడు శివదత్తుడు.


మందరదేవుడు అంగీకార సూచకంగా తలవూపాడు. నాలుగు పడవలూ తెర్లసహాయంతో మహాసముద్రంమీదికి బయలుదేరాయి. వాళ్లు అనుమానించినట్టు తీరాన కనబడిన దీపపు కాంతులు, నరవాహనమిశ్రుడి నావికాదళానివే! వాళ్లూ సముద్రం మీదికి బయలుదేరారు. తమను ఆ పడవలు వెంబడిస్తున్నవని గ్రహించిన శివదత్తుడు, తమ పడవల్లోవున్న దీపాలను ఆర్పివేయించాడు.

ఇప్పుడు పడవలు నాలుగూ, చీకట్లో నడుస్తున్నవి. ఒకదానినొకటి తాకి ప్రమాదం కలగకుండా వుండేందుకు, వాటిని నడిపేవారు తగు జాగ్రత తీసుకున్నారు. మందర దేవుడు, నక్షత్రాలతో మిలమిలలాడుతున్న ఆకాశానికేసి ఓమారు చూచి,

"శివదత్తా! కుండలినీ ద్వీపవాసులూ, మహాసేనాని సమరసేనుని అనుచరులైన మీకుకూడా, యీవిధంగా ఆ ద్వీపాన్నివదిలి ఎందుకు పారిపోవలసి వచ్చింది? నాకు చాలా ఆశ్చర్యంగావుంది!" అన్నాడు.

శివదత్తుడు ఒక్కక్షణం ఆలోచించి, "అంతా ఆ నరవాహనమిశ్రుడి కుటిల రాజనీతిప్రభావం. పోతే యిందులో సమరసేనుడి తప్పు కొంత లేకపోలేదు. ఆ సంగతంతా చెపుతా వినండి!" అంటూ ప్రారంభించాడు. —(ఇంకావుంది)






## 4

[కుండలినీ సైనికులకు తనకోట వశమైపోగానే, మందరదేవుడు నలుగురు సైనికులను వెంటతీసుకొని పడవలలో సముద్రంమీద బయలుదేరాడు. పడవలలో వస్తున్న మరి కొందరితో సముద్రంమీద యుద్ధం జరిగింది. ఆ పడవలలో ఉన్నది శివదత్తుడు! అతణ్ణి మందరదేవుడు కుండలినీరాజ్య పరిస్థితులనుగురించి అడిగాడు. తరవాత—]

మందరదేవుడికి, శివదత్తుడి మాటలు చాలా ఆశ్చర్యం కలిగించినై. ఎంతో అనుభవజ్ఞుడూ, ధైర్యశాలీ అయిన సమరసేనుడుకూడా, రాజ్యపాలనా వ్యవహారాల్లో ఎలా పొరబాట్లు చేశాడో అతడికి అర్థం కాలేదు. కానని ద్వీపాల్లో, అనేక సాహస కృత్యాలుచేసి తెచ్చిన సంపద, కుండలినీ ద్వీప వాసులకు మేలుచేయకపోగా కీడు కలిగించిందని అతడికి తోచింది.

"శివదత్తా! సమరసేనుడు, మంత్రాల దీవినుంచి తెచ్చిన ధనరాసుల వల్ల మీకు సర్వసౌఖ్యాలూ సమకూర్చిందని నేను భావించాను?" అన్నాడు మందరదేవుడు.

శివదత్తుడు బిగ్గరగా నవ్వి, "మందరదేవా! ఆ ధనరాసులే కుండలినీద్వీపంలో యింత అరాచకానికి కారణభూతమైనై. మేము ఆ నావతో కుండలినీద్వీపం చేరే సరికి రాజైన చిత్రసేనుడూ, ప్రజలూ మాకు ఘనస్వాగతం యిచ్చారు. వరసగా నెల రోజులపాటు రాజధానీ నగరం వేడుకలతో కళకళలాడింది. చిత్రసేనుడు ప్రజలమీద నామమాత్రంగా వున్న పన్నులుకూడా



చిత్రసేన మహారాజు, రాజోద్యోగులకు జీతాలు రెండుమూడు రెట్లు పెంచాడని చెప్పానుగదా? ఆ డబ్బుతో వాళ్ళు విలాసాల్లో మునిగిపోసాగారు. ఇక పల్లెల్లోని వ్యవసాయదార్లుకూడా, కట్టవలసిన పన్ను చిల్లిగవ్వపాటికూడా లేకపోయేసరికి, వాళ్ళకూ నడుంవంచి పంటలు పండించవలసిన అవసరం అంతగా కనబడలేదు. వాళ్ళు కుటుంబ పోషణకు అవసరమైనన్ని తిండి గింజలు మాత్రం పండించుకుని, తతిమ్మా పొలాన్ని బీడుగా వుంచసాగారు. ఆహార పదార్థాలకొరత ఏర్పడింది.

రద్దుచేశాడు. రాజోద్యోగుల జీతాలు రెండింతలు మూడింతలుగా పెంచాడు!" అన్నాడు.

"అయితే, రాజ్యంలోని ప్రతి ఒక్కరూ సర్వసుఖాలు అనుభవించారనుకుంటాను!" అన్నాడు మందరదేవుడు.

"మందరదేవా! సావధానంగా వినండి, చెబుతాను!" అంటూ శివదత్తుడు ప్రారంభించాడు. "ఎప్పుడైతే ధనాగారం వెండి బంగారాలతో నిండిపోయిందో, అప్పుడే రాజైన చిత్రసేనుడికి రాజ్యపాలనా విషయాల్లో శ్రద్ధ తగ్గింది. 'కావలసినంత ధనం తెచ్చాను, ఇక దేశప్రజలకు లోటేమిటుంటుంది,' అనుకున్నాడు సమరసేనుడు.


ఈ కారణంవల్ల పట్టణాలకు రావలసిన ఆహారపదార్థాలు రావటం తగ్గింది. పట్టణ ప్రజలు గుంపులుగుంపులుగా గ్రామాలకు బయలుదేరి, ఆహార పదార్థాలను ఒకరికన్న మరొకరు పోటీపడి, ఎక్కువ వెలకు కొనసాగారు. ఆ విధంగా తమవద్ద చేరిన డబ్బుతో ఏంకొనాలో తెలియని వ్యవసాయదారులు, వడ్ల ధరలూ, కూరగాయల ధరలూ మరికొంత పెంచారు.


క్రమక్రమంగా రాజ్యం అరాజకంపాలు కాసాగింది. పెద్దపెద్ద మొత్తాలు చెల్లించి ఆహారధాన్యాలు కొనుక్కోలేని పట్టణవాసులు, ముఠాలుగా బయలుదేరి, రాత్రి


వేళల్లో గ్రామాలమీద పడి దోచుకోసాగారు. దీనికి ప్రతిగా గ్రామాల్లోవుండే ప్రజలు బస్తా వడ్లగింజల విలువ దాని ఎత్తు బంగారం అని నిర్ణయించేశారు. వాళ్ళు ముఠాలుగా తయారై, చేతికిదొరికిన ఆయుధాలతో ఆత్మరక్షణకు సర్వసన్నద్ధమయారు.

విలాస కాలక్షేపాల్లో మునిగిపోయిన చిత్ర సేన మహారాజుకు యివేమీ తెలియవు. నిజం చెప్పాలంటే; ఆయనతోపాటు, నేనూ, సమరసేనుడుకూడా అదే పొరపాటుచేశాం. కారణం, దేశంలో ఏమూల ఏం జరుగుతున్నదీ మాకూ తెలియదు. ధనాగారాన్నుంచి, ధనం మంచినీళ్ళప్రాయంగా ప్రజలమీదికి ప్రవహిస్తున్నా దాని అవసరం కలిగినవాళ్ళు చాలామంది వుండేవాళ్ళు. ఆహార పదార్థాల ధరలు లోగడకన్న వెయ్యిరెట్లు రెండువేల రెట్లు పెరగడంతో ఎవరికీ ఎంత ధనమున్నా చాలేదికాదు.

ఇక, చిత్రసేనమహారాజు కాలక్షేపం కోసం ప్రతిరోజూ ఏర్పాటుచేయించే వినోద ప్రదర్శనాల్లో వుండే వినోదం చాల చిత్రమైంది! ఇప్పుడాలోచిస్తే అవి వినోదప్రదర్శనాలు అనేందుకు చాలా సిగ్గుపడుతున్నాను. కాని అప్పట్లో వాటిని చూచేందుకు పౌరులు వందల వేల సంఖ్యలో వచ్చేవాళ్లు. ఇక ప్రదర్శనాల సంగతి:







అప్పుడే అడవినుంచి పట్టుకు వచ్చిన ఒక క్రూరమైన సింహాన్ని కటకటాలమధ్య వదిలేవారు. దానిని ఎవరైనాసరే ఖడ్గమాత్ర సహాయంతో సంహరించగలిగితే, అలాంటి వారికి, చచ్చిన సింహం బరువు బంగారం బహూకరింపబడేది. ధనకాంక్షతో చాలా మంది సాహసయువకులు సింహంతో పోరాడేందుకు వచ్చేవారు. దురదృష్టవంతులు సింహానికి బలి అయ్యేవారు, అదృష్టవంతులు దానిని చంపి, అంత ఎత్తు బంగారమూ గెలుచుకునేవాళ్లు.

రాను రాను యీ వినోదాలు అతి క్రూరంగా, అనాగరికంగా తయారైనై. ఏనుగుల పోరాటాలూ, ఏనుగుకూ, సింహానికీ మధ్య పోరాటం ... వినోద ప్రదర్శనలు యీవిధంగా వుండేవి. నేను, సమరసేనుడితో యిందులో వున్న క్రౌర్యాన్నిగురించి చెప్పిచూశాను. కాని, అయనకు నా మాటమీదకన్న, లోగడ మంత్రాలదీవిలో తనతో పాటు వున్న నరవాహనమిత్రుడనే సైనికుడి మాటమీద ఎక్కువ గురి.

"ధనాగారంలో ధనానికేం కొదవలేదు. రాజు వృద్ధుడు. మనదేశ ప్రజలను ధైర్యవంతులుగా, సాహసవంతులుగా చేయవలసిన బాధ్యతకూడా వుంది. అలాంటప్పుడు రాజు వినోదంకోసం యిలాంటి ప్రదర్శనాలు ఏర్పాటు చేయటంలో వున్న తప్పేమిటి?" అనేవాడు సమరసేనుడు.

రాజూ, రాజోద్యోగులూ యిలాంటి విలాసాల్లో మునిగివుండగా, గ్రామప్రాంతాల్లో చాలా విచిత్రమైన మార్పులు రాసాగినై. అక్కడ కాస్త బలవంతుడూ, నోరుగలవాడూ అయిన ప్రతివ్యక్తీ, ఒక చిన్న రాజై కూర్చున్నాడు. కొందరు అనుచరుల్ని సంపాయించటం, పక్కగ్రామంమీద దాడిచేసి, వాళ్లను లోబరుచుకోవటం—ఇది పరిస్థితి. ఈ విధంగా ఒకే రాజ్యంలో, చిన్న చిన్న రాజ్యభాగాలు ఏర్పడినై. ప్రజలతో



చూచినా రాజులూ, మహారాజులూ, సామ్రాట్టులూ బయలుదేరారు.

ఒకనాటి సాయంకాలం వినోదప్రదర్శనాలు తిలకిస్తున్న చిత్రసేనమహారాజుకు, ఒక దూతవచ్చి పత్రం ఒకటి చేతికిచ్చాడు. రాజు అది ఏమిటో చూడమని, పక్కన వున్న సమరసేనుడికి యిచ్చాడు. సమరసేనుడు అది చదువుతూనే వెలవెలపోయాడు. అతడి మొహాన కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు.

"మహారాజా, మీరు యిప్పటికి యీ ప్రదర్శనాలు సరిపెట్టి రాజభవనానికి రాకోరుతున్నాను. రాజ్యాంగవిషయం, మీతో మాట్లాడాలి, అవసరం!" అన్నాడు సమరసేనుడు. చిత్రసేనుడు అయిష్టంగా నాకేసి, సమరసేనుడికేసి చూసి అక్కడినుంచి బయలుదేరాడు. నేను శెలవు తీసుకొని వెళ్లిపోయేటంతలో, సమరసేనుడు నన్నాపి, "శివదత్తా! చాలా ముఖ్యవిషయం. నీవుకూడా రావాలి!" అన్నాడు. ముగ్గురం రహస్య మందిరానికి వెళ్ళాం. సమరసేనుడు, దూత తెచ్చిన పత్రం మాకు చూపుతూ ఇలా చెప్పాడు:

"ఇంతకాలంనుంచి మనం కళ్ళుండీ లేనివాళ్లం అయాం! ఈ కుండలినీ

పూర్తిగా సంబంధాలు కోల్పోయిన, చిత్రసేనుడికీ, అతడి వుద్యోగులకూ యివేమీ తెలియవు. కొంతగా కొంత యీ దుష్టపరిణామాలు తెలుసుకున్న నామాట అప్పట్లో ఎవరికీ రుచించలేదు.

దేశంలో వర్తకవ్యాపారాలూ, వ్యవసాయం సమూలంగా నాశనమైనై. అన్నిటికి తెగించిన కొందరు, బందిపోటు ముఠాలుగా తయారై పట్టణాలనూ, పల్లెలనూ దోచుకోసాగారు. కాలక్రమాన చిత్రసేనుడి పరిపాలన రాజప్రాసాదానికి పరిమితమైపోయింది. దేశంలో అతణ్ణి తలచేవాడే లేదు. పుట్టగొడుగుల్లా దేశంలో ఎక్కడ



ద్వీపంలో మనకు తెలియకుండానే కొందరు రాజులూ, మహారాజులూ మొలకలెత్తారు. వాళ్ళల్లో కొందరు మనకి సందేశం పంపారు. దుష్టుడూ, అసమర్థుడూ అయిన రాజును తొలగించ దలిచారట! కోట తమవశంచేసి, లొంగిపొమ్మని వీళ్ళ అంత్య సందేశం."

అప్పటిగ్గాని చిత్రసేన మహారాజుకు ఇంతకాలంనుంచి పట్టిన మత్తు వదిలింది కాదు. ఆయన నిద్రలోనుంచి హఠాత్తుగా లేచినవాడులా, సమరసేనుడికేసి కళ్లు పెద్దవిచేసి చూశాడు. ఆ వెంటనే కాళ్లతో నేలను గట్టిగా తన్ని, "సమరసేనా! రాజ్య పరిస్థితులు కొంత చేజారినట్టే తోస్తున్నది. ఈ పొగరుబోతుల పీచ మణచక తప్పదు. తతిమ్మా వాళ్ళకు కూడా గుణపాఠంగా వుండేట్టుగా, ఆ ముఖ్యనాయకులను పట్టి చిత్రవధ చేయించవలసింది," అన్నాడు.

"సరే, మహారాజా, శెలవు! మళ్లీ కలుసుకుంటాను," అని సమరసేనుడు గదినుండి బయటికి వచ్చేశాడు. నేను ఏమీ మాట్లాడకుండా ఆయన్ని అనుసరించి కొంతదూరం నడిచాను. హఠాత్తుగా సమరసేనుడు ఒక చోట తక్కున ఆగి:

"శివదత్తా! దీన్నిగురించి నీ అభిప్రాయమేమిటి?" అన్నాడు. అలా సమరసేనుడు హఠాత్తుగా ప్రశ్నించేసరికి నేను గతుక్కుమన్నాను. దేశం అరాజక స్థితిలో వున్నదనీ, నోరుగలవాళ్ళు కొందరు ప్రజలను కూడ గట్టుకుని, వాళ్ళల్లో వాళ్ళు పోరాడుతున్నారనీ తప్ప, నాకు మరేం తెలియదు. చివరకు మహారాజునే ఎదిరించేంత బలశాలులు బయలుదేరారనేసరికి నాకు ఎక్కడలేని ఆశ్చర్యం కలిగింది. కాని, ఒహటి, సమరసేనుడికి దేశపరిస్థితుల్ని గురించి నాకు తెలిసినపాటి కూడా తెలియదని అసరికి గ్రహించాను!

"శత్రువులు బలశాలురనే నాకు తోస్తున్నది. అలా కానప్పుడు వాళ్ళు నగరంమీద

హఠాత్తుగా దాడిచేసివుండేవాళ్లు. ముందుగా హెచ్చరికచేసి, దాడికి రావటం అంటే.... మీరే ఆలోచించండి!" అన్నాను.

సమరసేనుడు ఒకటిరెండు నిమిషాలు మాట్లాడలేదు. తరవాత తలపంకిస్తూ "శివదత్తా! నీవు చెప్పినదాంట్లో కొంత సత్యం లేకపోలేదు. అయినా మనకు సుశిక్షితమైన సైన్యంవుంది. అనుభవజ్ఞులూ, సమర్థులూ, నమ్మకస్తులూ అయిన నాయకులున్నారు. కనుక ఈ దేశద్రోహుల్ని కాలరాచటం ఎంతోసేపు పట్టదు!" అన్నాడు.


సమరసేనుడు, 'నమ్మకస్తులైన నాయకులు,' అన్నది ఎవరినుద్దేశించో నాకు చూచాయగా తెలిసినట్టయింది. వాళ్ళు, తనతోపాటు మంత్రాలదీవిలో పడరానిపాట్లు పడిన కొద్దిమంది సైనికులూ, వాళ్లలో ముఖ్యుడైన నరవాహనమిత్రుడూ.

"అయితే యీ ద్రోహుల్ని మట్టుపెట్టడం, ఎంత త్వరగా సాధిస్తే అంత మంచిది, సైన్యాన్ని సమాయత్తపరచండి. మీ నాయకత్వం ఎంతటి కష్టకార్యాన్నయినా సాధించగలదు," అన్నాను.

సమరసేనుడు నాకేసి ఆశ్చర్యపడుతూన్నట్టు చూసి "ఈ స్వల్ప కార్యానికి నువ్వుగాని, నేనుగాని స్వయంగా సైన్య నాయకత్వం వహించటం హాస్యాస్పదంగా వుంటుంది. నమ్మకస్తుడూ, ధైర్యశాలీ అయిన నరవాహనమిత్రుడికి ఈ పని వప్పచెప్ప దలిచాను," అన్నాడు.

నరవాహనమిత్రుణ్ణి గురించి అప్పటికే కొన్ని విషయాలు వినివున్నాను. అతడి ప్రవర్తన నాకు చాలాకాలంగా అనుమాన కారణం అవుతున్నది. కానీ, ఆ సంగతి సమరసేనుడికి యిప్పటి పరిస్థితుల్లో చెప్పటం శ్రేయస్కరం కాదనిపించింది. అట్లని నాయకత్వం నరవాహనుడికి పోనీయటం ప్రమాదకరం! యిప్పుడు చేయవలసిందేమిటి? —(ఇంకావుంది)






## 5

[మందరదేవుడికి, శివదత్తుడితో పరిచయం అయిందికదా? అప్పుడు శివదత్తుడు, కుండలినీద్వీప రాజు వినోదాలతో కాలక్షేపం చేయటం, దేశం అరాజకంపాలు కావటం, చివరకు రాజధానీనగరాన్ని శత్రువులు ముట్టడించటం, ఆ పరిస్థితుల్లో సేనానాయకత్వం నరవాహనుడికి లభించే ప్రమాదం కలగటం — అంతా చెప్పుకుపోతున్నాడు. తరవాత—]

శివదత్తుడు చెపుతున్నదంతా, శ్రద్ధగా ఆలకిస్తున్న మందరదేవుడికి, కొనకొనాసకి ఆశ్చర్యం అధికం కాసాగింది. మహా సముద్రంమీద, ఆ కారుచీకటిలో పడవలు ఎటుకేసి పోతున్నదీ అతను గమనించటం లేదు. చివరకు అతడు శివదత్తుడి మాటలకు అడ్డువచ్చి, "శివదత్తా, సేనానాయకత్వం దుష్ట నరవాహనమిత్రుడిపాల బడకుండా, మీరు అడ్డుకోలేకపోయారా? మీరే స్వయంగా సేనానాయకత్వం స్వీకరిస్తే సరిపోయేదిగదా!" అన్నాడు.

ఆ మాటలకు శివదత్తుడు నవ్వి, "మందరదేవా! ఆనాటి పరిస్థితుల్లో అది అంత తేలికయిన మాటగాదు. నాకై నేను సేనానాయకత్వాన్ని యివ్వమని అడగటం ఏం బాగుంటుంది? అట్లని నాయకత్వం దుష్టుడిచేత బడనీయటమూ శ్రేయస్కరం కాదు! అందుకని నేను మార్గాంతరం ఏమిటా అని ఆలోచించ సాగాను. నా వాలకం గమనించిన నరసేనుడు,

"శివదత్తా, ఏమిటాలోచిస్తున్నావు? చెప్పదలచినదేమైనా వుంటే, సన్నంకో

చంగా చెప్పు," అన్నాడు. అప్పుడు నేను ఆయనతో యిలా చెప్పాను:

"సమరసేనా! ఇప్పటి పరిస్థితుల్లో మీరే సేనా నాయకత్వం వహించటం మంచిదని నేను భావిస్తున్నాను. శత్రుబలం, వాళ్ళు పంపిన సందేశాన్నిబట్టి చూస్తే—అంత తేలికగా కొట్టివేయవలిసింది కాదు. దురదృష్టవశాత్తూ మన సైన్యం ఒక్కసారి వాళ్ళచేతుల్లో ఎంత చిన్నదెబ్బతిన్నా, అది మరికొందరు శత్రువులు మనమీద ధ్వజం ఎత్తటానికి ఉత్సాహం కలిగిస్తుంది. కనుక మీరే సైన్య నాయకత్వం స్వీకరించండి."

సమరసేను ఒక్క క్షణకాలం ఆలోచించి, తలవూపి "సరే, అలాగే చేస్తాను!" అన్నాడు. అంతలో అక్కడికి నరవాహనమిశ్రుడు వచ్చాడు. అతణ్ణి చూస్తూనే సమరసేనుడు, "నరవాహనా! నీకోసం కబురు పంపుదా మనుకుంటున్నాను. సరే, నువ్వు వెంటనే వెళ్ళి సైన్యసమీకరణ చెయ్యాలి. ఒకగంట వ్యవధిలో కనీసం రెండువేలమంది సైనికుల నైనా సమాయత్తపరచాలి. సూర్యాస్తమయంలోపల శత్రుశేషం లేకుండా చేయవలసివుంది," అన్నాడు.

నరవాహనమిశ్రుడు అక్కడినుంచి వెళుతూ, నాకేసి చిన్నగా నవ్వాడు. అది విషపు నవ్వు. కాని అందులో ఎంత కాల



కూట విషం వున్నదో ఆ క్షణాన నేను గ్రహించలేకపోయాను.


సమరసేనుడు నాకేసి తిరిగి, "శివదత్తా! నువ్వుకూడా నీ అనుచరులను సమాయత్తంచేయి. ఎందుకయినా మంచిది— కనీసం పాతబడిన కత్తుల తుప్పయినా వదిలించవచ్చు" అన్నాడు నవ్వుతూ.

నేను నా అనుచరుల్లో మెరికలవంటి వారిని, ఒక పాతిక మందిని సర్వసన్నద్ధం చేశాను. మహాసేనాని అయిన సమరసేనుడి నాయకత్వంకింద శత్రువులతో పోరాడి చాలా కాలం అయింది. తిరిగి అలాంటి అవకాశం వస్తున్నదని చాలా సంతోషించాను.

ఒక గంటకాలం గడచిపోయింది. నరవాహనమిత్రుడు, సైన్యసమీకరణ చేసి, ఆ వార్తచెప్పేందుకు వస్తాడని, నేనూ, సమరసేనుడూ ఎదురుచూస్తూ కూర్చున్నాం. గంటతరవాత నరవాహనుడు రానేవచ్చాడు. అతడి వాలకం చూసి, మేం యిద్దరం చాలా ఆశ్చర్యపడ్డాం.

అతడి ఒరలో కత్తి లేదు! ధరించిన దుస్తులు చిరిగిపోయి వున్నవి, జుట్టంతా రేగివున్నది. మొహంమీద అక్కడక్కడా చిన్న గాయాలుకూడా కనిపించనై మనిషి చాలా భీతిగొన్నట్టు కనిపించాడు. "ఏం, నరవాహనా! ఏం జరిగింది? అలా వున్నా





వేమిటి?" అంటూ సమరసేనుడు ఎంతో ఆదుర్దాగా అతన్ని ప్రశ్నించాడు.

నరవాహనుడు మాట్లాడేందుకు ప్రయత్నించాడు. కాని గొంతు జీరపోయినట్టు కనబడింది. "పరిస్థితులు మన చేజారి పోయినై. మనం సురక్షిత ప్రదేశానికెక్కడికైనా పారిపోవటం మంచిది," అన్నాడు నరవాహనుడు బొంగురుగొంతుతో.


ఆ మాటలు వింటూనే సమరసేనుడు తోక తొక్కిన తాచుపాములా లేచి నిలబడ్డాడు. ఆయనలో అంత కోపావేశం, తొందరపాటు—ఆనాటివరకూ నేను చూచివుండలేదు.

"నా రాజ్యంలో నేను సురక్షితప్రదేశానికి పారిపోవటమా? ఈ కుండలినీ ద్వీపంలోని ప్రతి అంగుళంభూమీ, నాకు రక్షణ యివ్వగలిగినదే! నీకేమీ పిచ్చిపట్టలేదు గదా?" అన్నాడు సమరసేనుడు.

నరవాహనమిశ్రుడు వణికిపోయాడు. తిరిగి సమరసేనుడు ఏమో మాట్లాడబోయేంతలో కోట ముఖద్వారంవేపునుంచి భయంకరారావాలు వినిపించినై. పెను తుపానుకు మహావృక్షాలు వణికినట్టు, మేం వణికిపోయాం.

"ఏమిటా అరుపులు!" అంటూ సమరసేనుడు, నరవాహనుడికేసి చూస్తూ కఠినంగా ప్రశ్నించాడు.

"సమరసేనా! అదే నే చెప్పదలుచుకున్న భయంకరవార్త! సైనికులు, ప్రజలతో కలిసిపోయారు. 'రాజును గద్దెనుంచి దించాలి,' అని అరుస్తూ వాళ్ళు వీధులలో తిరుగుతున్నారు. నేను సైనికులను సమీకరించేందుకు ప్రయత్నించాను. అందుకు వాళ్ళు నాకు చేసిన బహూకరణ యిది! ప్రాణాలతో పారిపోయి మీ దగ్గరకు రాగలగటం, కుండలినీదేవి కరుణ!" అన్నాడు నరవాహనుడు. ఆ మాటలు వింటూనే సమరసేనుడు, నెత్తిన పిడుగుపడిన



వాడిలా కూలబడ్డాడు. ఎవరికోసం అయితే తను అన్నిటికీ తెగించి, మంత్రాలంఖిక పడరాని యిడుములు పడ్డాడో—ఆ ప్రజలు, ఆపత్సమయంలో తన నాయకత్వాన్ని తృణీకరించటం, సమరసేనుణ్ణి నిలువునా కూల్చింది. పాపం, అతడికి ఆమధ్య కాలంలో వచ్చిన పరిణామాలూ, దుష్ట నరవాహనుడి కుటిలపాత్రా తెలియదు!


"సమరసేనా, అధైర్యపడకండి. ఏదో విధంగా, యీ ప్రమాదాన్నుంచి బయట పడేమార్గం ఆలోచించండి," అన్నాను.

సమరసేనుడు పెద్దగా నిట్టూర్చి, "శివదత్తా, నేను అధైర్యపడుతున్నానని అనుకోకు. ప్రజలు నాపట్ల ఎంత కృతఘ్నులుగా ప్రవర్తిస్తున్నారో ఆలోచించినప్పుడు, నా హృదయం భగ్గున మండుతోంది. అంతకన్న మరేంలేదు," అన్నాడు.

ఆయన్ని ఎలాంటి మాటలతో అనునయించాలో నాకు తెలియలేదు. నరవాహనుడికేసి చూశాను. అతడు స్థాణువులా కదలా మెదలక వుండిపోయాడు. ఆ క్షణం లోనే కోటద్వారం వేపనుంచి భీకరమైన జనఘోష వినబడింది. అంతలో ఒక ద్వారపాలకుడు పరుగెత్తుకుంటూ మా దగ్గరకు వచ్చాడు. ఏమిటీ సంగతి అని నే నడిగేంతలో—"మహాసేనానీ, ప్రమాదం ముంచుకొస్తోంది. ప్రజలు కోటద్వారం బద్దలుకొడుతున్నారు!" అన్నాడు.

సమరసేనుడు ఒక క్షణకాలం తల వంచుకుని వుండిపోయాడు. అతడు ఆ ద్వారపాలకుడి మాటలు విన్నాడో లేదో అన్న అనుమానంకూడా నాకు కలిగింది. నేను మాట్లాడబోయేంతలో ఆయనే తల ఎత్తి నాకేసి చూశాడు. ఆ చూపుల్లో వున్న భావం నా కర్థమైనట్టయింది.

"మృగశాలాధిపతిని వెంటనే యిక్కడకు పిలుచుకురా!" అని ద్వారపాలకుణ్ణి ఆజ్ఞాపించాను. కొద్దిసేపటిలో మృగశాలాధి



పతి వచ్చాడు. అతడు రాగానే, "నీ స్వాధీనంలో వున్న మృగాలనన్నిటినీ, బోనుల్లోనుంచి వదిలిపెట్టు. పోతే, అవి ప్రాసాదప్రాంగణంలో, ముఖద్వారం దగ్గరా మాత్రమే వుండేట్టు చూడు. అవసరం అయినప్పుడు తిరిగి వాటిని బోనుల్లో పెట్టేందుకు, నీకింద నౌకర్లనందర్నీ సిద్ధంగా వుంచు." అని ఆజ్ఞయిచ్చాను.


మృగశాలాధిపతి తెల్లబోతూ సమరసేనుడికేసి ప్రశ్నార్థకంగా చూశాడు. సమరసేనుడు విసుగ్గా తలపంకించి, "శివదత్తుడి ఆజ్ఞలన్నిటినీ, నా ఆజ్ఞలుగానే భావించి శిరసావహించు!" అన్నాడు.

"...కాని సేనానీ, ఒకసారి ఆ క్రూర జంతువులను వదిలితే, బయట వున్న ప్రజలమీద..." అని మృగశాలాధిపతి ఏమో చెప్పబోయాడు. అప్పుడు నేను కోపంగా, "అవన్నీ నీ కనవసరం. కోట ద్వారాన్ని బద్దలుకొడితే, ఏం జరుగుతుందో ముందుగా వాళ్ళు గ్రహించటం చాలా మంచిది! నువ్వు వెంటనే వెళ్ళి నే చెప్పిన పని చెయ్యి!" అన్నాను.

మృగశాలాధిపతి వెంటనే వెళ్ళిపోయాడు. సమరసేనుడికేసి చూశాను. అతడు పళ్ళు బిగించి, నాకేసి క్రోధంగా దొంగచూపులు చూస్తున్నట్టు గ్రహించాను. అతడి ఎత్తుగడ ఏమిటి? ఈ సైనికులా, ప్రజలా తిరుగుబాటులో అతడి దుష్టపాత్ర ఎంత వరకూ వుంది? ఇలాంటి ప్రశ్నలకు అప్పట్లో నాకు జవాబులు దొరకలేదు.

ఒక అరఘడియ గడిచేసరికి, మా కర్ణపుటాలు బద్దలయ్యేలా సింహగర్జనలూ, ఏనుగుల ఘీంకారాలూ వినిపించినై. కోట ప్రాంగణమంతా క్రూరమృగాల అరుపులతో, ఆర్భాటాలతో ప్రతిధ్వనించింది.

సమరసేనుడు తటక్కున లేచి గబగబా భవనం ముందుభాగాన గల ఎత్తయిన మంటపంమీదికి వెళ్ళాడు. అక్కడ నిల




బడి చూస్తే, భవనంముందు గల ఖాళీ ప్రదేశం, ముఖద్వారానికి గల ఇనప కమ్ములూ, ఆ వెనక వీధిలో గోలగా అరుస్తున్న ప్రజలూ—అంతా కనబడుతుంది.


సమరసేనుడి వెనకనే, నేనూ వెళ్ళి మంటపంమీద నిలబడ్డాను. బోనుల్లోనుంచి విడవబడిన క్రూరమృగాలు ప్రాంగణం అంతా విచ్చలవిడిగా విహరిస్తున్నై. కొన్ని ముఖద్వారానికి గల ఇనపకమ్ములలోంచి చూస్తూ, అవతల వున్న ప్రజలమీదికి పంజాలు చాచి గర్జించ సాగినై.

"శివదత్తా, చాలా చక్కని యోచన చేశావ్!" అంటూ సమరసేనుడు నాకేసి తిరిగి చిరునవ్వు నవ్వాడు. "ఈ క్రూరమృగాల భయమే వాళ్ళను కోటద్వారం బద్దలుకొట్టకుండా ఆపింది. అయినా యిది తాత్కాలికంగా మనకు ఊపిరి పీల్చుకునేందుకు లభించిన అవకాశంమాత్రమే అనుకుంటాను. ఇంత అరాజకానికి కారకులైన ఆ నాయకు లెవరు? అంతా అయోమయంగా వుంది," అంటూ వెనక్కి తిరిగి చూశాడు సమరసేనుడు.

నరవాహనుడు, మాకు కొంత వెనకగా చేతులు కట్టుకు నిలబడివున్నాడు. అతడు మా దగ్గరకు వచ్చి, "సమరసేనా, వాళ్ళు రాజును పదవిచ్యుతుణ్ణి చేయాలని పట్టుపడుతున్నారు. నాయకు లెవరో నాకూ తెలియదు," అన్నాడు.

సమరసేనుడు కొంచెంసేపు వూరుకొని, తరవాత యిలా అన్నాడు. "దేశం యింత అరాజకస్థితిలో వున్నదని నేనెన్నడూ ఊహించనైనా లేదు. పట్టణప్రాకారాల అవతల శత్రువులూ, లోపల రెచ్చిపోయిన ప్రజలూ! వీళ్ళకు రాజు గద్దెదిగితే చాలు; వాళ్ళకు రాజ్యాధికారమే కావాలి! పరిస్థితి యిదేననుకుంటాను. అంతేగదా, శివదత్తా?" అని నన్ను ప్రశ్నించాడు.—(ఇంకా వుంది)






## 6

[శివదత్తుని సలహా ప్రకారం, సమరసేనుడు తానే స్వయంగా సేనానాయకత్వం స్వీకరించటానికి, అంగీకరించాడుగదా? సైన్యసమీకరణకు సింహాసనుణ్ణి పంపాడు. అతడు సైనికుల, ప్రజల చేతుల్లో దెబ్బలుతిని తిరిగివచ్చాడు. గత్యంతరంలేక, రాజప్రాసాద రక్షణకు మృగశాలాధిపతి, క్రూరమృగాలను బోనుల్లోనుంచి బయటకు వదిలాడు. తరవాత—]

సమరసేనుడు తనను ప్రశ్నించిన విధం, శివదత్తుడు చెప్పగా విని, మందరదేవుడు చిరునవ్వు నవ్వాడు.

"పట్టణ ప్రాకారాల కావల విడిసివున్న శత్రువులకూ, పట్టణంలో రెచ్చిపోయిన ప్రజలకూ కూడా, కావలసింది రాజు గద్దె దిగటం! తరవాత రాజ్యాధికారాన్ని ఎవరు వశం చేసుకున్నా ఫలితం ఒకటేగదా?" అన్నాడు మందరదేవుడు.

"అవును," అంటూ తలవూపాడు శివదత్తుడు. "ఆప్పట్లో సమరసేనుడికి యింత సూక్ష్మంగా ఆలోచించేందుకు, సరిఅయిన అవకాశం చిక్కలేదు. అంతా గందరగోళంగా వుంది. అందుకే నేను, "అవును సమరసేనా, అదే ప్రస్తుత పరిస్థితిగా కనబడుతోంది! నన్నడిగితే రాజ్యాధికారాన్ని పరులపాలు చేయటంకంటె, రాజును పదవినుండి తొలగించి, యీ ప్రజల సహాయంతో శత్రువుల మదమణచటం ఉత్తమమందాను," అన్నాను.

"అదే నేనూ అనుకుంటున్నది! చిత్రసేనుడు వృద్ధుడు, వంశోద్ధారకుడుకూడా

లేదు. ఆయన సింహాసనం పరిత్యజించేందుకు అంగీకరించగలడని భావిస్తాను. ఒకసారి ప్రజలు శాంతించిన తరవాత, అప్పుడు పట్టణ ప్రాకారాల వెనక వున్న శత్రువులను ఓడించటం ఏమంత కష్టం కాదు," అన్నాడు సమరసేనుడు.

మేం యిలా మాట్లాడుతున్నంతలో చిత్రసేనుడు అక్కడికి రానేవచ్చాడు. ఆయన రావటం చూసిన ప్రజలు, ఒక్కపెట్టున, "రాజు నశించాలి, రాజరికం నశించాలి!" అంటూ అరవసాగారు.

చిత్రసేనుడు సరాసరి మేం వున్న చోటుకు వస్తూనే, "సమరసేనా, కోట బురుజు మీద నిలబడి చూస్తే, బయట గుడారాలు వేసుకుని దాడిచేసేందుకు సర్వసన్నద్ధంగా వున్న వందలాది శత్రువులు కనిపించారు. ఇక పట్టణప్రజల క్రోధోద్రేకాలు నాకు తెలియనివికావు. తన వినోదాల్లో, విందుల్లో మునిగిపోయి, ప్రజల బాగోవులను మరచిన రాజు, సింహాసనార్హుడు కాదు. నేను ప్రజలు కోరినవిధంగా రాజ్యపరిత్యాగమే కాదు; అంతకన్న పెద్ద త్యాగమే చేయదలిచాను!" అంటూ మండపం మీదికి వచ్చాడు.

చిత్రసేనమహారాజు ఆ విధంగా మాట్లాడేసరికి, నేనూ, సమరసేనుడూకూడా




నిర్విణ్ణులమయాము. మా నోటవెంట మాట వెలువడలేదు. చిత్రసేనుడు ప్రజల నుద్దేశించి చేతులు ఊపుతూ—"కుండలినీ ద్వీప వాసులారా! మీ ఆగ్రహాన్ని, న్యాయమైన మీ కోర్కెనూకూడా నేను గుర్తించాను. నేను భోగలాలసుడనై, మీ యిక్కట్టులను చాలాకాలంగా తెలుసుకోలేకపోయాను. అట్టి నన్ను కిరీటం త్యజించమని కోరటం, ధర్మసమ్మతంగానే వుంది. నేను కిరీటాన్నే కాదు, అంతకన్న గొప్ప విలువైనదాన్నే త్యజించబోతున్నాను. మీరుమాత్రం, మీ నాయకుడైన సమరసేనుడి ఆజ్ఞలనుపరిపాలించండి,"అన్నాడు.

మరుక్షణంలోనే ప్రజలనుండి జయ జయధ్వానాలు మిన్నుముట్టినై. ఆ వెంటనే చిత్రసేనుడు మంటపంమీదినుంచి కిందికి దూకేశాడు! అంతా కన్ను మూసి తెరిచేంతలో జరిగిపోయింది. నేనూ, సమరసేనుడూ నివ్వెరపడి కిందకు చూశాము. చిత్రసేనుడు అప్పటికే ప్రాణాలు విడిచి నట్టుంది, కదలామెదలటం లేదు.

హఠాత్తుగా అంత ఎత్తునుంచి తమ మధ్యకు దూకిన ప్రాణి ఎవరో తెలియక, భయకంపితమైన క్రూరమృగాలన్నీ చెల్లా చెదరుగా పారిపోయినై.. ప్రజలందరూ నిశ్చేష్టులయారు.





"అంతా అయిపోయింది, సర్వం ముగిసినట్టే!" అంటూ సమరసేనుడు అక్కడ వున్న స్తంభానికి వేలాడపడిపోయాడు. కళ్లలో నీటిబుగ్గ కదుల్లాడింది.

నేను జనంకేసి చూశాను. అంతా నిశ్శబ్దం. హఠాత్తుగా జరిగిన యీ ఘోర సంఘటన వాళ్లను స్తంభీభూతుల్ని చేసింది. సమరసేనుడు స్థాణువులా వుండిపోయాడు. నరవాహనుడిలో చలనం వున్నట్టు లేదు.

అంతలో అక్కడికి మృగశాలాధిపతి పరిగెత్తుకుంటూ వచ్చాడు. "మహాసేనానీ, యిప్పుడు...యిప్పుడు..." అంటూ అతడేదో చెప్పబోయాడు.

నేను అతణ్ణి వారించి, దగ్గరకు పిలిచాను. "ఇక నీ మృగాలన్నిటినీ వాటి వాటి బోనుల్లోకి వెళ్ళేట్టుచూడు. ఆపని ఎంత తొందరగా జరిగితే అంత మంచిది. ఒకటి రెండు నిమిషాల్లో కోటద్వారం తెరిపించబోతున్నాను. ఈ లోపల మహారాజు భౌతికకాయం, ప్రాంగణంనుంచి తొలగించి, సురక్షిత ప్రదేశంలో జాగ్రత్తగా భద్రపరచవలసింది," అని ఆజ్ఞాపించాను.

సమరసేనుడు నా మాటలను ఆలకిస్తూనే వున్నాడు. కొంచెం ఎడంగా నిలబడి వున్న నరవాహనుడు, నాకేసి ఓమారు ఓరచూపు చూచి, మంటపంమీదికి వెళ్ళాడు.

కొద్దిసేపట్లోనే క్రూరమృగాలు వాటి బోనుల్లోకి తరమబడినై. చిత్రసేనుడి భౌతికకాయం ప్రాంగణంనుంచి తొలగించబడింది. నేనూ, సమరసేనుడూ ప్రాసాదపు మెట్లుదిగి, ద్వారంకేసి బయలుదేరాం.

మేము ద్వారాన్ని చేరేసరికి ప్రజల్లో కలకలం బయలుదేరింది. వారొక్కుమ్మడిగా చేసిన, "సమరసేనుడికీ జై!" అన్న నినాదాలు భూనభోంతరాళాలను బ్రద్దలుచేసినై.

కోటద్వారం తెరువబడింది. సమరసేనుడు ఒకటి రెండడుగులు ముందుకు వేసి, గొంతు సవరించుకొని, "కుండలినీ




"ద్వీపవాసులారా!" అని పెద్దగా సంబోధించే సరికి, అంతా నిశ్శబ్దం. "నేను జరిగిపోయిన దానిని గురించి, యిప్పుడు మాట్లాడవలచ లేదు," అన్నాడు సమరసేనుడు. "దేశం అరాజకం పాలయింది, ఆ మాట నిజం! దీనికి ఎవరు ఎంతవరకు బాధ్యులన్నది ప్రస్తుత విషయంకాదు. ఈ నాడు రాజు లేడు, కనక రాజభక్తి ప్రసక్తికూడా లేదు. ఇక యిప్పటి పరిస్థితుల్లో అవసరమైంది, ప్రతి పౌరుడిలో దేశభక్తీ, దక్షతాభావం!"

"కుండలినీద్వీపం వర్ధిల్లాలి!" అని ప్రజలు ఏకకంఠంతో అరిచారు.


"పట్టణప్రాకారాల అవతల ప్రబలులైన శత్రువులు పట్టణంమీద దాడిచేసేందుకు విడిసివున్నారు. ముందు పట్టణ రక్షణ, తరవాత దేశరక్షణ! ఆయుధం పట్ట గలిగిన ప్రతి పౌరుడూ ముందుకు రావాలని కోరుతున్నాను!" అన్నాడు సమరసేనుడు.

ప్రజల్లో కలకలం బయలు దేరింది. అందరూ ఒకేసారి ముందుకు తోసుకుంటూ రాసాగారు. "నాకు కత్తి యివ్వండి, నాకు గండ్రగొడ్డలి యివ్వండి, నాకు బాణం అంబులపొదీ..." ఇవీ కేకలు.

సమరసేనుడు వెనుదిరిగి చూచాడు. సమీపంలోనే నిలబడివున్న వరవాహనుడి మీద అతడి దృష్టి ప్రసరించింది. "వర వాహనా! ఈసారి నీపని సుకరం అను కుంటాను. సైన్యాన్ని సమాయత్తపరుచు!" అంటూ వెనుదిరిగాడు సమరసేనుడు.

నేనూ, సమరసేనుడూ అక్కడినుంచి కోటబురుజు మీదికి వెళ్ళాం. దూరంగా పుట్టగొడుగుల్లా శత్రువుల గుడారాలు అసంఖ్యాకంగా కనబడినై. చీమల బారుల్లావున్న శత్రుసైనికులు, ఆ గుడారాలముందు విన్యాసాలు చేస్తున్నారు.

"శివదత్తా, శత్రువులు యుద్ధతంత్రం, వ్యూహరచన తెలియని వట్టి మందకాదు. ఆ విన్యాసాలు చూస్తూంటే, వాళ్ళు సుశి



CHITRA

క్షితులైన సైనికులులా కనబడుతున్నారు,'' అన్నాడు సమరసేనుడు.

సమరసేనుడు చెప్పినదాంట్లో సత్యం లేకపోలేదు. బారులుతీరి యుద్ధవిన్యాసాలు చేస్తున్న శత్రుసైనికుల తీరుచూస్తే, వాళ్ళు సైనికశిక్షణలేని అరాజకజనంలా తోచలేదు.

నేను కోటగోడ వెంటవున్న అగడ్తకేసి చూశాను. అందులో అంతగా నీరున్నట్టు కనబడలేదు. వెంటనే ఒక సైనికుడిని పిలిచి, అగడ్తకు నిండుగా నీరు వదల వలసిందని ఆజ్ఞాపించాను. అప్పుడు సమరసేనుడు నాకేసి తిరిగి, ''శివదత్తా, సేనానాయకత్వం నేను వహించక తప్పదు. పోతే కోట రక్షణభారం నీమీద వదలదలిచాను. నీ అభిప్రాయం ఏమిటి?'' అన్నాడు.

నేను వెంటనే ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయాను. కోట రక్షణభారం నేను వహించటం అంటే, శత్రువులమీద దాడికి బయలుదేరబోతున్న సైనికుల వెంట నేనుండే అవకాశం వుండదన్నమాట. అప్పుడు ఉపసేనానిగా, సమరసేనుడి వెంట నరవాహనుడు వెళ్ళే అవకాశం కలుగుతుంది! ఈ చిక్కునుంచి బయటపడటం ఎలా అని నేనాలోచించేటంతలో నరవాహనుడు అక్కడికి రానేవచ్చాడు.



''మహాసేనానీ, రెండువేలమంది సుశిక్షితులైన సైనికులను సమీకరించాను. ప్రజల్లో దృఢకాయుల్ని ఏరి ఇక నాలుగు వేలమందివరకూ ఆయుధాలిచ్చాను. ఇక, యిప్పుడు చేయవలసిందేమిటి?'' అని నరవాహనుడు ప్రశ్నించాడు.

సమరసేనుడు నాకేసి తిరిగి, ''పట్టణ రక్షణకు, రెండువేలమంది చాలుననుకుంటాను?'' అన్నాడు. నేను తలవూపాను. ''సరే, యీ రక్షణ భారమంతా నీది. నేను రెండువేలమంది సైనికులతో, ఆయుధధారులైన రెండువేలమంది ప్రజలతో దాడి బయలుదేరబోతున్నాను. మేము బయటికి

వెళ్ళగానే పట్టణద్వారాలు జాగ్రత్తగా మూయించవలసింది," అన్నాడు.

సైన్యమంతా పట్టణ ద్వారాలనుంచి బయటికి వెళ్ళిపోగానే, నా పాతికమంది అనుచరులతో నేను రక్షణకార్యక్రమాలు పర్యవేక్షించసాగాను. ఆయుధాలుధరించిన ప్రజల వాలకం చూస్తే వాళ్లకు వాటిని ఎలా ఉపయోగించాలో తెలిసినట్టు కనబడలేదు.

క్రమపద్ధతిలో వాళ్ళ నందర్నీ ఒకచోట నిలబెట్టటంకూడా చాలా కష్టసాధ్యమైంది. పైగా, వాళ్ళల్లోవాళ్ళు గిల్లికజ్జాలు పెట్టుకుంటూ, చిన్నచిన్న గుంపులుగా తయారై తగాదా పడసాగారు.

నేను పట్టణ ద్వారాలు మూయించి, కోటబురుజుమీదికి వెళ్లాను. సమరసేనుడి ముఖ్యసైనికభాగం కోటనుంచి వెలువడగానే, శత్రుశిబిరాల్లో కొంత సంచలనం బయలుదేరింది. వాళ్ళు హడావిడిగా ఆయుధ ధారణచేసి, బారులుతీరి యుద్ధసన్నద్ధమౌతున్నారు. అశ్వికులు పెద్దపెద్ద ఈటెలు ధరించి, కాల్బల సైనికులకు ముందుగా నిలబడ్డారు. కొందరు చిన్నచిన్న ముఠాలుగా ఏర్పడి, సమరసేనుడి సైనిక భాగానికి అన్నివైపులా మెరుపుదాడి చేసేందుకు ముందు కురికారు.

రెండు ప్రధాన సేనలమధ్య యుద్ధం తటస్థపడి, ఫలితం అటో యిటో వెంటనే తేలిపోయే అవకాశం లేదని నేను గ్రహించాను. పదిపన్నెండు మంది శత్రు అశ్వికులు ఒక్కుమ్మడిగా, సమరసేనుడి సైనికుల పైబడి, చేతికి అందినంతమందిని చంపి, ఆవెంటనే దూరంగా పారిపోతున్నారు. ఈ రకమైన మెరుపు దాడులను సమరసేనుడు ముందుగా ఊహించి వుండడు. ఆయన తన సైనికబలాలను నిలుపరించి, తన అశ్వికులనుకూడా పదిపదిమంది చొప్పున చిన్నచిన్న ముఠాలుగా సమీకరించాడు.

(ఇంకా వుంది)






# 7

[రాజా, సింహాసనం పరిత్యజించాలని ప్రజలు చేసిన ఆందోళన చిత్రసేనుణ్ణి కలవరపరిచింది. ఆయన హఠాత్తుగా రాజప్రాసాద మంటపంమించి కిందకు దూకి ప్రాణత్యాగం చేశాడు. ప్రజలు సమరసేనుడికి జై జైనినాదాలు పలికారు. సమరసేనుడు, సరవాహనుణ్ణి వెంటపెట్టుకొని, సైనికులతో శత్రువుల మీదికి దాడి బయలు దేరాడు. తరవాత—]

"రెండు మూడు వందలమంది కాల్బల సైనికులకు ముందు, అర్ధచంద్రాకారంగా కొందరు అశ్వికులు కదలసాగారు. శత్రు అశ్వికులు హఠాత్తుగా కాల్బలసైనికుల మీదపడి చీకాకుపరచాలంటే, ముందు వారు సమరసేనుడి అశ్వసైనికులను ఎదుర్కొనవలసి వుంటుందిగదా?" అని అడిగాడు శివదత్తుడు.

"అవును, సమరసేనుడు తిరుగులేని యుద్ధవ్యూహం పన్నాడు," అన్నాడు మంథరదేవుడు నవ్వుతూ.

"సమరసేనుడి ఈ కొత్త యుద్ధ తంత్రం శత్రువుల ఎత్తుగడలను తారుమారుచేసింది. క్రమక్రమంగా ముందుకు వస్తున్న సమరసేనుడి సేనావాహిని వాళ్ళకు బెదురు పుట్టించి వుంటుంది. వాళ్లు క్రమబద్ధంగా వెనకకు తగ్గసాగారు.

హఠాత్తుగా సమరసేనుడి సేనాముఖం నుంచి శంఖనాదాలూ, జయజయధ్వానాలు మార్మోగినై. అతివేగంగా ముందుకురికిన అతని అశ్వసైనికులను శత్రు అశ్వికులు ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఈటెలా,

కత్తులూ ధరించిన ఆ అశ్వసైనికుల సంకుల సమరం వర్ణనాతీతం.

నాలుగైదు నిమిషాల్లో శత్రు అశ్వికులు చెల్లాచెదరై అన్నివైపులకూ పరిగెత్తసాగారు. అదే క్షణంలో కాల్బలం శత్రువులపై కురికింది. విజయోత్సాహులైన సమరసేనుడి అశ్వికులుకూడా తమ యీటెలతో శత్రు కాల్బలంమీదికి లంఘించారు. పారిపోయేందుకు ఎటూ దారిలేని శత్రువులు ప్రాణాలకు తెగించి పోరాడసాగారు.

విజయలక్ష్మి సమరసేనుణ్ణి వరించనున్నదని నేను చాలా సంబరపడ్డాను. ఈ దెబ్బతో దేశంలో అరాజకం నశించి, ప్రశాంతత ఏర్పడగలదనికూడా నాకు నమ్మకం కలిగింది. అలాంటి శుభతరుణమే వచ్చిన నాడు, నరవాహనుడి కుటిల రాజనీతివల్ల కుండలినీద్వీపంలో ఎవరూ బాధపడవలసిన అవసరం కలగదు.

నేను ఈ విధంగా ఆలోచిస్తున్నంతలో, శత్రు సైనికులు హాహాకారాలుచేస్తూ, చెల్లాచెదరుగా పారిపోవటం కనిపించింది. పారిపోతున్న ఆ సైనికులను, సమరసేనుడి అశ్వికులు వెన్నంటి తమ యీటెలతో హతమారుస్తున్నారు. ఒక కాల్బల సైనికులు గాయపడిన తమ తోటి సైనికులకు కట్లు కట్టి సహాయపడు తున్నారు. మరికొందరు



ఆ దాపులనే వున్న చిన్న వాగులోదిగి దాహం తీర్చుకుంటున్నారు.

ఇక, నేను కోట బురుజు దిగి కిందకు వెళ్ళి, పట్టణ ద్వారాలు తెరిపించుదామను కున్నాను. విజయోత్సాహంతో మరలి రానున్న సమరసేనుడికీ, అతడి సైని కులకూ ఘనస్వాగతం ఇవ్వవలసిన బాధ్యత నామీద వుంది. కాని, నేను బురుజు మీంచి వెనుదిరిగేంతలో సైన్యంలో విజయఘోష లకు బదులు, హాహాకారాలు బయలుదేరినై.

నేను క్షణకాలం నిర్ఘాంతపడి అక్కడే నిలుచుండి పోయాను. యుద్ధరంగంలో కొంచెం మిట్టగావున్న ఒక ప్రదేశం చుట్టూ సైనికులు పోగుకాసాగారు. ఏమిటా యీ విచిత్ర పరిణామం అని నేను అనుకునేం తలో పదిమంది అశ్వికులు హుటాహుటిని పట్టణ ద్వారాలకేసి తమ గుర్రాలను దౌడు తీయించ సాగారు.

నా మనసు చాలా కలవరపడింది. అను కోని విధంగా ఏదో దుష్టపరిణామం సంభ వించిందని నేను భయపడ్డాను. పట్టణ ద్వారాలకేసి వస్తున్న ఆ పదిమంది అశ్వి కులూ, తప్పక వార్తాహరులై వుంటారన్న నమ్మకం నాకు కలిగింది. నేను గబగబా బురుజునుంచి దిగి, నా గుర్రం ఎక్కి నా అనుచరులు వెంటరాగా, పట్టణ ద్వారం





దగ్గరకు వెళ్ళి, ద్వారాలు తెరిపించాను. ద్వారాలు తెరవటమే ఆలశ్యంగా పదిమంది అశ్వికులూ వేగంగా ద్వారాలు దాటి పట్టణంలో ప్రవేశిస్తూ, ఒక్కుమ్మడిగా, "నరవాహన మహారాజుకూ జై!" అంటూ అరిచారు.

ఏదో ద్రోహం జరిగిందని తక్షణం నేను గ్రహించాను. "ద్రోహులు, నరకండి, హతమార్చండి!" అంటూ నేను, నా గుర్రాన్ని ముందుకు ఉరికించి, కత్తితో ఇద్దరిని తుదముట్టించాను. నా అనుచరులుకూడా తమ గుర్రాలను ముందుకు ఉరికించి, మిగిలిన ఆ యెనిమిది మంది నరవాహనపక్ష అశ్వికులను ఎదిరించారు.

వీధులవెంట బారులుతీరి నిలబడ్డ సైనికులూ, ఆయుధధారులైన ప్రజలూ ఒక త్రుటికాలం స్థాణువుల్లా వుండిపోయారు. ఆ వెంటనే సైనికుల్లోనుంచి కొందరు, "నరవాహన మహారాజుకూ జై!" అంటూ కత్తులుదూసి ముందుకురికారు.


ఆయుధధారులైన ప్రజల్లో కలకలం బయలుదేరింది. వాళ్ళల్లోనుంచి కొందరు యువకులు ముందుకు వచ్చి, "సమరసేనుడికీ జై!" అంటూ సైనికులమీద కలియబడ్డారు.

ఇక అప్పుడు చెలరేగిన గందరగోళాన్ని యుద్ధమనేందుకు వీల్లేదు. ఆయుధధారి అయిన ప్రతివాడికీ, ఆయుధం ధరించి వున్న మరొకడు శత్రువు! తన పక్కన, మరొకడితో కత్తియుద్ధం చేస్తున్నవాడు మిత్రువో, శత్రువో ఆ పక్కవాడికి తెలీదు. కొందరు సమరసేనుడికీ, మరి కొందరు నరవాహనుడికీ జై జైనినాదాలు చేస్తున్నారు. ఆ కల్లోలంలో ఎవరి నోటినుంచి ఏ నినాదం వచ్చిందో స్పష్టంగా విని, వాణ్ణి శత్రువుకిందో, మిత్రుడికిందో పోల్చుకునేందుకు అవకాశం లేదు.

నేను, పోరాటం సాగిస్తూనే, అనుచరులతో క్రమంగా కోటద్వారం కేసి తిరోగ

మించాను. ద్వారరక్షకులు నన్ను చూస్తూనే కోట ద్వారం తెరిచి, నేను లోపల ప్రవేశించగానే, ద్వారం మూసేశారు. ఈ విధంగా అప్పటికి ఆ గందరగోళాన్నుంచి బయటపడి కోటలో ప్రవేశించాను.


బయట వీధుల్లో సంకులసమరం సాగుతోంది. సైన్యంలో కొంత భాగం, ప్రజలూ సమరసేనుడి పక్షం; మిగతా సైన్యం నరవాహనుడి పక్షం. యుద్ధరంగంలో వాస్తవంగా ఏం జరిగిందో తెలుసుకుంటేతప్ప, లేకపోతే యీ గందరగోళం ఇలాగే సాగుతుందని పించింది. నా అనుచరుల్లో ఒకణ్ణి పిలిచి, రహస్యద్వారంగుండా అతణ్ణి యుద్ధభూమికేసి పంపాను. పోతే, ఇప్పుడు తెలియవలసింది, పట్టణంలోని నరవాహనుడి అనుచరుల ముందు కార్యక్రమం. వాళ్లు తమను ఎదిరించే వాళ్ళను మట్టు పెట్టిం తరవాత, కోటను వశపరుచుకునేందుకు ప్రయత్నిస్తారా అన్నది సమస్య! నేను మాత్రం, నా సర్వశక్తులా కోటను రక్షించదలిచాను. నా కొద్దిమంది అనుచరులూ, కోటలోవున్న నలభై యాభైమంది సైనికులూ కోట రక్షణకు ఎంతో కాలం నిలబడలేరని నాకు తెలుసు. అంత గత్యంతరం లేనప్పుడు, లోగడ చేసినవిధంగా క్రూర



మృగాలను బోనుల్లోనుంచి వదలటం ఒక్కటే మార్గాంతరంగా కనిపించింది.

ఒక గంటకాలం గడిచింది. బయట వీధుల్లో ఇంకా పోరాటం సాగుతూనేవుంది. నేను కోట రహస్యద్వారంనుంచి పంపిన సైనికుడు కొద్దిసేపటికి తిరిగివచ్చాడు. అతడు యుద్ధరంగంనుంచి తెచ్చినదుర్వార్త నా హృదయాన్ని శూలంలా తాకింది.

శత్రువులతో జరిగిన పోరులో సమరసేనుడు బాగా గాయపడ్డాడు. దానితో అంతవరకూ ఉపసేనానిగా వున్న నరవాహనుడు, సేనానాయకత్వం స్వీకరించి, కుండలిని ద్వీపానికి రాజుగా ప్రకటించు కున్నాడు.


CHITRA



ఆ వార్త చెప్పేందుకే అతడి అనుచరులు కొందరు నగరంలో ప్రవేశించారు!

"సమరసేనుడి పరిస్థితి ఎలావుంది? మాట్లాడే స్థితిలో ఉన్నాడా లేడా?" అని అడిగాను, వార్త తెచ్చిన సైనికుణ్ణి.

"ఆయన బాగా గాయపడ్డాడు. ఇప్పుడో ఇంకాసేపటికో అన్నట్టుగా ఉంది ఆయన స్థితి. ఆ అదను తీసుకునే, నరవాహనుడు రాజుగా ప్రకటించుకున్నాడు. సేనలో ఉన్న చిన్నచిన్న నాయకులందరూ అతణ్ణి బలపరుస్తున్నారు." అని చెప్పాడు సైనికుడు.

పరిస్థితి చేజారిపోయిందని నేను గ్రహించాను. కొద్దిసేపట్లో నరవాహనుడే తన సైన్యాలతో స్వయంగా నగరం మీదికి వస్తాడు. ఇక అప్పుడు అతణ్ణి ఎదిరించే శక్తి కుండలినీద్వీపంలో ఎవరికీ వుండదు. అతడికి నేనంటే వున్న ద్వేషంకూడా నాకు తెలియందికాదు. వీటన్నిటి దృష్ట్యా, సాధ్యమైనంత తొందరగా కోటను వదిలి, రహస్య ద్వారంగుండా నా అనుచరులతో సహా బయటపడటం మంచిదనుకున్నాను.

నా అనుచరులందర్నీ ఒక చోట చేర్చి, పరిస్థితి వివరించాను. నా అభిప్రాయంతో అందరూ ఏకీభవించారు. ఇక చేయవలసిందల్లా గుట్టుచప్పుడు కాకుండా రహస్య ద్వారాన్నుంచి బయటపడటం. కోటనుంచి బయటికి అలాంటి రహస్య ద్వారం వున్నదన్న సంగతి నరవాహనుడికి తెలియందికాదు. అందుచేత ఎంతో జాగ్రత్తగా పని నెరవేర్చుకోవలసి వుంటుంది.

నా అనుచరు లందరినీ హెచ్చరించి ప్రాసాదం లోపలికి బయలుదేరాను. నేను అలా కొద్దిదూరం వెళ్ళానో లేదో, ద్వారం వేపునుంచి కేకలు వినిపించినై. వెనుదిరిగి చూతునుగదా, నరవాహనుడి పక్ష సైనికులు కొందరు, ద్వారానికున్న ఇనుప కమ్ములను పెద్ద పెద్ద దుంగలతో బాదుతూ, వాటిని విరగగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

నాకు చప్పున ఒక ఉపాయం తోచింది. లోగడ చేసినవిధంగానే, మృగశాలాధిపతిని పిలిచి క్రూరమృగాలను బోనుల్లోనుంచి వదలమని ఆజ్ఞాపించాను. అతడు నాకేసి చిరునవ్వు నవ్వి, "శివదత్తా! నీ శత్రువు లెవరో నాకు తెలియదుకాని, వాళ్లు మాత్రం నీకన్న తెలివైనవారు. గంటకింద వాటి మేత విషయం పర్యవేక్షించేందుకు బోనుల దగ్గిరికి వెళ్ళాను. ఆశ్చర్యకరమైన సంగతి; వాటిల్లో చాలావరకు చచ్చిపోయివున్నవి. కొన్ని బాధతో మూలుగుతున్నవి," అన్నాడు.

నేను మారు మాటాడకుండా, బోనుల దగ్గిరకు పరిగెత్తాను. మృగశాలాధిపతి చెప్పిన మాటల్లో అసత్యం ఏమీలేదు. అయితే, జంతువులకు విషంపెట్టినది ఈ మృగశాలాధిపతా? లేక మరెవరైనా నరవాహనుడి అనుచరుడా? నాకున్న కొద్దిపాటి వ్యవధిలో ఆ నిజానిజాలు తెలుసుకునే అవకాశం లేదు. ఎందుకైనా మంచిదని మృగశాలాధిపతిని పెడరెక్కలు విరిచికట్టించి, ఒక గదిమూల పడవేసి, నేను రహస్య ద్వారంకేసి పరిగెత్తాను.

రహస్య ద్వారం చిత్రసేనమహారాజు శయనాగారంలో వున్నది. అక్కడినుంచి ఒక సన్నని సొరంగం ప్రారంభమై, కోట చుట్టూ వున్న అగడ్తకిందుగా పోయి, బయట ఒక క్రోసు దూరంలో వున్న అడవిలో ఒక పెద్ద మాను తోడెలో అంతమవుతుంది.

నా అనుచరులతో నేను చిత్రసేనుడి శయనాగారం ప్రవేశించేసరికి, ఆ మహారాజు భౌతికకాయం మాట గుర్తుకొచ్చింది. పాపం, ఇంతవరకూ దహనసంస్కారం లేకుండా ఆ శవం ఎక్కడో ఒక గదిలో పడివుంది. అతడి పరిపాలనా, చావూ-అంతా విషాదాంతంగా పరిణమించింది.

రహస్య ద్వారం తెరిచి, ముందుకు చూచాను. అంతా కారుచీకటిగా వుంది!

(ఇంకా వుంది)






## 8

[శత్రువులమీదకు, నరవాహనుడూ, సమరసేనుడూ దాడి బయలుదేరారుగదా? పట్టణం వెలుపలి మైదానంలో, ఘోరయుద్ధం జరిగింది. విజయం సమరసేనుడిదే అయినా, అతడు తీవ్రంగా గాయపడిపోయాడు. నరవాహనుడు రాజుగా ప్రకటించుకున్నాడు. శివదత్తుడు అనుచరులతో, రహస్యద్వారంనుంచి బయటికి పారిపోదలిచాడు. తరవాత—]

"ఆ రహస్య ద్వారంనుంచి ముందెన్నడూ మీరు ప్రయాణించలేదా?" అని ప్రశ్నించాడు మందరదేవుడు ఆశ్చర్యపడుతూ.

శివదత్తుడు నిరుత్సాహంగా తలపంకించి, "అలాంటి అవసరం అంతకు ముందెన్నడూ నాకు కలగలేదు. కాని, తీరా రహస్యద్వారం తెరిచింతరవాత ఆ కారు చీకటిలో దివిటీల సహాయం లేందే నడవటం సాధ్యమయే పని కాదని తెలుసుకున్నాను. నా తొందరలో నేను వాటి మాట మరిచిపోయినా, నా అనుచరులు తగు జాగ్రత్తలోనే వున్నారు. వాళ్లు తక్షణం కొన్ని దివిటీలు వెలిగించి, సొరంగంలోకి దిగారు. నేనూ దిగాను. అంతలో నా వెనుక వున్న ఒకడు "శివసేనానీ, శత్రువులు కోట ద్వారం బద్దలు కొట్టి లోపల ప్రవేశించారు. వినండి, ఆ కోలాహలం!" అంటూ కేకవేశాడు.

"సరే, ద్వారం మూసివెయ్యి. నరవాహనుడు వచ్చేవరకూ, వాళ్ళకు యీ రహస్యద్వారం సంగతి తెలీదు. ఈ లోపల మనం సురక్షితంగా బయటపడవచ్చు, భయంలేదు!" అన్నాను.




ఆ చీకటి సొరంగంలో కొంత దూరం నడిచేసరికి, మా దారికి అడ్డంగా వేలాడుతున్న ఒక ఇనపగొలుసు కనిపించింది. తలఎత్తి చూచాను. అక్కడ సొరంగం పైభాగాన ఒక పెద్ద తలుపు అమర్చబడివుంది. గొలుసు కొంచెంగా లాగిచూసేసరికి, బుస్సుమంటూ నీరు లోపలికి ఉరికింది. ఆ క్షణంలో గొలుసుతో బంధించబడిన ఆ తలుపు అక్కడ అమర్చబడిన కారణం ఏమిటో నాకు అర్థమైంది.

ఒకవేళ శత్రువులు రహస్య ద్వారం ఎక్కడ వున్నదీ గ్రహించి వెంటబడితే, ఆ తలుపును గొలుసు సహాయంతో కిందకు దించటంద్వారా, వెనుక భాగాన వున్న మొత్తం సొరంగాన్ని జలమయం చేయవచ్చు! ఇది చక్కని ఉపాయంగా తోచింది. దీనిని అమలు చేయవలసిన అవసరం ఏమైనా వున్నదా అన్న అనుమానంతో రహస్య ద్వారంకేసి చూశాను. నా అనుమానం ధృవపడింది. అక్కడ కొన్ని దివిటీలు చీకట్లో కదుల్లాడటం నా కంట పడింది. అంటే, శత్రువులు, నా ఆచూకీ తెలుసుకున్నారన్న మాట! ఇక వెనుక ముందులు ఆలోచించేందుకు కాలంలేదు. నా బలంకొద్దీకీ, ఆ తలుపుకు వున్న గొలుసు లాగాను. దభీమంటూ తలుపు సొరంగానికి అడ్డుగా పడటం; ఆ వెనక గర్జిస్తూ జలపాతం కిందకు దూకటం వినబడింది.

ఇక ఇప్పుడు చేయవలసింది, సాధ్యమైనంత తొందరగా సొరంగంనుంచి బయటబడటం. ఆలస్యం జరిగితే, నరవాహనుడు, అడవిలో వున్న దాని రెండవ కొసను తన సైనికులతో చుట్టుముట్టవచ్చు. అలా జరిగితే, నా పనీ, నా అనుచరుల పనీ, బోనులో చిక్కిన ఎలుకల చందమవుతుంది.

కొద్దిసేపట్లో మేం సొరంగం ఆవలి కొసను చేరాం. అక్కడ సొరంగం అడుగు భాగాన్నుంచికొన్ని మెట్లు అంచెలక్రమంలో



పైకి కట్టబడినై. అలికిడి కాకుండా ఆ మెట్లెక్కి, అక్కడ వున్న ద్వారానికి చెవి ఆనించి, ఆవలనుంచి ఏమైనా అలికిడి వినబడుతుందేమో అని వినసాగాను.

కొద్దిసేపటివరకూ అంతా నిశ్శబ్దంగా వుంది. ఇక మాను బోదెలో అమర్చబడి వున్న రహస్య ద్వారం తెరిచి బయట పడటం క్షేమమనుకున్నాను. నేను ద్వారం మీద చెయివేసి, తుప్పు పట్టివున్న గడియలను కదిలించేటంతలో, అవతలినుంచి గుర్రం సకిలించిన ధ్వనీ, మనుషుల మాటలూ వినిపించినై.

"అంతా భద్రంగానే వుంది. మాను బోదెలో ఉన్న రహస్యద్వారం మూసే వుంది," అన్నా డొకడు.

"ఓహో, అలాగా! అయితే, ఆ ద్రోహులందరూ, సొరంగంలో నీటబడి, ఎలుకల్లా చచ్చివుంటారు!" అన్నాడు మరొకడు.

మళ్ళీ కాసేపు మాటలేమీ వినబడలేదు. నేనేమి చేయటమా అని ఆలోచించేటంతలో, కఠినమైన అధికార స్వరంతో ఒక గొంతు కంచులా మోగింది.

"ఇంత దూరంలో నించుని కబుర్లాడితే లాభంలేదు. ఆ ద్రోహులు చచ్చారో లేక మనకన్న ముందుగా ద్వారంనుంచి బయట పడి, అడవిలోకి పారిపోయారో మనకు తెలీదు. పైగా చచ్చినా, బతికినా—ఆ శివదత్తుడి తల తేగలిగితే, ఒక సామంత రాజ్యం ఇస్తానని రాజు నరవాహనుడు నాకు వాగ్దానం చేశాడు."

"అయితే, ఇప్పుడేం చేయమని మీ ఆజ్ఞ!" అని ఒకేసారి రెండు గొంతులు భయపడుతూ ప్రశ్నించినై.

"వెళ్ళి, ఆ చెట్టు బోదెలో వున్న రహస్య ద్వారం తెరిచి చూడండి. ఆ వెనక వున్న సొరంగం పూర్తిగా నీటిమయమయివుంటే ఇప్పట్లో అతడి శవంకూడా మనకు దొరకదు. అలా కానప్పుడు..."

అతడు మాట ముగించక ముందే, ద్వారం పక్కనుంచి భయంకరమైన సింహ గర్జన వినిపించింది. ఆ వెంటనే మరి కొన్ని చిన్నా పెద్ద గర్జనలు మార్మోగినై. మాట్లాడు తున్న నరవాహనుడి సైనికులు వెనుకకు తగ్గుతున్న సూచనగా గుర్రాల సకిలింపులూ, వాళ్ళ హెచ్చరికలూ వినిపించినై.

"ఆ మాను బోదెపక్కన ఏవో సింహాలు, వున్నట్టుంది. ప్రమాదం, వెనక్కు తగ్గండి!" అంటూ ఒకడు అరిచాడు. ఆవెంటనే వాళ్ల నాయకుడి కంఠనాదం మారుపలికింది.

"ఒక్క సింహాలేకాదు, ఏనుగులూ, ఎలుగుబంట్లూ వున్నా పని పూర్తికానిదే వెనక్కు తిరిగేందుకు వీలులేదు. వీరికి బందలు నాకత్తికి బలికాగలవు, జాగ్రత్త!"

ఆతరవాత సింహాలు వాళ్లమీదికి లంఘించినవన్న సూచనగా, భయంకరమైన గర్జనలూ, గుర్రాలతొక్కిసలాటా, సైనికుల కేకలూ వినిపించినై. నేను నా సహచరులతో సొరంగంనుంచి బయట పడాలంటే, యింతకన్న మంచి తరుణం మరి రాదనిపించింది.

నరవాహనుడి సైనికులు సింహాలను హతమార్చిం తరవాత, నన్నూ నా అనుచరుల్నీ హతమార్చేందుకు తప్పక సొరంగ ద్వారాలదగ్గరకు రాగలరు.




నా అనుచరులతో, వున్న పరిస్థితీ, అంత ఎక్కువ ప్రమాదంలేకుండా, కొందరమైనా బతికి బయటపడాలంటే, చేయవలసినపనీ చెప్పాను. శరవాహనుడి సైనికులు, సింహలతో గొడవపడేసమయమే, మసకగా వాళ్లను ఎదుర్కొనేందుగ్గాని, లేక అడవిమార్గాన పారిపోయేందుగ్గాని, మంచి అదనని అందరూ అంగీకరించారు.

ఆ సమయంలో నాయకుడుగా నామీద వున్న గొప్ప బాధ్యత నన్ను చాలా కలవరపరిచింది. ఇప్పుడు నేను, నా అనుచరులకు యిచ్చే సూచనలమీదా, ఆజ్ఞలమీదా— మా అందరి భవిష్యత్తూ ఆధారపడి వుంది. నాతోపాటు, నా అనుచరులకూడా మరణమో లేక సురక్షితప్రదేశానికి పారిపోగల అవకాశమో—ఏదో ఒకటి యిక కొద్ది నిమిషాల్లో తేలిపోతుంది.


నేను, యిక ఏమాత్రం ఆలశ్యంలేకుండా రహస్యద్వారం తెరిచాను. తుప్పుపట్టివున్న ఆద్వారాలు కిర్రుమని ధ్వనిచేస్తూ తెరుచుకున్నాయి. బయటికి చూతునుగదా— అక్కడ జరుగుతున్న గందరగోళం చాలా భీభత్సంగా కనబడింది.

సింహాలు, ఒకటికాదు రెండుకాదు— దాదాపు చిన్నాపెద్దవి ఐదారు కలిసి సైనికులు ఎక్కివున్న గుర్రాలమీద కలియ





బడినై. సైనికులు దాదాపు ఓ యిరవైమంది వరకూ వుంటారు. వాళ్లు చెట్లమధ్య చిక్కుకుపోయి, భయంకరంగా గర్జించి మీదకు దూకుతున్న సింహాల పంజాదెబ్బల నుంచి పారిపోలేకా, తమచేతనున్న యీటెలతో వాటిని చంపలేకా—నానా గగ్గోలూ పడిపోతున్నారు. అల్లంతదూరాన గుర్రం మీద కూచునివున్న వాళ్ళ నాయకుడు, చేతి కత్తిని గాలిలో గిరగిరా తిప్పుతూ .



"భయపడకండి, హతమార్చండి, చంపండి!" అంటూ అరుస్తున్నాడు. కాని, అతడుమాత్రం ఆ సింహాల నేటినీ ఎదుర్కోవటంలేదు సరిగదా, అంత ప్రమాదం తటస్థపడితే పారిపోయేందుకు సిద్ధంగా గుర్రాన్ని వెనక్కు నడుపుతున్నాడు.

నేను, నా అనుచరులతో సొరంగ ద్వారంనుంచి బయటపడటం, నరవాహనుడి సైనికులుగాని, వాళ్ళ నాయకుడుగాని గమనించలేదు. వాళ్ళ దృష్టి ప్రాణరక్షణ చేసుకోవటంమీదేవుంది. నేను, నా అనుచరులతో పొదలమాటున దాగుతూ ఒక్కొక్క అడుగే ముందుకుపోయి, కొద్ది సేపట్లో నరవాహనుడి సైనికుల వెనకభాగాన చేరాను. వాళ్ళను ఒకవైపునుంచి సింహాలు చీకాకుపరుస్తున్నవి, నేను రెండో వైపునుంచి హఠాత్తుగా మీదపడి వాళ్ళను సర్వనాశనం చేయదలిచాను.

నా అభిప్రాయం విన్న, నా అనుచరులందరూ నాతో ఏకీభవించారు. కాని, ఒకళ్లిద్దరకు, నరవాహనుడి సైనికులమీదపడిన సింహాలు, తమనూ ఎదుర్కొంటవని భయంకలిగింది. చావుకు సిద్ధమైనతరవాత, అది శత్రువుచేతిలో సిద్ధించినా, సింహంవల్ల తటస్థపడినా—ఆట్టే భేదం వుండదని వాళ్లకు నచ్చచెప్పాను.

పొదలమాటున పొంచివున్న నేను, ఒక్కమారుగా 'సమరసేనుడికీ జై!' అంటూ అరిచి, నరవాహనుడి సైనికులను వెనుక

నుంచి ఢీకొన్నాను. ప్రళయ భయంకరంగా అరుస్తూ, నా అనుచరులు ఉగ్రనరసింహుల్లా వాళ్ళమీద పడ్డారు.


మొట్టమొదటి నా కత్తిదెబ్బకు, వాళ్ళ నాయకుడి తల బొంగరంలా గాలిలోకి లేచి అంత దూరానవున్న పొదల్లో పడిపోయింది. నా అనుచరులు తమ కత్తులతో శత్రు సైనికులను దొరికినచోట దొరికినట్టు నరకసాగారు. ఈ పోరాటంమధ్య సింహలగొడవ ఎవరికీ పట్టలేదు. పైగా అసరికే రెండు మూడు సింహలు, నరవాహనుడి సైనికుల యీటెపోటులుతిని వెల్లకిలాపడి గిలగిల కొట్టుకుంటున్నయి. మిగిలినవి మా భయంకర నాదాలతో హడలెత్తి పారిపోసాగినై.

నాలుగైదు నిమిషాలు గడిచేసరికి, నరవాహనుడి సైనికులలో చాలామంది మా కత్తులకు ఎర అయిపోయారు. తమను యింత హఠాత్తుగా ఎదుర్కొన్నవారెవరో వాళ్ళు గ్రహించేలోపలే, వాళ్ళల్లో చాలామందిని తుదముట్టించాము. కాని, మిగిలిన పదిపన్నెండుమంది అంతలోనే తెప్పరిల్లారు. వాళ్ళల్లో ఒకడు కంఠనాళాలు బద్దలయ్యేలా అరుస్తూ,

"శివదత్తుడు, ద్రోహి, నరకండి! అతడి తల ఒక సంస్థానాన్ని తెచ్చి పెడుతుంది!" అంటూ మామీదికి బెబ్బులిలా ఉరికాడు.

ఆ సైనికుడు ప్రదర్శించిన సాహసం, అతడి అనుచరుల్లోకూడా ధైర్యోత్సాహాలను కలిగించినట్టుంది. వాళ్ళందరూ ఒక్కుమ్మడిగా, నా అనుచరుల మీదకు దూకారు. ఆ సరికే విజయం సాధించామన్న దిలాసాలో వున్న, నా అనుచరుల్లో కొందరు, శత్రువుల రాకిడికి నేలకొరిగారు. నేను, నా కత్తితో శత్రు ముఖ్యుడి గుర్రాన్ని బలంగా పొడిచాను. ఆ దెబ్బతో అది వెనక రెండు కాళ్ళమీదా నిలబడేసరికి, రౌతు కింద పడిపోయాడు. గుర్రం అరుస్తూ అతడి మీదికి ఒరిగిపోయింది. (ఇంకావుంది)






## 9

[శివదత్తుడు రహస్యద్వారంనుంచి పోతున్నప్పుడు, దాని రెండవ కొనను నరవాహనుడి సైనికులు ముట్టడించారు. ఆ ముట్టడిలో కొందరు శివదత్తుడి అనుచరులు మరణించారు. అప్పుడు శివదత్తుడు శత్రుముఖ్యుణ్ణి ఎదుర్కొని, అతణ్ణి చంపాడు. వాడు మరణించ గానే ధైర్యం కోల్పోయిన నరవాహనుడి సైనికులు దిక్కులు చూడసాగారు. తరవాత—]

"శివదత్తా! అదృష్టదేవత మొదటినుంచీ, మిమ్ములను ఒక కంట కనిపెట్టివున్నదనే నేను భావిస్తాను. లేకపోతే, మీరు యిన్ని ప్రమాదాలనుంచి బయటపడటం, సాధ్య మయ్యేదికాదు," అన్నాడు మందరదేవుడు.

శివదత్తుడు నవ్వి, "అందుకు సందేహం లేదు. రహస్యద్వారపు రెండవ కొసను అంత మంది శత్రువులు చుట్టుముట్టివుంటారని, నేనేమాత్రం వూహించలేదు. కాని అదృష్ట వశాత్తూ నా కత్తికి వాళ్ళ ముఖ్యుడు ఆహుతికాగానే, ధైర్యం కోల్పోయిన మిగిలిన నరవాహనుడి సైనికులను హతమార్చటం ఎంతోసేపు పట్టలేదు. కాని, పొదలమాటున నక్కిలా ఒకరిద్దరు శత్రువులు పారిపోయా రనేది, ఆ తరవాతగాని నాకు తెలియలేదు.

గుర్రం కింద పడిపోయిన శత్రు సైని కుణ్ణి బయటికి లాగించాను. గుర్రం మరణబాధతో అటూ యిటూ తన్నుకో పటంలో, అతడుకూడా దాని కాళ్ళ కింద పడి బాగా గాయపడి పోయాడు. కొన వూపిరితో వున్న అతడికి, యింత నీరు పోయించాను. సమరసేనుణ్ణి గురించి



నేను తెలుకోవలిసిన ముఖ్యవిషయం, అతణ్ణించి తప్ప మరెవరినించీ తెలుసు కోవటం సాధ్యంకాదు:

దాహం తీర్చుకుని, కాస్త స్వస్థతగా కన బడిం తరవాత ఆ శత్రు సైనికుణ్ణి, సమర సేనుడిని గురించి ప్రశ్నించాను. అతడు ఇప్పుడు బ్రతికివున్నాడా లేడా? అదీ ఆ సైని కుణ్ణి నేనడిగిన ప్రశ్న.

మరణబాధ పడుతున్న ఆ సైనికుడు, నాకేసి దీనంగా చూస్తూ, "సమర సేనుడు చనిపోయి నాలుగైదు గంటల కాలమైంది. ఈ ద్వీపానికి ఇప్పుడు నర వాహనుడు రాజు!" అన్నాడు.

"అయితే, యుద్ధంలో సమరసేనుడు గాయపడిన మాట నిజమేనన్న మాట?" అని అడిగాను.

"నిజం..." అంటూ అతడు నేలమీదకు ఒరిగి కళ్ళు మూశాడు.


'మహాసేనాని సమరసేనుడు మరిలేడు!' అన్న భావం నా గుండెలను కలిచినట్ట యింది. అతడు మహావీరు డనిపించు కున్నాడు, వీరమరణం పొందాడు. అతడి ఆత్మకు శాంతి కలగాలని దేవ దేవుణ్ణి ప్రార్థించాను.

ఇక ఇప్పుడు కర్తవ్యం ఏమిటి? కుంత లీసీదేవి కరుణవల్ల నేను అనుకున్నదాని కన్న కొద్ది కష్టనష్టాలతోనే సారంగంనుంచి బయటపడ గలిగాను. శత్రువులతో జరిగిన పోరులో, నా అనుచరులు ఆరుగురు మర ణించారు. నేను తక్షణం ఆ ప్రాంతం వదలి, అడవి లోపలిభాగానికి పారిపోక పోతే, నరవాహనుడి సైనికులు మరికొందరు అక్కడికి వచ్చే ప్రమాదం ఉంది.

నా అనుచరులందర్నీ ఒక చోట చేర్చి పరిస్థితి వివరించాను. ఈనాడు కాకపోతే, మరోనాడైనా, ఈ ద్వీపాన్ని వదిలిపోక తప్పదని వారందరూ అంగీకరించారు. సమరసేనుడి మరణం తరవాత, నరవాహ

నుణ్ణి ఎదిరించే శక్తి, యిక ఈ ద్వీపంలో మరెవరికీ లేదు.

మరణించిన నా అనుచరులు ఆరుగురినీ ఒకే సమాధిలో పూడ్చించి, మిగిలిన వారితో దట్టంగావున్న అడవి ప్రాంతానికేసి బయలుదేరాను. ఒకటి రెండు క్రోసులు అలా ప్రయాణించిన తరవాత, మా కొక కోయగూడెం కనిపించింది. సైనిక దుస్తులతో, ఆయుధాలు ధరించివున్న మమ్ములను చూస్తూనే, ఆ గూడెంలోని పిల్లలూ పెద్దలూ పరుగెత్తుకుంటూ వచ్చి మా చుట్టూ గుంపుగా మూగారు.



"ఈ గూడెంలో మీ పెద్ద ఎవరు? ఆయనతో మాట్లాడవలసిన పనివుంది!" అని అడిగాను వాళ్ళను. నాలుగైదు నిమిషాల్లో ఒక వృద్ధుడు మాదగ్గరకు వస్తూనే, "మీ రెవరు? ఇక్కడికేం పని మీద వచ్చారు?" అంటూ నన్ను ప్రశ్నించాడు.

నేను, నా అనుచరులను చూపుతూ, "వీళ్ళందరూ బాగా దప్పిగొని ఉన్నారు. నిన్నటినుంచి భోజనంకూడా చేయలేదు. ఇందుకు మీరేమైనా సహాయం చేయగలరా!" అని అడిగాను.

వృద్ధుడు నా మాటలు వింటూనే, తతిమ్మా కోయవాళ్ళకేసి చూచాడు. మరుక్షణంలో నా అనుచరులను ఒక్కొక్కణ్ణీ, ఒక్కొ కోయవాడు ఆహ్వానించి తన ఇంటికి తీసుకుపోయాడు. ఈ అడవి జాతుల అతిథి మర్యాదను చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. వృద్ధుడు నావంక చూసి నవ్వి, "మీరు నా ఇంటికి రండి. మీ అన్నపానాదుల ఏర్పాటు నేను చూస్తాను," అన్నాడు.

నేను వృద్ధుడితో కలిసి, వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఒక అరగంట సేపటికల్లా, నాకు సర్వభక్ష్యాలతో చక్కని భోజనం వడ్డించబడింది. నేను భోజనంచేసి లేచే వరకూ వృద్ధుడు నాతో ఏరకమైన సంభా

షణా చేయలేదు. కాని, అతడి నిప్పు కణికల్లాంటి కళ్ళు, నన్ను గుచ్చిగుచ్చి చూడటం గమనిస్తూనే వున్నాను.

"మేము కోయలం! ఈ ఘోరారణ్యాలే మా సర్వసంపదలూ! మా పూర్వులుగానీ, మాతరంవాళ్ళంగానీ ఏనాడూ ఏ రాజరికానికీ తలవొగ్గింది లేదు," అన్నాడు వృద్ధుడు.

నేను తలవూపి ఊరుకున్నాను. అతడు చెప్పదలచుకున్న దేమిటో నాకు సూచన ప్రాయంగాకూడా అర్థంకాలేదు.

"దేశంలో వస్తున్న ప్రమాదకరమైన మార్పులు మాకు అప్పుడప్పుడూ తెలుస్తూనే ఉన్నవి. మీలో కొందరు, మా యువకులకు పెద్దపెద్ద ఆశలు చూపి తమ తమ పక్షాల చేర్చుకునేందుకు ప్రయత్నాలు కూడా చేశారు. కోయకుల పెద్దగా, నేను అలాంటివి సాగకుండా యింతవరకూ ప్రయత్నిస్తూ వచ్చాను. మీరు సైనిక దుస్తులతో యీ అటవీప్రాంతానికి రావటంలో వున్న ఉద్దేశ్యమేమిటి?" అంటూ సూటిగా ప్రశ్నించాడు వృద్ధుడు.

అప్పటిగ్గాని అతడికున్న అనుమానమేమిటో నాకర్థమయిందికాదు. అతడి అనుమానాలను తొలగించాలంటే, అన్ని వివరాలతో యదార్థమేమిటో చెప్పక తప్పదని నిశ్చయించుకున్నాను.



సమరసేనుణ్ణి గురించి, ఆతడితో నాకు మంత్రాలదీవిలో పరిచయం అయిన తీరూ, ఆ తరవాత కుండలినీ ద్వీపంలో వచ్చిన మార్పులూ, చివరకు నరవాహనుడి దుష్ట పాత్రా—అంతా నాలుగు మాటల్లో కోయ కుల పెద్దకు వివరించాను. అంతా విన్న తరవాత అతడు నాకేసి గుచ్చి చూస్తూ:

"అంటే మీరిప్పుడు ఈ దేశ రాజ్యాధికారాన్ని వశపరచుకున్నవారికి శత్రువులన్న మాట?" అని ప్రశ్నించాడు.


"అవును," అన్నాను.

వృద్ధుడు తలవంచుకుని కొద్దిసేపు ఆలోచించి, "అతే, మీరీ అడవిప్రాంతాన్ని నివాసంగా ఏర్పరచుకుని, ఆ నరవాహన రాజు మీద వీలు దొరికినప్పుడల్లా దాడిచేయాలని చూస్తున్నారా?" అన్నాడు.

"అలాంటి ఆలోచన నా కెంతమాత్రం లేదు," అని తక్షణం జవాబిచ్చాను.

నా జవాబు కోయకుల వృద్ధుడికి చాలా సంతృప్తి కలిగించినట్టుంది. అతడు నాదగ్గరకు లేచివచ్చి, నా రెండు చేతులూ పట్టుకుని, "నేను, నా ప్రశ్నలతో తమకేమైనా కష్టం కలిగించివుంటే క్షమించండి. మీరు ఈ ద్వీపం వదలిపోదలిస్తే, అందుకు అవసరమైన సహాయం నేను చేయగలను. నా కోర్కె ఒక్కటే: మీరు ప్రశాంతంగా







వున్న యీ అడవిప్రాంతాన్నీ, మా జీవితాలనూ ఒడుదుడుకులపాలు చేయవద్దని. మీరు యిక్కడినుంచి, ప్రస్తుత రాజ్యపాలకులమీద ఏమాత్రం తిరుగుబాటు లేపదీసినా అది, మా అటవీప్రాంతాన్ని అల్లకల్లోలం చేస్తుంది!" అన్నాడు.

ఆ రాత్రి నా అనుచరులందరినీ ఒకచోట చేర్చి ఉన్న పరిస్థితి వివరించాను. మేము ఈ అడవిప్రాంతాన దాగివున్నట్టు నరవాహనుడికి ఏమాత్రం తెలియనీయకుండా, వీలు చిక్కగానే ఈ ద్వీపాన్ని వదిలిపోవటం క్షేమమని అందరూ అంగీకరించారు. కాని, మేము తలచినదొకటైతే, ఆ రాత్రి సంఘటిల్లిన పరిణామం మరొకటి.

ఆరు బయట చెట్లకింద నేనూ, నా అనుచరులూ నిద్రకు ఉపక్రమించాం. మాకు కొంచెం ఎడంలో కొందరు కోయ యువకులు అడవి జంతువులు దగ్గరకు చేరకుండా ఉండేందుకు మంటలు వెలిగించి, వాటి చుట్టూ పడుకున్నారు. సరిగా అర్ధరాత్రి సమయంలో దూరంగా డప్పుల మోతలూ, ఒకచోట అడవి కాలుతున్న వెలుగూ కనిపించింది.

మాకు ఆశ్రయం యిచ్చిన కోయగూడెం అంతా తృటికాలంలో నిద్రమేల్కొన్నది. కుల పెద్దఅయిన వృద్ధుడు, యువకులందరినీ డాలూ, బల్లెలతో సర్వసన్నద్ధంచేసి, గూడెంచుట్టూ కాపలాపెట్టాడు. కొందరికి కాగడాలు యిచ్చి డప్పులమోత వినబడుతున్న ప్రాంతానికి పంపాడు.

"ఈ రణగొణ ధ్వని ఏమిటి?" అని నేను వృద్ధుణ్ణి అడిగాను.

అతడు నాలుక చప్పరిస్తూ, "ఏమయినా కావొచ్చు. ఏనుగుల మందల్లాంటివి గూడెంమీద పడి సర్వనాశనం చేస్తూండవచ్చు. లేక మరే ఆటవికజాతి వాళ్లయినా మాకున్న కొద్దిపాటి ఆస్తిపాస్తులు—పశువులూ వాటిని దోచుకునేందుకు దాడివచ్చి

వుండవచ్చు. కాని ఒకటి మాత్రం నాకు ఆశ్చర్యంగా వుంది!" అంటూ వృద్ధుడు కాలుతున్న అడవికేసి వేలు చూపెట్టాడు.

'ఇది మాకోసం నరవాహనుడి సైనికుల దాడి కాదుగదా?' అన్న సంశయం మెరుపులా నా హృదయంలో పరిగెత్తింది. అంతలో నలుగు రైదుగురు కోయయువకులు కేకలువేస్తూ, మేం వున్న చోటుకు వచ్చారు. వాళ్ళ కులపెద్దను చూస్తూనే, "మన గూడాలమీద సైనికులు పడి చేతికి అందినదల్లా సర్వనాశనం చేస్తున్నారు. వాళ్ళల్లో కొందరు అడవికి నిప్పు ముట్టిస్తున్నారు," అంటూ చెప్పారు.

"ఇలాంటిది లోగడ ఎన్నడూ జరగలేదే! ఇంతకూ వాళ్ళకు కావలసిందేమిటి?" అని ప్రశ్నించాడు కోయకుల పెద్ద.

అంతలో మేం వున్న చోటుకు ఒక నరవాహనపక్ష సైనికుణ్ణి పెడరెక్కలు విరిచి కట్టి ఇద్దరు కోయయువకులు తీసుకు వచ్చారు. "అయ్యా, వీణ్ణి అడగండి సంగతంతా చెపుతాడు. ఈ అడవిప్రాంతమంతా వీళ్ళ నాయకుడైన సుబాహుడిదంట!" అంటూ వాళ్ళు ఆ సైనికుణ్ణి వీపు మీద కర్రతో రెండు పోట్లు పొడిచారు.

కోయకుల పెద్ద నా వంక చూసి, తరవాత పెడరెక్కలు విరిచికట్టబడిన సైనికుణ్ణి ఇలా ప్రశ్నించాడు. "మా వాళ్ళు చెప్తున్నది నిజమేనా? సుబాహుడనే మీ నాయకుడికి, యీ అడవి ప్రాంతమంతా ఎవరు కట్టబెట్టారు?"

"నరవాహన మహారాజుగారు, మా నాయకుడు యుద్ధంలో చేసిన సహాయానికి ఈ ప్రాంతమంతా దానంచేశారు. ఇక్కడ నివసించే పశువులూ, పక్షులూ, మనుషులూ అంతా నేటినుంచి ఆయన అధీనం. మేం దీన్నంతా వశపరుచుకునేందుకే ఇక్కడకు పంపబడ్డాం!" అన్నాడు సైనికుడు.

(ఇంకా వుంది)






## 10


[యుద్ధంలో గాయపడి సమరసేనుడు మరణించినట్టు తెలుసుకున్న శివదత్తుడు, తన అనుచరులతో అడవిలోకి పారిపోయాడుగదా! అక్కడ ఒక కోయగూడెంలో కులపెద్ద అతడికి ఆతిథ్యం యిచ్చారు. ఆ రాత్రి కోయ గూడేలమీద సైనికులు దాడిచేశారు. వాళ్లల్లో ఒకడు, సుబాహుడనే పేరుగల నరవాహనుడి అనుచరుడి సంగతి చెప్పారు. తరవాత—]

"మందరదేవా! ఆ శత్రు సైనికుడి మాటలు నన్నూ, కోయ కులపెద్దనూకూడా ఆశ్చర్య చకితులను చేసినై. పరిస్థితులు ఏదో కొత్తమార్గాన కదులుతున్నట్టు నేను అనుమానించాను," అన్నాడు శివదత్తుడు.

మందరదేవుడు తల పంకించి, "మీ ఈ కొత్త అనుభవం నన్నూ ఆశ్చర్యపరుస్తున్నది. తరవాత ఏం జరిగిందో చెప్పండి!" అని అడిగాడు.

"నాతోపాటు ఆ కోయ కులపెద్దకూడా ప్రమాదాన్ని గ్రహించినట్టు కనిపించాడు. ఆతడు నాకేసి తిరిగి, "ఈ అడవిలో మరెవరి ప్రమేయం లేకుండా, స్వేచ్ఛగా జీవించే మావరకూ, మీ రాజ్యపు అల్లకల్లోలం, గందరగోళం వ్యాపించినట్టు కనబడుతున్నది. ఈ సైనికుడు చెప్పే ఆ సుబాహుడు రాజైన నరవాహనుడికి ఎంతటి సహాయం చేసివున్నా, ఈ విధంగా మా గూడేలమీద పడే హక్కు అతడికి లేదనుకుంటాను!" అంటూ పళ్లు కొరికాడు.

"ఈ రోజుల్లో బలంగల వాడిదే రాజ్యం! మీ కోయలంతా ఐకమత్యంగా ఎదిరించ



గలిగితే, కొంత ప్రయోజనం ఉండవచ్చు. అందుకు నాచేతనైన సహాయం చేయ గలను," అన్నాను.

కొద్దిసేపట్లో ఆ గూడెంలో ఆయుధం పట్టగలిగిన ప్రతివాడూ, వాళ్ల కులపెద్ద నాయకత్వంకింద, అడవి తగలబడుతున్న ప్రాంతంకేసి బయలుదేరారు. నేనుకూడా నా అనుచరులతో వాళ్ళ వెనకనే బయలు దేరాను. తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఎంత ముప్పు వాటిల్లపోతున్నదో ఈ కోయలు గ్రహించగలిగితే—వీళ్ళ సహాయంతో క్రూర నరవాహనుణ్ణి ఒక దెబ్బ తీయవచ్చని నాకు ఆశ కలిగింది.

మేము కొంత ముందుకు వెళ్ళేసరికి, కత్తులూ కటార్లతో వున్న అనేకమంది నర వాహనుడి సైనికులు ఒక కోయగూడెంమీద పడి వీరవిహారం చేస్తూండటం కనిపిం చింది. వాళ్లు చేతికి అందినవల్లా సర్వ నాశనం చేస్తూ, దొరికిన కోయల చేతులకు తాళ్లు బిగించి సొలుపుగా నడుపుకు పోతున్నారు. బహుశా పట్టణాల్లో బానిసలుగా అమ్మేందుకు, వీళ్ల నిలా పట్టుకుపోతున్నా రని నా కనిపించింది.

అంతలో కులపెద్ద నాయకత్వంకింద వున్న కోయలు భయంకరంగా అరుస్తూ, నరవాహనుడి సైనికులమీద హఠాత్తుగా పడ్డారు. తమను ఎదిరించేవా ళ్ళిక్కడ ఎవ్వరూ లేరన్న ధీమాతో వున్న ఆ సైనికు లంతా, అఠాత్తుగా ఇలా జరిగేసరికి నిబ్బరం కోల్పోయి చెల్లాచెదరు కాసాగారు. కోయలు ఆ సైనికులలో దొరికినవాణ్ణి దొరికినట్టు తమ ఈటెలతో పొడుస్తూ, బానిసలుగా బంధింపబడిన తమ జాతివాళ్ళ కట్లు విప్పి, విజయనాదాలు చేయసాగారు.


ఈ పోరాటంలో నేను నా అనుచరులతో పాల్గొనే అవకాశం చిక్కలేదు. కోయల ధైర్యసాహసాలు నన్ను ఆశ్చర్యపరిచినై. కొంత శిక్షణా, క్రమపద్ధతీ అనుసరిస్తే, వీళ్ల

సహాయంతో కుండలినీ ద్వీపాన్ని నరవాహనుడి కబంధ హస్తాలనుంచి విముక్తం చేయవచ్చని పించింది.

"ఆ మండుతున్న అడవి ప్రాంతాన్ని అలా వదిలివేయవలసిందేనా? ఆ మంటలు క్రమంగా ఈ ప్రాంతానికూడా వ్యాపించవచ్చు!" అన్నాను కోయ కులపెద్దతో.

అతడు కాలుతున్న అడవికేసి ఓమారు చూసి, "వాటిని ఆర్పటం మానవమాత్రుడి వల్ల కాదు, ముట్టించటం మాత్రం తెలిసే. సరే, యిప్పుడు ఒక సంగతి చెప్పండి. నరవాహనుడనే పేరు గల మీ రాజు, మా అరణ్య ప్రాంతాలను ఎవరెవరికో సొంతానికి పంచిపెట్టడమేమిటి? ఒకవేళ యిదే విధంగా, యీ అడవిలోని కోయలమంతా అతణ్ణి ప్రతిఘటిస్తే, అతడు మమ్ములను సర్వనాశనం చేయడానికి ప్రయత్నించగలడా?" అని అడిగాడు.

అలాంటి ప్రశ్నకోసమే ఎదురుచూస్తున్న నేను, కోయ కులపెద్దకు నరవాహనుడి కుటిల రాజనీతి, అందులో అతడికి సహాయపడిన మరి కొందరు ద్రోహుల సంగతి చెప్పాను. "తనకు సహాయపడిన ద్రోహుల్లో నోరుగల ప్రతివాడికీ, ఏదో ఒక ప్రాంతాన్ని దానంచేసి సంతృప్తిపరచకపోతే, వాళ్ళు




అతణ్ణే హతమారుస్తారు. కనక, అతడు ఈవిధంగా చేయక తప్పదు. మీరీ ప్రమాదాన్నుంచి బయటపడాలంటే, అందరూ ఐక్యంగా అతణ్ణి ఎదిరించాలి. అంతకన్న మరో మార్గం లేదు," అన్నాను.

నా మాటలు విన్న, కోయ కులపెద్ద నాలుగైదు నిమిషాలసేపు ఆలోచిస్తూ ఊరుకుని, తరవాత అక్కడ చేరిన కోయలకేసి తిరిగి, "మీరు అడవి నాలుగు చెరగులకూ ఈ వర్తమానం అందజేయాలి! రేపు సరిగా మిట్టమధ్యాహ్నం వేళ తోడేలుగూడెంలో కులపెద్దలందరూ సమావేశం కావాలి. వాళ్ళు తమ తమ అను

చరుల్ని వెంటబెట్టుకు రావటం మంచిది! వెళ్ళండి!" అంటూ పెద్దగా అరిచాడు.

మరుక్షణంలోనే ఆయుధాలు ధరించిన బలశాలులైన కోయ యువకులు కేకలు పెట్టుకుంటూ అడవి అన్ని దిక్కులకూ పరిగెత్తసాగారు. నేను కోయ కులపెద్ద వెంట తోడేలుగూడెంకేసి బయలు దేరాను.

మేము గూడెం చేరేసరికి బాగా తెల్లవారి పోయింది. దగ్గర్లో అన్ని గూడేలు వుండగా కులపెద్దల సమావేశానికి, ఇంత దూరంలో వున్న యీ తోడేలుగూడేన్ని, వృద్ధుడు యెందుకు యెన్నుకున్నాడో, గూడేన్ని చూచింతరవాత నా కర్థమైంది.

ఈ తోడేలుగూడెం అన్ని కోయగూడేల లాంటిది కాదు. గూడేనికి చుట్టూ ఎత్తయిన మట్టిగోడా, అక్కడక్కడా ఎత్తయిన బురుజులూ కనిపించాయి. గూడెంలో వున్న పెద్ద చెట్లమీద మంచెలూ, అక్కడినుంచి బాణాలు వదిలేందుకు అనువైన స్థావరాలూ ఉన్నాయి. గూడెంమధ్య వున్న బ్రహ్మాండమైన టేకుమాను ఎక్కి చూస్తే—అక్కడికి చుట్టుపట్ల రెండు మూడు మైళ్ళవరకూ అడవిలో ఏం జరుగుతున్నదీ చూడవచ్చు. అదీ యీ గూడెం ప్రత్యేకత!

ప్రొద్దు ఎక్కుతున్నకొందికీ క్రమంగా కులపెద్దలు తమతమ అనుచరులతో




గూడెం చేరసాగారు. ఈ పెద్దల్లో బాగా వృద్ధులూ, యువకులూకూడా వున్నారు. అందరూ పూర్తిగా ఆయుధసన్నద్ధులై వచ్చారు. అందరి ముఖాలమీదా భయం, ఆదుర్దా స్పష్టంగా కనబడుతోంది.

సరిగా మిట్టమధ్యాహ్నంవేళకు సమావేశ ప్రారంభ సూచనగా పెద్దపెద్ద తప్పెటలు మోగించబడినై. ఊడలు దిగిన ఒక పెద్ద మర్రిచెట్టు కింద పులిచర్మాలూ, జింక చర్మాలూ పరచబడినై. కులపెద్ద లంతా ఒక్కొక్కళ్లే వచ్చి వాటిమీద కూర్చోసాగారు. నావెంట వున్న వృద్ధుడికి చెట్టు మొదట్లో ఒక ఉన్నతాసనం యివ్వబడింది. నాకూ, నా అనుచరులకూ అతడికి కొంచెం పక్కగా స్థానాలు చూపబడినై.

వివిధ రకాల పండ్లూ, మాంసాలూ, మద్యం అక్కడ చేరినవారి కందరికీ వడ్డించబడినై. అందరూ తృప్తిగా తిన్న తరవాత వృద్ధుడు స్పష్టమైన స్వరంలో సమావేశానికి వాళ్లనందరనూ పిలిచిన కారణం వివరించాడు; "పరిస్థితులు తారుమారైనట్టు కనబడుతున్నవి. ఈ కుండలినీ ద్వీపంలో యీనాటివరకూ ఎన్ని రాజరికాలు మారినా, యీ అడవుల్లో నివసించే మనను అవేమీ బాధించలేదు. తరతరాలనుంచీ యీ వనసంపదను నమ్ముకుని స్వేచ్ఛగా





బ్రతుకుతున్న మనను, యీనాడు రాజరికంలో వచ్చిన మార్పు చికాకుపరచనున్నట్టు కనబడుతున్నది. గతరాత్రి జరిగిన దారుణసంఘటనలు మీరు చూచేవుంటారు!" అంటూ వృద్ధుడు ముగించాడు.

అప్పుడు సమావేశానికి వచ్చిన కులపెద్దల్లో ఒకరొకరే లేచి వాళ్లవాళ్ల అనుభవాలు వివరించారు. వాళ్లు చెప్పినదానిని బట్టి, మొత్తం అడవిప్రాంతాన్నంతా నరవాహనుడు తన అనుచరముఖ్యులకు బహుమానాలకింద కట్టబెట్టినట్టు నాకర్థమైంది.

ఇప్పుడేం చేయాలి? ఈ ప్రశ్న అక్కడ చేరినవారినందర్నీ కలతపెడుతూనేవుంది. ఏదో ఒకటి చేయాలని తప్ప—ఆ చేయవలసిందేమిటో చాలామందికి అవగాహన అయినట్టు లేదు. "ఈ అడవి మనది! దీని మీద హక్కుభుక్తాలన్నీ మనవి!" ఇది కొందరి మాటల ధోరణి.

వాళ్ళు చెప్పినదంతా శ్రద్ధగా విన్నతరవాత వృద్ధుడు, "అయితే, ఆ హక్కును నిలబెట్టుకోవటం ఎట్లా?" అని వాళ్లను సూటిగా ప్రశ్నించాడు.

అక్కడ చేరినవాళ్లల్లో చాలామంది యీప్రశ్న విని ముఖముఖాలు చూసుకోసాగారు. కొద్దిసేపు నిశ్శబ్దం తరవాత, ఒక యువకుడు లేచి, "వాళ్లు మనమీద బలప్రయోగం చేసి లొంగతీసుకో దలిచారు. కనుక, మనం మన బలప్రదర్శనంద్వారానే వాళ్ళను ప్రతిఘటించి ఓడించవలసివుంటుంది!" అన్నాడు.

ఈ మాటలకు సమావేశం అన్నిమూలల నుంచీ 'అవును, అవును!' అన్న ప్రతిధ్వనులు వినిపించినై. ఇలాంటి తరుణం కోసమే వేచివున్న వృద్ధుడు తృప్తిగా తల వూపుతూ, "అయితే, కులపెద్దలందరూ తమతమ అనుచరుల్ని వెంటనే పోగుచేయటం మంచిది. శత్రువులు ఒక్కొక్క గూడెంమీద పడి మనను క్రమక్రమంగా

లొంగదీసుకునే అవకాశం యివ్వకూడదు. మనంకూడా వున్న పూర్తిబలంతో శత్రువును ఎదుర్కొని విజయమో, పరాజయమో తేల్చుకోవటం మంచిది!" అన్నాడు.



సమావేశమైన పెద్దలందరికీ అతడి మాటలు నచ్చినై. అంగీకారసూచకంగా అందరూ చప్పట్లు చరిచారు. అప్పుడు వృద్ధుడు, "కాని, మీ అందరి అనుమతితో ముందుగా నేనొక చిన్నపని చేయదలుచుకున్నాను. ఇప్పుడు కుండలినీద్వీపరాజ్యాన్ని హస్తగతం చేసుకున్న ఆ నరవాహన రాజుకు, యీ అడవిప్రాంతంపై తన సైనికులను పంపటం ధర్మం కాదని తెలియపరుస్తాను. ధానికి అతడి సమాధానం ఎలా వుంటుందోకూడా చూద్దాం!" అన్నాడు.

ఈ ప్రయత్నానిక్కూడా అందరూ తలలు వూపారు. దానితో సమావేశం పూర్తయింది. మరనాటి సాయంకాలంలోపల కులపెద్దలందరూ తమతమ అనుచరులతో తోడేలు గూడెం చేరేట్టు నిర్ణయం జరిగింది. అడవి మొగదలలో వున్న గూడేలను ఖాళీచేసి, స్త్రీలనూ, పిల్లలనూ బాగా అడవి లోపలి భాగానికి పంపాలని నిశ్చయించుకున్నారు.

అందరూ వెళ్లిపోయింతరవాత వృద్ధుడు నన్ను దగ్గరకు పిలిచి, "మీ అభిప్రాయం ఏమిటి? ఈ వచ్చిన ముఖ్యులందర్నీ చూచారుగదా! వీళ్లు ఆ సైనికుల ధాటికి నిలబడగలరా?" అని అడిగాడు.

"అది యిప్పుడే చెప్పలేం. ఆ నరవాహనుడి సైనికులు సుశిక్షితులు. పైగా, వాళ్లకు అశ్వికబలం వున్నది. మెరుపులా దాడిచేసి అంతలో మాయమైపోగలరు. ఇక, మీది ముఖ్యంగా కాల్బలం. యుద్ధంలో విజయానికి ఒక్క ధైర్యసాహసాలే చాలవు. మీరు కొంత అశ్వికబలాన్నికూడా సమకూర్చగలరా?" అని అడిగాడు.

వృద్ధుడు పెదాలు చప్పరించి, "అది యిప్పట్లో సాధ్యమయే పనికాదు. మా

కోయ యువకుల్లో కొందరు యిప్పుడిప్పుడే అడవిగుర్రాలను మచ్చిక చేసి, వాటికి జీనులూ, కళ్లేలూ లేకుండా స్వారిచేయటం అలవరుచుకుంటున్నారు. జీనులూ అవీ చేసే నేర్పరులైన పనివాళ్లు మాకు లేరు. అవసరం అయితే, కొంత అశ్వికబలాన్ని కూడా సమకూర్చవచ్చు," అన్నాడు.

"అయితే, తప్పక ప్రయత్నించండి. వాటి అవసరం చాలా వుంటుంది!" అని సలహా యిచ్చాను. తరవాత వృద్ధుడు, ఒక యువకుణ్ణి పిలిచి, ఒక జంతుచర్మంమీద పదునైన కత్తిమొనతో ఏదో రాసి, "దీనిని నరవాహన మహారాజుకు చేర్చాలి. నువ్వు నిర్భయంగా ఈ అడవినుంచి మైదానం మీదికి పోవచ్చు. ఏ సైనికుడికి దీనిని చూపించినా, అతడు నిన్ను ఆ రాజుదగ్గరకు తీసుకుపోతాడు. నువ్వుమాత్రం నిరాయుధుడుగా వెళ్ళవలసి వుంటుంది," అని ఆజ్ఞాపించాడు.

వృద్ధుడు పంపుతున్న ఈ లేఖవల్ల ఏమాత్ర ప్రయోజనం కలుగుతుందో చూడాలన్న ఉత్సుకత నాలో కలిగింది. ఒకటి మాత్రం నేను గ్రహించాను, దీనివల్ల పెద్ద వుపయోగం కలుగుతుందని వృద్ధుడుకూడా ఆశిస్తున్నట్టు నాకు కనబడలేదు.

ఆ రాత్రి మేమంతా తోడేలుగూడెం లోనే నిదరించాం. అడవి కాలుతున్న సూచనగా తెల్లవార్లూ మంటలు కనబడినై. బాగా తెల్లవారిం తరవాత మేం లేచి చూసేసరికి, అప్పటికే వృద్ధుడూ, మరి కొందరు కోయలూ, గూడెం మధ్య వున్న పెద్ద టేకుమానుకింద చేరివున్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి మానుపైన వుండి మైదాన ప్రాంతాన్ని పరికించి చూస్తున్న ఒకడు పెద్దగా కేకపెట్టి, "అదుగో మన వాడు వస్తున్నాడు. కాని అదేమిటి, గాడిద మీద కూర్చున్నాడు!" అంటూ ఆశ్చర్యం ప్రకటించాడు. (ఇంకా వుంది)







**11**

[ రాము నివసించే అడవి ప్రాంతాలను, నరవాహనుడు తన అనుచరులకు ధారాదత్తం చేశాడని తెలియగానే, కోయపెద్దలందరూ కస్సున మండిపడ్డారు. వాళ్ళందరూ తోడేలు గూడెంలో సమావేశమై, నరవాహనుణ్ణి ఎదిరించాలనే నిశ్చయానికి వచ్చారు. కోయవృద్ధుడు ముందుగా ఒక దూతను శాంతి రాయబారిగా నరవాహనుడివద్దకు పంపాడు. తరవాత—]

తోడేలుగూడెంలో కోయపెద్దల సమావేశానంతరం జరిగిన గాథంతా శివదత్తుడు చెప్పుకుపోతున్నాడు. మంచరదేవుడు అంతా శ్రద్ధగా ఆలకిస్తున్నాడు.

"నేను భయపడినంతా అయింది!" అన్నాడు శివదత్తుడు. "దూత, గాడిదమీద ఎక్కి రావటం చూసిన ఇద్దరు యువకులు మైదానంకేసి పరిగెత్తి కొద్దిసేపట్లో దూతను గూడెం చేర్చారు. అతడి వాలకం చూస్తూనే పాపం, అతడు పడిన బాధలు ఎలాంటివో నేను ఊహించ గలిగాను.

దూత తాను పడిన నరక యాతన అంతా వివరంగా చెప్పాడు. సైనికులు అతణ్ణి నరవాహనుడిదగ్గరకు తీసుకుపోయారు. నరవాహనుడు, కోయవృద్ధుడు రాసిన లేఖ చదువుకుని మండిపడి, దూతను యాభై కొరడాదెబ్బలు కొట్టించి, తల బోడి చేయించి, ముఖమంతా మసిపూసి, గాడిద మీద రాజవీధులు వూరేగింపించాడు. తరవాత 'మీ కులపెద్దకు యిది నా జవాబు!' అంటూ అతడి వీపుకు ఒక మేకచర్మం కట్టించాడు. దానిమీద ఒక కోయవాణ్ణి,




నరవాహన సైనికుడు గొలుసులతో బంధించి తీసుకుపోతున్నట్టు చిత్రింపించాడు.

ఆ చిత్రంలోని భావాన్ని అర్థంచేసుకున్న వృద్ధుడు నాకేసి తిరిగి, "అయితే, మాకు బానిసబ్రతుకో, మరణమో తప్పదన్నమాట. ఈ రెంటిలో తప్పనిసరైతే నేను మరణాన్నే కోరుకుంటాను!" అన్నాడు. ఆ నిమిషాన ఆతడి నేత్రాలనుంచి నిప్పులు కురిసినై.

పరిస్థితులు నాకు అనుకూలంగా కాకపోయినా, నరవాహనుడికి వ్యతిరేకంగా పరిణమిస్తున్నట్టు నేను గ్రహించాను. సమరసేనుడి మరణానంతరం, యిక తనను కుండలినీ ద్వీపంలో ఎదిరించేవారెవరూ లేరన్నగర్వంతో వున్న నరవాహనుడికి యీ కోయల తిరుగుబాటు ఒక గుణపాఠాన్ని నేర్పగలదు!

"శివదత్తా, మీ నరవాహనరాజు ప్రదర్శించిన పొగరుబోతుతనం గమనించావు గదా?" అంటూ నాకేసి సాభిప్రాయంగా చూశాడు వృద్ధుడు.


"అయితే మీరు యుద్ధానికి సిద్ధమేనన్నమాట?" అని అడిగాను.

కోయవృద్ధుడు ఒకక్షణకాలం తలవంచుకుని, తరవాత సాలోచనగా నాకేసి చూస్తూ, "అంతకన్న మరే మార్గమూ నాకు కనబడటంలేదు. లోగడ మీరు చెప్పినట్టు సుశిక్షితులైన ఆతడి సైనికులను, ముఖాముఖి ఎదిరించటం ప్రమాదకరం. కనుక పొంచివుండి హఠాత్తుగా మీద పడి శత్రువులను చీకాకుపరిచే యుద్ధతంత్రాన్ని అనుసరించటం క్షేమంగదా?" అన్నాడు.

"కాని ఆ పద్ధతి విజయాన్ని సమకూర్చలేదు. ఏదో ఒకనాడు, మీరు కుండలినీ నగరాన్ని, రాజప్రాసాదాన్ని ముట్టడించవలసివుంటుంది!" అని చెప్పాను.

అవునన్నట్టు వృద్ధుడు తల వూపాడు. అంతలో నలుగురైదుగురు కోయ యువకులు కేకలువేస్తూ, మేము వున్న చోటుకు

పరిగెత్తుకుంటూ వచ్చారు. వృద్ధుణ్ణి చూస్తూనే నమస్కరించి, "అయ్యా, శత్రువులు పెద్ద బలగంతో మనమీదకు దాడి వస్తున్నట్టుంది. పదాతి అశ్వికదళాలే కాక, కొందరు ఏనుగులమీదకూడా ఎక్కి వస్తున్నారు. వాళ్లు వేలసంఖ్యలో వున్నారు. మనం ఏంచేయాలి?" అని అడిగారు.




"మనం అంతపెద్ద సైన్యాన్ని ఎదిరించబోవటంలేదు," అన్నాడు వృద్ధుడు నిబ్బరంగా, "ఆ వచ్చే శత్రువులను యీ అడవిలో తమకు తోచినచోటికి వెళ్ళనివ్వండి. కాని, వీలు దొరికినప్పుడల్లా హఠాత్తుగా దాడిచేసి చీకాకుపరచండి!"

"మనం మచ్చికచేసిన పులులనూ, సింహాలనూ వుపయోగించవచ్చా?" అని ఒక కోయ యువకుడు ప్రశ్నించాడు.

"ఓ, నిస్సందేహంగా!" అన్నాడు వృద్ధుడు. "విష బాణాలనూ, విష సర్పాలనూ...ఎలా అయినాసరే, శత్రువు హడలెత్తేట్టు చేయండి!"

ఈ ఆజ్ఞలు విని కోయయువకులు వెళ్లిపోయారు. శత్రువులమీద మచ్చికచేసిన పులులనూ, సింహాలనూ యెలా వుపయోగిస్తారో నా కర్థంకాలేదు. విషపు బాణాల సంగతి నాకుతెలుసు. అడవులలో నివసించే అనేక ఆదిమజాతులు శత్రుసంహారానికి విషపూరితమైన బాణాలను ప్రయోగిస్తారు. అవి ఒకసారి శత్రువును తాకితే, వాటి మొనలకు పూసివున్న విషకారణంగా— ఆ శత్రువు నానా యాతనా పడి తప్పక మరణించ వలసిందే.

"శివదత్తా, మిమ్మల్ని నేనొక రహస్య ప్రదేశానికి తీసుకుపోతాను. మీ అనుచరులు కూడా నిరభ్యంతరంగా మీవెంట రావచ్చును," అన్నాడు కోయవృద్ధుడు.

ఆ రహస్యప్రదేశం యెక్కడో, యీ పట్టున అక్కడికి వెళ్లవలసిన అవసరమేమిటో నా కర్థంకాలేదు. నా సంశయాన్ని

గమనించిన వృద్ధుడు నవ్వుతూ, "శివదత్తా, శత్రువులనుంచి కాపాడుకునేందుకు మాకూ మీవలెనే కోటలూ, కందకాలూ, యితర రక్షా సాధనాలూ వుంటవి. నే చెపుతున్న రహస్యప్రదేశం, మా కోయలలో కొద్దిమందికి తప్ప, అందరికీ తెలియదు. అది కొన్ని పందల సంవత్సరాలకిందట శిథిలమైపోయిన ఒక కొండమీది దుర్గం. నరవాహనుడికి వ్యతిరేకంగా మేము జరపబోయే యుద్ధం, అక్కడి నించే నడపబడుతుంది," అన్నాడు.

వృద్ధుడు అంత చెప్పేంతరవాత, ఆపైన అతన్ని నేను ప్రశ్నించదలచలేదు. నేను నా అనుచరులతో బయలుదేరాను. కోయ వృద్ధుడివెంట కొంతమంది యువకులు వున్నారు. అందరం కలిసి దట్టంగా వున్న అడవిప్రాంతంకేసి బయలుదేరాం. మేము వెళ్ళే మార్గంలో అనేక కోయగూడేలు వున్నవి. ప్రతి గూడెంలోనూ యుద్ధసన్నాహాలు జరుగుతున్న సూచనగా చాలా కోలాహలం కనబడింది.


ఒక గూడెంలో కొందరు కోయ యువకులు నాలుగైదు చిరుత పులులకు మెడలకు తాళ్ళుకట్టి చిన్న చిన్న గుడిసెలనుంచి బయటికి లాక్కువస్తున్నారు. ఎంతో కాలంగా మచ్చిక చేయబడిన ఆ పులులు, పెంపుడు కుక్కలలాగా వాళ్లవెంటపడి వస్తున్నవి.




"శివదత్తా, వీటినే మా కోయభటులు, నరవాహనుడి సైనికులమీద ప్రయోగించ నున్నది. విచ్చలవిడిగా వదలబడిన ఒక్కో పులి, వందమంది వీరులపెట్టు అని మీరు త్వరలోనే గ్రహిస్తారు. ఇక, నరవాహనుడి ఏనుగుల మందలను చెల్లాచెదరు చేయటానికి అవసరమైన సింహాలూ, కాలిబంట్లను హతమార్చేందుకు ఆయుధాలూ మాదగ్గర తయారుగా వున్నవి," అన్నాడు వృద్ధుడు.

ఆ సమయంలో, ఆ కోయుల ధైర్యసాహసాలను నేను మెచ్చుకున్నాను. విజయంలో ఆ వృద్ధుడికి వున్న నమ్మకం నన్ను చాలా ఆశ్చర్యపరిచింది. సుశిక్షితమైన సైన్యాన్ని, పెంపుడు మృగాలద్వారా, అక్కడా యిక్క ప్రయోగించిన విషపు బాణాల వల్లా జయించటం సాధ్యమయ్యే పనికాదని ఆ వృద్ధుడికి తెలియదు.

అతడు దీర్ఘాలోచనతో తల వంచుకుని ముందుకు నడుస్తున్నాడు. చిన్న చిన్న గుట్టలూ, పుట్టలూ దాటుకుంటూ కీకారణ్యంగా వున్న ప్రాంతాన్నించి మేము ముందుకు కదులుతున్నాం. ఒకచోట పదిమంది కోయలు చిన్న చిన్న బుట్టలలో వున్న వేటినో ఒకపెద్ద గంపను చేరవేస్తున్నారు. ఆ చేరవేయుటంలో వాళ్ళు కనబరుస్తున్న జాగ్రత నన్ను ఆశ్చర్యపరిచింది.





"ఆ పెద్ద గంపలో వాళ్ళు వేస్తున్న వేమిటి?" అని వృద్ధుణ్ణి అడిగాను.

"సర్పాలు!" అన్నాడు వృద్ధుడు. "...విష సర్పాలు! వీటి వుపయోగం యేమిటో మీరు త్వరలోనే చూస్తారు!" అంటూ నవ్వాడు.

ఆసరికి మేమంతా ఒకానొక కొండ ప్రాంతానికి చేరాం. ఎదురుగా యెత్తయిన కొండ వున్న సూచనగా, చాలా యెత్తున చెట్లూ చేమలూ కనిపించాయి.

"మనకు యెదురుగా వున్నది చాలా యెత్తయిన కొండ అనీ, దానిమీద ఒక శిథిలమైన దుర్గం వున్నదనీ యీ ద్వీపంలో చాలా మందికి తెలీదు. చిన్నప్పటినుంచీ ఈ ప్రాంతాల తిరిగిన మాబోటివాళ్లకు మాత్రం దాని ఉనికి తెలుసు!" అన్నాడు వృద్ధుడు.

నేను తలవూపి వూరుకున్నాను. ఒకవేళ యీ నట్టడవిలో బలమైన దుర్గం అంటూ వొకటి వుంటే, నరవాహనుణ్ణి అక్కడినించి ఎదిరించటం చాలా తేలిక అని నాకు తోచింది. ధైర్యసాహసోపేతులైన రెండు మూడు వేలమంది కోయ యువకుల సాయంతో, నరవాహనుణ్ణి అక్కణ్ణించి నానా తిప్పలూ పెట్టవచ్చు.

"కోట బాగా శిథిలమైపోయివున్నదా?" అని వృద్ధుణ్ణి అడిగాను.




"బాగా శిథిలమైపోయిందని చెప్పలేం కాని, మొత్తంమీద శిథిలమైన దశలోనే వుంది. ఐనా, ఒకసారి మనం దాన్ని ఆక్రమించుకు కూచుంటే, అక్కడికి శత్రువులు పాదచారులై తప్ప, గుర్రాలమీదగాని, ఏనుగులమీదగాని రాలేరు. ఒకవేళ శత్రువులు గుంపులుగావస్తే, పైనుంచి రాళ్ళు దొర్లించి వాళ్లను హతమార్చవచ్చు. ఒకరొకరుగా వచ్చేట్లయితే, అక్కడి చెట్లమీద దాగివుండి, విషపు బాణాలతో వారిని తుదముట్టించవచ్చు," అన్నాడు వృద్ధుడు.

వృద్ధుడి మాటలు నన్ను చాలా సంతోషపరిచినై. తుదకు విజయం బలవంతుడైన

నరవాహనుడిచే [illegible]గా లోపల అతడు సైనిక[illegible]పలసి వుంటుంది. ఆ[illegible]ద్వీపంలో పట్టణ ప్రాంతాల గల ప్రజ[illegible]తడి క్రూరపాలనకు ఎదురుతిరిగితే అతడి పతనం తప్పదు!


మేము క్రమంగా కొండ ఎక్కసాగాం. ఆ ప్రాంతం అంతగా జనసంచారం ఎరగదన్న సూచనగా—ఎక్కడా నడిచేందుకు మార్గమే కనబడలేదు. మా ముందున్న కోయ యువకులు, పొదలనూ, తీగలనూ నరికి మాకు మార్గం చేయసాగారు.


బాగా మిట్టమధ్యాహ్నం అయేసరికి మేము కొంత ఎక్కి శిథిలదుర్గం చేరాం. అది చాలా ఎత్తయిన కొండ అని అక్కడకు చేరినతరవాతగాని నాకు బాగా అర్థంకాలేదు. అక్కడవున్న ఒకానొక శిథిలమైన గోడమీద నిలబడిచూస్తే మొత్తం కుండలినీద్వీపం, దాన్ని అన్నివైపులా ఆవరించివున్న మహాసముద్రం కనిపించాయి.

దుర్గం ఎలాంటి స్థితిలో వుంది? శత్రువులనుంచి రక్షణకు దీన్ని ఎంతవరకు వుపయోగించుకోవచ్చు? అసలు వాళ్ళు యింత దూరం రాగలరా? ఇలాంటి ఆలోచనలతో నేను ఆ దుర్గాన్ని పరీక్షించసాగాను.

దుర్గం ఒకప్పుడు చాలా బలవత్తరమైనదే అనేందుకు అక్కడ శిథిలస్థితిలో వున్న పెద్దపెద్ద స్తంభాలూ, గోడలూ సాక్ష్యంగా కనబడుతున్నవి. దుర్గంలో ప్రవేశించేందుకు వున్న పెద్దద్వారం తలుపులలో ఒకటి విరిగిపోయి పక్కకు ఒరిగివున్నది. రెండవది తుప్పుపట్టి పడిపోయేందుకు సిద్ధంగావుంది.

"శివదత్తా, మీకు దుర్గంలోపలకు పోయి చూడాలని వుంటే, మా యువకుల్లో ఒకణ్ణి మీవెంట పంపగలను," అన్నాడు కోయ వృద్ధుడు. అంతలో మా చెవులకు భీకరమైన కేకలూ, ఏనుగుల ఘీంకారాలూ వినిపించినై. "అదేమిటి?" అంటూ వృద్ధుడు అటుకేసి చూశాడు. (ఇంకా వుంది)






## 12

[కోయకులపెద్దలు పంపిన దూతను నరవాహనుడు అవమానించి పంపగానే, వాళ్లు యుద్ధ సన్నాహాలు ప్రారంభించారు. అక్కడ ఒక కొండమీద వున్న శిథిలదుర్గం ఆక్రమించుకుని, ఆ ప్రదేశాన్నుంచి యుద్ధం నడపాలని వాళ్ల ప్రయత్నం. నరవాహనుడు తన సైనికబలాన్ని దుర్గం ముట్టడించేందుకు పంపాడు. భయంకర యుద్ధం ప్రారంభమైంది. తరవాత—]

"కొండదిగువ ప్రారంభమైన సైనికుల కోలాహలం, ఏనుగుల ఘీంకారాలూ విన్న ఇద్దరు కోయయువకులు శిథిలదుర్గ ప్రాకారాలమీద నిలబడి దిగువకు చూస్తూ, 'శత్రువులు తోడేలుగూడెం ప్రాంతాల వరకూ వచ్చారు. వాళ్లు ఎక్కివున్న ఏనుగులమీదకు మనవాళ్లు, సింహాలను వదిలారు!' అంటూ అమితోత్సాహంతో చప్పట్లు చరిచారు. నేను పరుగుపరుగున ఆ కోయ యువకులు వున్న చోటుచేరాను," అంటూ చెప్పుకుపోతున్నాడు శివదత్తుడు.

విజయ గర్వంతో కన్నూమిన్నూ కానకుండా ముందుకు వస్తున్న నరవాహనుడి గజసైనికులూ, వారి వెనకనే నడుస్తున్న పదాతిసైనికులూ మాకు కనిపించారు. దాదాపు తోడేలుగూడెం ప్రాంతంలో వారి మీదకు కోయయువకులచేత చెట్లచాటు నుంచి హఠాత్తుగా సింహాలు వదలబడినై. భీకరంగా గర్జిస్తూ ముందుకు వురికే సింహాలను చూచి ఏనుగులు వెనుదిరిగి చెల్లాచెదరు కాసాగినై. ఇక, వాటి కాళ్లకింద పడకుండా, మీదిమీదికి వస్తున్న సింహాల నోళ్ల


వదకుండా, నరవాహనుడి సైనికులు అన్ని వైపులకూ పారిపోతున్నారు.

"చాలా మంచిపని చేశారు!" అన్నాను నా పక్కన వున్న కోయ యువకులతో. "అయితే, ఆ సింహాలను తిరిగి మీవాళ్లు పట్టుకుని, మరోమారు శత్రువులమీదికి వదలగలరా?" అని అడిగాను.

"అన్ని సింహాలనూ తిరిగిపట్టుకోవటం సాధ్యమయే పనికాదు. కొన్ని అడవిలోకి పారిపోవచ్చు," అన్నారు వాళ్లు.

ఆ సరికి నాకు యీ రకమైన పోరాటంలో వున్న నమ్మకం కాస్తా పోయింది. ఆయుధాలతో సర్వసన్నద్ధులై వున్న సైనికులపైకి యీరకంగా సింహాలనూ, పులులనూ వదిలితే, ఒకసారికి వాళ్లు భయపడి పారిపోవచ్చు. కాని, రెండవసారి తగు జాగ్రత్తలో వచ్చి వాటిని హతమార్చగలరు!

ఆ రోజు ప్రొద్దు గూకేవరకూ ఆ అడవి ప్రాంతాల యిలాంటివే మరికొన్ని విచిత్ర దృశ్యాలు చూచాను. ఒకచోట నరవాహన సైనికులు గుంపుగా కూర్చుని భోజనాలు ప్రారంభించబోతున్నారు. హఠాత్తుగా వారి మధ్యకు చెట్లమీదినించి ఒక పెద్దగంప విసరబడింది. మరుక్షణం అందులోనుంచి వేలాది విషసర్పాలు బుసలుకొడుతూ బయటికి దూకినై. నరవాహనుడి సైనికులు



ఎక్కడివారక్కడే తమ ఆయుధాలను వదిలి పారిపోయారు. సర్పాలు తమ దారిన పుట్టల్లోకి, చెట్లమీదికి వెళ్లిపోయినై.

ఈ రకమైన యుద్ధతంత్రంతో నరవాహనుణ్ణి జయించటం సాధ్యమయేది కాదని, ఆ రాత్రి కోయవృద్ధుడితో చెప్పాను. ఒకసారికన్న ఎక్కువసాచు ప్రయోగించేందుకు వీలులేని ఆయుధాలవల్ల కలిగే ఫలితం ఏమీ వుండదన్న నా అభిప్రాయంతో అతడూ ఏకీభవించాడు.

ఆరాత్రి చాలాసేపు యోచించిన మీదట నేనొక నిర్ణయానికి వచ్చాను. కోయవృద్ధుడికి సాధ్యమైనంత వివరంగా సంగతి సందర్భాలన్నీ చెప్పాను. శత్రుసైన్యంలో ఎక్కువ భాగాన్ని, ఈ దుర్గప్రాంతానికి ఆకర్షించి, నాశనంచేయాలి. శిథిలమైవున్నా, యీ దుర్గం ఎవరి చేతుల్లో వుంటే వారు, నాలుగైదింతలున్న శత్రువునైనా ఎదుర్కొని నాశనం చెయ్యావొచ్చు.

ఇక, శత్రువును నాశనంచేసే బాధ్యత నామీద పడింది. నేను అక్కడ చేరిన ఏడెనిమిదిమంది కోయకులపెద్దలకు పరిస్థితి వివరించి చెప్పాను. శత్రువు బలవంతుడు, అతడికి సుశిక్షితమైన సైన్యం వుంది! కొండమీద వున్న శిథిలదుర్గాన్ని ముట్టడించేందుకు అతడికి అశ్వికబలం, గజారూఢులై యుద్ధం





చేసే సైనికులూ నిరుపయోగం. కనుక, శత్రువు ముఖ్యంగా పదాతిదళాన్నే వుపయోగించాలి. అలాంటప్పుడు శిథిలదుర్గానికున్న మార్గాలనన్నిటినీ బిగించి, పైకి వచ్చే శత్రువులమీదికి రాళ్లను దొర్లించవచ్చు. అక్కడ వున్న చెట్లపైనుంచి బాణాలను ప్రయోగించవచ్చు. ఇంతచేసినా శత్రువు శిథిలదుర్గాన్ని చేరగలిగితే—ఆపైన చేయగలిగిందేమీ లేదు.

అప్పుడు నే చేయవలసిన పనిని దుర్గరక్షణ అనేకంటే, దుర్గప్రాంతాల రక్షణ అంటేనే బావుంటుంది. ఈ శిథిలమైన దుర్గంలో రక్షించేందుకు ఏమీలేదు. కాని దుర్గాన్ని రక్షణగా వుపయోగించుకుంటున్నామని శత్రువును మోసగించి, అతణ్ణి కొండదారులు పట్టించి సర్వనాశనంచేయాలి.

బాణాలు వదలటంలో మంచి గురీ, నేర్పూ వున్న కోయయువకుల్ని ఏరి దుర్గం చుట్టూ వున్న చెట్లమీద కాపుపెట్టాను. మంచి దేహబలం వున్న కోయలను పెద్ద పెద్ద బండరాళ్ల వెనక నిలిపి, అవసరం అయినప్పుడు శత్రువులమీద వాటిని తోయవలసిందిగా ఆజ్ఞాపించాను.

సరిగా సూర్యుడు పడమటి దిక్కుకు ఒరిగే సమయానికి నా రక్షణ కార్యక్రమమంతా పూర్తయింది. ఆ సరికి దేహబలం వున్న కోయలంతా తమతమ ఆయుధాలతో శిథిలదుర్గప్రాంతాన్ని చేరటం, వాళ్లను తరుముకుంటూ నరవాహనుడి సైనికులుకూడా దిగువకు చేరటం జరిగింది.

శత్రువులు క్రమశిక్షణతో ఒక నాయకత్వంకింద ఒకచోట గుమిగూడకముందే, నేను రహస్యంగా చెట్లపై వుంచిన కోయభటులు వాళ్లమీదకు బాణాలు కురిపించసాగారు. మనుషులు కనపడకుండా, హఠాత్తుగా బాణంవచ్చి తాకటంతో ప్రాణాలు కోల్పోతూ నరవాహనుడి సైనికులు కంగారు పడసాగారు. కొందరు ఆ కంగారులో గురి



చూడకుండానే తమ బాణాలను, ఆ చుట్టు పక్కల వున్న చెట్లమీదకు వదిలారు.

అదే సమయంలో మరికొందరు నరవాహనుడి సైనికులు కత్తులు చేతపట్టి కొండ ఎక్కడం ప్రారంభించారు. అలాంటి శత్రు సైనికులమీదికి, నేను నియమించిన కోయ భటులు పెద్దపెద్ద బండరాళ్లను దొర్లించ సాగారు. ఇరుకుదారులలో పక్కలకు పారి పోయేందుకు అవకాశం లేక అనేకమంది శత్రుసైనికులు యీ బండరాళ్లకింద పడి అరుస్తూ ప్రాణాలు వదిలారు.

ఈ విధంగా పోరాటం మహాభయంకరంగా నాలుగైదు గంటలకాలం సాగింది. ఈ లోపల నరవాహనుడి సైనికులలో అధిక సంఖ్యాకులు కొండను ఎగబాకి శిథిలదుర్గ ప్రాంతాలను చేరుకున్నారు. కొండ దిగువ చెట్లమీద వున్న కోయభటులను రక్షించి పైకి తీసుకువచ్చే అవకాశం లేదని నేను గ్రహించాను. చెట్లకొమ్మలలో వుండి విషపూరితమైన అంబులను వదిలేవారిని తుద ముట్టించేందుకు నరవాహన సైనికనాయకులు ఒక కొత్తపద్ధతిని అవలంబించారు.

గజారూఢులైవున్న సైనికులు ఆ చెట్ల కిందకు దావించ బద్ధారు. మావటివాడి సంజ్ఞ కాగానే ఏనుగులు తమ తొండాలతో చెట్లకొమ్మలను పట్టి విరవసాగినై. ఫెళ ఫెళారావాలతో విరిగిపడుతున్న కొమ్మలతో పాటు అందులో దాగివున్న కోయభటులు కూడా కింద పడసాగారు. అలా కింద పడుతున్నవారిని శత్రుసైనికులు తమ కత్తులతో, యీటెలతో పొడిచి హతమారుస్తున్నారు.


ఇలా కొంతసేపు జరిగేసరికి కోయభటులందరూ, నరవాహనసైనికుల చేతులలో చంపబడటమో, గాయపడటమో జరిగి పోయింది. తమను వెనకనుంచి ఎదిరించే శత్రువులు ఎవరూ లేరన్న ధైర్యం చిక్కగానే, నరవాహనసైనికులు గుంపులు గుంపులుగా చేరి తమతమ. వాహనాలతో

కూడా మిట్టపల్లాలుగా వున్న కొండను ఎక్కేందుకు ప్రయత్నించారు.

గుర్రాలనూ, ఏనుగులనూ కొండ ఎక్కించేందుకు ప్రయత్నించే ఆ శత్రు నాయకుల బుద్ధిహీనత నన్ను చాలా ఆశ్చర్యపరిచింది. మావటీవాని శూలంపోటు కుంభస్థలం మీద తగిలేసరికి చేసేది లేక కొన్ని ఏనుగులు కొండరాళ్లను ఎక్కేందుకు ప్రయత్నించినై. పట్టబలవంతాన ఆ విధంగా కొంతదూరం కొండ ఎక్కి, అక్కడ కాలి కిందవున్న ఏ పెద్దబండరాయో జారటంతో— అక్కడినుంచి ఘీంకరిస్తూ అవి కిందకు దొర్ల సాగినై. ఇక గుర్రాల అవస్థకూడా అంతే!

నేను నా అనుచరులతో; చావగా మిగిలిన కోయభటులతో శిథిల దుర్గంకేసి తిరోగమించాను. దుర్గద్వారం దగ్గిర కోయ వృద్ధుడు నన్ను కలుసు కున్నాడు.

"శివదత్తా, మేము జయించే అవకాశం లేదనుకుంటాను" అన్నాడు వృద్ధుడు. అతడి కంఠస్వరంలో విచారంగాని, భయచిహ్నాలు గాని నాకు పొడగట్టలేదు. "ఒకవేళ అదే జరిగితే, ప్రతిఘటించకుండా కేవలం పశువుల్లా మేము ఆ నరవాహనుడికి లొంగిపోలేదన్న తృప్తి నాకు మిగులుతుంది! అదే చాలు. ఈ శిథిలదుర్గంలో మా అంతిమ పోరాటం జరుగుతుంది. మీరు మీ అను




చరులతో ఏదైనా సురక్షిత ప్రదేశానికి వెళ్ల వలసిందని కోరుతున్నాను."

కోయవృద్ధుడు యిలా చెప్పేంతలో ఆ దుర్గప్రాంతమంతా నరవాహన సైనికుల కేకలతో మార్మోగిపోయింది. అన్నిటికీ తెగించిన కోయభటులు, శిథిలమైన దుర్గ ప్రాకారాలనుంచి నరవాహన సైనికులను ఎదుర్కొన్నారు. కోయవృద్ధుడుకూడా అంత వరకూ అధికార చిహ్నంగా తనవద్ద వున్న దండాన్ని అవతల పారవేసి, కత్తి చేబట్టి శత్రువులమీదికి వురికాడు.

ఇక అప్పుడు జరిగిన బాహాబాహి యుద్ధం వర్ణనాతీతం. ప్రాణాలపై ఆశలు వదలుకొన్న కోయభటులు, సుశిక్షితులైన నరవాహనసైనికులను రెల్లుదుబ్బులను నరికినట్టు నరకసాగారు. కాని, సంఖ్యలో పదింతలున్న శత్రుసైనికులు క్రమక్రమంగా కోయభటులను వెనకకు నెట్టుతూ శిథిల దుర్గం ప్రవేశించారు.

నేను నా అనుచరులతో, వెనకకు తగ్గుతూ దుర్గప్రాకారాలు దాటి బయట పడ్డాను. కోయవృద్ధుడు తుదిసారిగా అన్న మాటలు నాచెవుల్లో మార్మోగుతూనేవున్నవి. బహుశా యీసరికి అతడు పోరాటంలో మరణించేవుంటాడు! నేను వెనుదిరిగి దుర్గంకేసి చూశాను. ఒక విరిగిపోయిన గోడమీద



చిక్కిచిక్కని ఆతడి రూపం నా కంట బడింది. కత్తి ఝుళిపిస్తూ, ఆతడు తన అనుచరులను ప్రోత్సహించి, గోడపక్కనే వున్న పాతికమంది నరవాహనసైనికుల మధ్యకు అరుస్తూ దూకేశాడు. ఆ కోయ వృద్ధుడి పట్టుదలా, ధైర్యసాహసాలూ నా నేత్రాలను చెమ్మగిల్ల చేసినై.

నేను నా అనుచరులతో కొండ దిగి వేవేగంగా సముద్రంకేసి బయలుదేరాను. ఇక ఆ ద్వీపంలో వుండటం ఏ మాత్రం క్షేమకరంకాదని నిర్ణయించుకున్నాను. అదృష్టదేవత నన్ను పూర్తిగా మరవలేదన్న సూచనగా, సముద్రతీరాన రెండు పడవలు కనిపించినై. నా అనుచరులతో ఆ పడవలెక్కి తెడ్ల సహాయంతో మహాసముద్రం మధ్యకు బయలుదేరాను. ఎటు పోవాలి? ఎక్కడికి పోవాలి? అన్న ఆలోచనే నాకు కలగలేదు. దానిలో మీకు తటస్థపడ్డాను! మందరదేవా, యిదీ నా కథ!" అన్నాడు శివదత్తుడు.

"సమరసేనుడి చరిత్రా, మీ చరిత్రా— రెండూ రెండు అద్భుతాలు!" అన్నాడు మందరదేవుడు.


శివదత్తుడు మారుమాటాడకుండా చిరునవ్వు నవ్వాడు. అంతలో పడవలలోవున్న ఒక సైనికుడు, లేచి నిలబడి, "చూడండి, అక్కడ ఏదో వెలుగు కనబడుతున్నది!" అంటూ అరిచాడు.

మందరదేవుడు అటుకేసి చూచి, "శివదత్తా, అదేదో ద్వీపంలాగా కనబడుతున్నది. మనం ఈ మహాసముద్రంలో దారీ తెన్నూ లేకుండా పోయేకన్న, ఏదో ఒక ద్వీపం చేరటం మంచిదిగదా?" అన్నాడు.

"అవును, పడవలను ఆ ద్వీపానికేసి పోనిద్దాం. అది మానవవాస యోగ్యమైనదే అయితే ఫరవాలేదు; లేక ఏ భయంకర ద్వీపమో అయితే..." శివదత్తుడు మాట ముగించకుండా నవ్వి వూరుకున్నాడు.

(ఇంకా వుంది)






## 13

[నరవాహనుడి సైన్యానికీ, కోయలకూ జరిగిన యుద్ధంలో, నరవాహన సైనికులు కోయ భటులను హతమార్చి, శిలిదుర్గాన్ని ఆక్రమించుకున్నారు. శివదత్తుడు తన అనుచరులతో సముద్రంమీద బయలుదేరాడు. వారికి దారిలో మందరదేవుడు కనిపించాడు. కొంత సేపటికి దూరాన వెలుగు కనిపించింది. పడవలను అటుకేసి నడపసాగారు, తరవాత—]

కన్ను పొడుచుకున్నా కానరాని ఆ కారు చీకటిలో శివదత్తుడూ, మందరదేవుడూ వున్న పడవలు రెండూ క్రమంగా వెలుగు కనబడుతూన్న వైపుకు కదల సాగినై. అప్పటికి రెండు మూడు రోజులుగా మహా సముద్రంమీద నిద్రాహారాలు లేని వాళ్ళ అనుచరులు ఆరుగురూ, తెడ్ల సహాయంతో పడవలను మందంగా నడప సాగారు.

"శివదత్తా, నన్ను ఆకలి దహించి వేస్తున్నది," అంటూ మందరదేవుడు శివదత్తుడికేసి చూసి, "మన అనుచరులూ అదే స్థితిలో వున్నారు. ఆ వెలుగు కనబడే ప్రాంతం ఏదోఒక ద్వీపమై వుంటుందనేందుకు సందేహంలేదు. పోతే అది మానవవాస యోగ్యమవునా కాదా అన్నదే సమస్య!" అన్నాడు.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను," అంటూ శివదత్తుడు నవ్వాడు. "ఎక్కడో ఒక చోట ఏదోవిధంగా పొట్ట నింపుకుంటూ కాలక్షేపం చెయ్యటమే మన జీవితాశయం



కాదనుకుంటాను. మీరు పదచ్యుతులైన మరాళద్వీప ప్రభువులు! నేను మహాసేనాని సమరసేనుడి అనుచరుణ్ణి! ఇద్దరమూ క్రూరాతి క్రూరుడైన ఒకేవ్యక్తి కారణంగా, యీ గాఢాంధకారంలో, కానని సముద్ర ప్రాంతాల తిరుగుతున్నాం!"

శివదత్తుడి మాటలకు మందరదేవుడు జవాబివ్వలేదు. అతడి మనసులో ఒక్కసారిగా మరాళద్వీపం, అక్కడి ప్రజలు, తను రాజ్యాన్ని కోల్పోయిన సంఘటనలూ- అన్నీ మెరుపులా కదిలినై.

"శివదత్తా, మీరు చెప్పదలచిన విషయమేదో నేను గ్రహించాను. ఎంత భయంకర ద్వీపంలో అయినా అడుగిడేందుకు నేను భయపడను. అంతేకాదు, నా బొందెలో ప్రాణంవుండగా నరవాహనుడు నాకు చేసిన ద్రోహాన్ని మరచిపోను. తిరిగి నా రాజ్యాన్ని జయించుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాను" అన్నాడు మందరదేవుడు.

శివదత్తుడికి, మందరదేవుడి మాటలు చాలా సంతోషాన్ని కలిగించినై. నరవాహనుడు చేసిన ద్రోహాన్ని అతడు మరిచిపోలేడని శివదత్తుడు గ్రహించాడు. అతడు ఏమో చెప్పబోయేటంతలో, పడవలు నడుపుతున్న భటులు ఒక్కసారిగా కేకలు పెట్టారు.

"ఈ ప్రాంతమంతా కొండరాళ్ళమయం! మనం ఏదో ద్వీపాన్ని సమీపించాం. ఈ చీకటిలో ఈ కొండరాళ్ళను తప్పించుకుని పడవలు నడపడం సాధ్యం కాదు!" అన్నారు వాళ్ళు.

శివదత్తుడు పడవలను వున్నచోటనే ఆపవలసిందిగా ఆజ్ఞాపించాడు. జాగ్రత్తగా ముందుకు చూచినప్పుడు అతడికి సముద్ర తీరంవెంట గుబురుగా పెరిగిన చెట్లగుంపులు చూచాయగా కనిపించినై. తాము ఒకానొక ద్వీపప్రాంతాన్ని చేరారు, అందులో సందేహం లేదు. కాని పడవలు తీరాన్ని చేరే మార్గం మటుకు లేదు. ఆ ప్రాంతమంతా—

సముద్రజలంలోనుంచి నిక్కి చూస్తున్న కొండశిఖరాల మయం. అలల తాకిడికి పడవలు వాటిలో ఏఒక్కదానికి కొట్టుకున్నా అది ముక్కలు చెక్కలు కాకమానదు!

"మందరదేవా, మన సముద్రయానం ముగిసింది!" అన్నాడు శివదత్తుడు. "ఎదురుగా తీరాన్ని ఒరుసుకుంటూ, గాలికి తలలూపే చెట్లవరుస మీకు కనబడుతున్న దనుకుంటాను. ఈ చీకట్లో, ఈ రాళ్లమధ్య నుంచి పడవలను తీరానికి చేర్చటం సాధ్యమయే పని కాదు!"

"సూర్యోదయంవరకూ యిక్కడే వేచి వుందామని మీరు అభిప్రాయపడుతున్నారా?" అని మందరదేవుడు ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

శివదత్తుడు తల పంకించి, "ఆ పద్ధతి మంచిదికాదనుకుంటాను," అన్నాడు. "ఒకవేళ యీ ద్వీపం ఏ అనాగరిక మానవులకో నిలయమై వున్నట్టయితే, వాళ్లు మనను పట్టపగటి వెలుగులో యిట్టే పసిగట్టి వేటాడగలరు. కనుక, మనం చీకటి వుండగానే తీరం చేరి అక్కడి పరిస్థితు లెలావున్నవో తెలుసుకోవటం మంచిది. ఒకవేళ ఎవరైనా మనను ఎదిరించేట్టయితే, చీకట్లో ప్రమాదాన్నుంచి పారిపోవటం తేలిక," అన్నాడు.



శివదత్తుడి అభిప్రాయంతో మందరదేవుడు ఏకీభవించాడు. పడవలు రెండూ అక్కడ నీటిలో మునిగివున్న కొండ శిఖరాలకు కట్టబడినై. ఇక తీరం చేరాలంటే దాదాపు రెండు మూడు ఫర్లాంగులు నిలువు లోతు నీటిలో యీదుకు పోవాలి. తీరాన అలలు ఉవ్వెత్తున లేస్తూన్నందువల్ల ప్రమాదం లేకుండా ఒడ్డుకు చేరటం కష్టసాధ్యమని అందరూ గ్రహించారు.

కొంచెంసేపు సంప్రతింపుల తరవాత అందరూ నడుములు బిగించి నీటిలోకి ఉరికారు. పెద్దపెద్ద అలలు వారిని రాళ్ళమీదకు విసరసాగినై. ఎంతో నేర్పుగా వాటిని

తప్పుకుంటూ చివరకు ఎలా అయితేం అందరూ ఒడ్డుచేరారు. తడిసిన గుడ్డలను పక్కన పడవేసి, మూటలుకట్టి తెచ్చుకున్న పొడిగుడ్డలను ధరించారు. అయినా అందరూ చలికి వణికి పోతున్నారు.

"ఈ చలిబాధను తట్టుకోవాలంటే, మంట వేయటం తప్ప మార్గం లేదు. ఎండు పుల్లలు పోగుచేయమంటారా?" అని ఒక సైనికుడు శివదత్తుణ్ణి అడిగాడు.

"సరే కానివ్వండి. ఒకవేళ యీద్వీపం ఏ నరమాంసభక్షకులకో ఆలవాలమైతే మనను ఆ మంటలోనే వాళ్ళు కాల్చుకు తినగలరు" అంటూ శివదత్తుడు నవ్వాడు.

"మన చేతనున్న పదునైన కత్తులూ, విల్లంబులూ..." అంటూ మందరదేవుడు ఏమో చెప్పబోయేంతలో శివదత్తుడు అతడి మాటలకు అడ్డువచ్చి, "మందరదేవా, మీకు ఇలాంటి ద్వీపాల సంగతీ, అందులో నివసించే ఆటవికుల సంగతీ తెలీదు. ఈ ఆటవికులు భయమంటే ఏమిటో తెలియని అమాయకులు. మీరు కత్తితో ఒకణ్ణి నరికేంతలో, ఆ వెనకనుంచి ఒక్కసారిగా ఆరుగురు మీ మీదకు లంఘిస్తారు!" అన్నాడు.

ఇంతలో సైనికులు ఎండుపుల్లలు పోగు చేసి నిప్పు వెలిగించారు. అందరూ ఆ మంట చుట్టూ చేరి చలి కాచుకుంటున్నారు. శివ




దత్తుడు తను ఎలాంటి ద్వీపం చేరాడో, ముందుముందు ఎలాంటి ప్రమాదాలను ఎదుర్కొనవలసి వుంటుందో అని ఆలోచించసాగాడు. మందరదేవుడికి మాత్రం అలాంటి ఆలోచనలేమీ లేవు. సూర్యోదయం అయితే, ఆ వెలుగులో యీ ద్వీపాన్ని గురించి సర్వం అవగాహన చేసుకోవచ్చునని అతడి తలంపు.

ఉన్నట్టుండి హఠాత్తుగా కుక్క అరిచిన సవ్వడి వినబడింది. శివదత్తుడితోపాటు అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడి, ఆ సవ్వడి వచ్చిన వైపుకేసి తలలు తిప్పారు. మందరదేవుడు కూడా కొద్దిసేపు అటుకేసి పరీక్షగాచూచి, తరవాత శివదత్తుడి నుద్దేశించి యిలా అన్నాడు.

"శివదత్తా, మనం భయపడినట్టు ఇది అనాగరిక జాతులు నివసించే భయంకర ద్వీపం కాదనుకుంటాను. కుక్కను మచ్చికచేసి వుపయోగించుకోవటం ఒక్క నాగరిక మానవులకే తెలుసు!"

"మందరదేవా, మీరు చాలా పొరబడ్డారు," అంటూ శివదత్తుడు నవ్వాడు. "నా కళ్లతో నేను చిరుతపులులను మచ్చిక చేసి వేటకు వుపయోగించే ఆటవికులను చూచాను. ఆ సంగతి చెప్పాననుకుంటాను. పోతే, యిప్పుడు మనం విన్న కుక్క అరుపు





ఏ అడవికుక్కదయినా కావచ్చును! సూర్యోదయం అవగానే..."

శివదత్తుడు మాట ముగించకముందే, చెట్లకొమ్మలను రివ్వుమని రాచుకుంటూ ఒక పెద్ద రాయి శరవేగంగా వచ్చి మంట ముందు చలికాచుకుంటున్న ఒక సైనికుడి వీపును తాకింది. సైనికుడు ఆ దెబ్బకు ఒక చావుకేక పెట్టి ముందుకు పడిపోయాడు. వెంటనే మందరదేవుడు బాణం ఎక్కుపెట్టి ఆ రాయి వచ్చిన వైపుకు వదిలాడు.

మరుక్షణం శివదత్తుడుకూడా భయంతో వణికిపోయేలాంటి వికృతమానవ కంఠం బాధతో అరిచిన ధ్వని వినబడింది. అందరూ ఒకరి మొహాలు ఒకరు చూచుకుని నివ్వెరపోయారు. ఈ ద్వీపం వట్టి నిర్జనప్రదేశం కాదు. ఏవో భయంకరమైన క్రూర మానవ జాతులు కొన్ని యిక్కడ నివసిస్తున్నవి. అందుకు సాక్ష్యం, తొలిసారిగా వినబడిన ఆ వికృత మానవకంఠం!



మందరదేవుడు కత్తి దూసి ముందుకు నడుస్తూ, సైనికులను తనను అనుసరించమన్నాడు. కాని అంతలో శివదత్తుడు అతణ్ణి వారిస్తూ, "మందరదేవా, మీరు చేయబోతున్న పని చాలా ప్రమాదకరమైనది. ఈ చీకటిలో మనం శత్రువులను వెంటాడలేము. ఈ ద్వీపానికి మనం కొత్తవాళ్ళం. ఏ చెట్టుచాటున, ఏ పొదమాటున ఎలాంటి ప్రమాదం పొంచివుంటుందో మనకు తెలియదు," అన్నాడు.

"ఆ రాయి విసిరిన వాడెవడైనా, అతణ్ణి నా బాణంతో గాయపరిచాను. అంబు తాకీ తాకటంతోనే వాడు వికృతంగా అరిచాడు. బహుశా వాడు యింకా బ్రతికివుంటే, వాణ్ణించి మనం యీద్వీపంలోని మంచిచెడ్డలు తెలుసుకోవచ్చు," అన్నాడు మందరదేవుడు.

శివదత్తుడు, మందరదేవుడి అభిప్రాయంతో ఏకీభవించలేదు. "ఇప్పటి

స్థితిలో మీ బాణందెబ్బకు గురైనవాడు మరణించాడో లేక గాయపడి పారిపోయాడో మనకు తెలియదు. వాడు ఒంటరిగాడా లేక మరికొందరితో కలిసివున్నాడా అన్నదికూడా మనం వూహించలేం. కనుక, సూర్యోదయం వరకూ తగు జాగ్రత్తలో, వున్న చోటు నుంచి కదలకపోవటం అన్నివిధాలా మంచిది," అన్నాడు శివదత్తుడు.


శివదత్తుడి మాటలకు అంగీకార సూచకంగా అందరూ తలలు వూపారు. ఆతరవాత నిద్రమత్తుతో తూగుతున్నవారు నిద్రకు వుపక్రమించగా, శివదత్తుడూ, మరొక సైనికుడూ కావలి కూర్చున్నారు. తూర్పున ఎర్రని రక్తకాంతులతో అరుణోదయం అయ్యేవరకూ, ఆ ప్రాంతాల చెప్పదగిన మరే దుర్ఘటనా జరగలేదు.


బాగా తెలతెల్లవారగానే, మందరదేవుడూ సైనికులూ కళ్ళుతెరిచారు. తాము వున్న ప్రాంతమంతా ఒకానొక కీకారణ్యమని వాళ్ళకు తెలిసిపోయింది. ఆకాశంలోకి చొచ్చుకుపోయిన పెద్ద మానులూ, వాటి మొదళ్ళను కప్పివేస్తూ పెరిగిన అనేక చిన్నాపెద్ద చెట్లూ, పొదలూ; విచ్చలవిడిగా అల్లుకుపోయిన తీగలూ, వాటిమీద గెంతుతూ పరుగెత్తే కోతులూ, అరుస్తూ ఎగురుతున్న వివిధరకాల పక్షులూ—అంతా భయోత్పాహాలను కలిగిస్తున్నది.

"మందరదేవా, ఇక మనం రాత్రి వదలిపెట్టిన పనికి ఉపక్రమించవచ్చు. మీబాణం ఎటుగా పోయి, సుమారు ఎంత దూరంలో ఆ విశ్వృతకంతుస్ని తాకిందో మీరు చెప్పగలరనుకుంటాను?" అన్నాడు శివదత్తుడు.

మందరదేవుడు ముందు దారితీశాడు. చెట్లతీగలనూ, పొదలనూ తప్పించుకుంటూ అందరూ వంద గజాల దూరం వెళ్ళేసరికి, అక్కడ పచ్చని ఆకులపై కొన్ని నెత్తురు మరకలు కనిపించినై.

—(ఇంకా వుంది)






# 14

[శివదత్తుడూ, మందరదేవుడూ వున్న పడవలు రాత్రివేళ ఒకానొక ద్వీపాన్ని చేరినై. ఎక్కడినించో హఠాత్తుగా రివ్వుమంటూ వచ్చి, ఒక రాయి సైనికుణ్ణి తాకింది. మందర దేవుడు అటుకేసి బాణం వదిలాడు. వెంటనే వికృతమైన కేక వినబడింది. తెల్లవారి ఆ ప్రదేశంలో పచ్చని చెట్ల ఆకులపై, ఎర్రని నెత్తురు మరకలు కనిపించినై. తరవాత—.]

శివదత్తుడూ, మందరదేవుడితోపాటు, సైనికులుకూడా, ఆకులపై కనిపించిన ఎర్రని నెత్తురు మరకలను చూచి, నిర్విణ్ణులై పోయారు. రాత్రి వినబడిన వికృత కంఠ ధ్వని, మనిషిదే అయివుంటుందని, అందరికీ అర్థమైపోయింది.

"ఇది మానవరక్తం, సందేహం లేదు!" అన్నాడు శివదత్తుడు, వాటిని పరీక్షించి చూస్తూ. "నేను అనుమానించినట్టు ఆ వ్యక్తి గాయపడ్డాడేగాని మరణించ లేదు. ఇక్కడినుంచి పారిపోయి వుంటాడనేందుకు కూడా సందేహంలేదు. ఎందుకైనా మంచిది, యీ చుట్టుపక్కల పరీక్షిద్దాం."

మందరదేవుడూ, ముగ్గురు సైనికులూ ఒకవైపుకూ, శివదత్తుడూ మిగిలిన ముగ్గురు సైనికులూ మరొకవైపుకూ బయలుదేరారు. మందరదేవుడు కొంతదూరం వెళ్ళేసరికి ఎదురుగా వున్న పొదలో ఏదో కదిలిన అలికిడి అయింది. వెంటనే అతడికి తను వెతుకుతున్న శత్రువు దొరికినట్టనిపించి, ముందుకు దూకాడు. కాని, ఆ అలికిడి చేసినది మనిషి కాదు; ఒక అడవిపంది. అది

అరుస్తూ మందరదేవుడిని తన కోరలతో చీల్చేందుకు పొదలోంచి బయటకు దూకింది. మందరదేవుడు అంతలో నివ్వెర పోయి, దాని కోరలనుంచి పక్కకు తప్పుకుని, కత్తితో దానిని ఒక్కపోటు పొడిచాడు. ఆ దెబ్బకు అడవిపంది బాగా గాయపడినా, అరుస్తూ వెనక్కి తిరిగి అతడిమీదికి ఉరికింది. ఈలోపల మందరదేవుడి వెంట వున్న సైనికులు దానిని తమ కత్తులతో పొడిచారు. అది ఘీంకరిస్తూ పక్కకు పడి గిలగిల తన్నుకోసాగింది.

ఇంతలో శివదత్తుడు సైనికులతో పరిగెత్తుతూ అక్కడికి వచ్చాడు. అతడికి గాయపడి తన్నుకుంటున్న అడవిపందీ, పక్కనే నిలబడివున్న మందరదేవుడూ కనిపించారు. "మీ కేకలు విని ఏదో ప్రమాదం జరిగిందని పరిగెత్తుకుంటూ వచ్చాను," అన్నాడు శివదత్తుడు నవ్వుతూ.

"అనుకోకుండా ఆహారం సంపాదించాం. రాత్రి మనమీదకు రాయి విసరిన శత్రువెవడో తరవాత చూచుకోవచ్చు. ముందు ఆకలి తీర్చుకోవటం అవసరం," అన్నాడు మందరదేవుడు.

సైనికులు ఆ చుట్టుపక్కల దొరికే ఎండు పుల్లలు పోగుచేసుకు వచ్చేందుకు తలా ఒకవైపుకు వెళ్ళారు. మందరదేవుడూ,



శివదత్తుడూ నిప్పు వెలిగించి మంట చేస్తున్నారు. అంతలో దూరాన్నుంచి వాళ్ల కర్ణపుటాలు బద్దలయేలాంటి భయంకర ఆర్తనాదం వినబడింది.


ఆ శబ్దం వింటూనే ఒక్క గంతున శివదత్తుడూ, మందరదేవుడూ లేచి కత్తులు దూసి ఆ ఆర్తనాదం వచ్చినవైపుకు పరిగెత్తారు. కొంచెందూరం వెళ్ళేసరికి వాళ్ళ కంటబడిన దృశ్యం, భయాశ్చర్యాలను కలిగించింది.

అంతలో "నరవానరం, నరవానరం!" అని కేకలు వేస్తూ కొందరు సైనికులు అటుకేసి పరుగెత్తుకుంటూ వచ్చారు.

ఇంతకూ అక్కడ జరిగినదేమిటంటే, ఎండుపుల్లలు ఏరుతున్న ఒక సైనికుడి కంఠాన్ని హఠాత్తుగా వెనుకనుంచి రెండు బలమైన చేతులు పట్టుకున్నాయి. భయకంపితుడైన ఆ సైనికుడు ఓపికకొలదీ గొంతెత్తి కేకలుపెట్టాడు.

"ఇది నరవానరం, సందేహం లేదు!" అంటూ మందరదేవుడు కత్తితో ఆ వికృతాకారాన్ని పొడిచేందుకు ముందుకు వురికేంతలో, "ఆగు, మందరదేవా! ఆగు!" అంటూ శివదత్తుడు వెనుకనుంచి కేక వేశాడు. అంతలో సైనికుడి కంఠాన్ని చేతులతో బిగించిన వికృతాకారం వెనక్కు తిరిగి





పారిపోయేందుకు ప్రయత్నించింది. వెంటనే ముగ్గురు సైనికులు దానిమీద కలియబడి పెనుగులాడి ఎట్టకేలకు దాన్ని అడవితీగ లతో కట్టి బంధించారు.

"ఇది నరవానరం కాదు, నూటికి నూరు పాళ్ళు మానవప్రాణి! ఏదో దురదృష్ట సంఘటన యితణ్ణి, ఈ నీచస్థితికి తెచ్చింది," అన్నాడు శివదత్తుడు.

వెంటనే ఒక సైనికుడు ఆశ్చర్యంగా చూచి, "శివదత్తా, చూడండి! ఈ నర వానరం కుడిచేతికి పెద్ద గాయం తగిలి నెత్తురు కారుతున్నట్టు కనబడుతున్నది!" అంటూ అరిచాడు.

సుందరదేవుడు వంగి ఆ వికృతాకారుడి చేతిని పరీక్షగా చూచి, "శివదత్తా, రాత్రి మనమీదకు రాయి విసరిన ప్రాణి యిదే! ఇదుగో, నాబాణం యిక్కడ యితడి చేతిని తాకింది. మీరన్నట్టు యిది నరవానరం కాదు; నరుడే!" అన్నాడు.

అప్పుడు ఆ వికృతాకారుడు, బాధతో మూలుగుతూ, "నేనూ మీలాంటి మానవుణ్ణే! ఈ భయంకర ద్వీపంలో పన్నెండు సంవత్సరాలు ఒంటరి జీవితం గడిపి నేనిలా అయాను!" అన్నాడు.

"నీ పేరేమిటి? పన్నెండు సంవత్సరాలు ఒంటరిగా యీ ద్వీపంలో కాలం గడపవలసిన అవస్థ నీకెందుకు కలిగింది?" అని శివదత్తుడు అడిగాడు.


శివదత్తుడి ప్రశ్న వింటూనే, ఆ వికృతాకారుడు, ఏదో జ్ఞాపకం చేసుకుంటున్న వాడిలా ముఖం చిట్లించి, కొంచెంసేపు మెదలకుండా ఊరుకుని, యిలా చెప్పాడు.

"అయ్యా, నాపేరు వజ్రముష్టి! మాది శమనద్వీపం. నాకు పద్దెనిమిదో ఏడు ప్రవేశించినప్పటినించీ, సముద్రకేతు అనబడే, ఒక క్రూర సముద్రపుదొంగల నాయకుడి కింద పనిచేసేవాణ్ణి. సముద్రంమీద ప్రయాణించే వర్తకనౌకలనూ, తీర గ్రామా

లనూ దాచుకోవటం మాపని. కొంతకాలం అలా జీవితం గడిపినతర్వాత, నాకూ, నాయకుడైన సముద్రకేతుకూ వివాదం వచ్చిన కారణంగా, అతడు నన్నీ ద్వీపంలో ఒంటరిగా విడిచిపోయాడు."

"నీది శమనద్వీపమా?" అంటూ శివదత్తుడు, వజ్రముష్టి మాటలకు చాలా ఆశ్చర్యపోయాడు. శమనద్వీపమనగానే, శివదత్తుడికి, శాక్తేయుడి సంగతీ, అతడు వెండి బంగారాలతో చండీదేవికి దేవాలయం కట్టించేందుకు, యితరరాజ్యాల మీద దాడికి బయలుదేరిన సమాచారం గుర్తుకొచ్చింది. శమనద్వీపం ఎక్కడున్నది? ప్రస్తుతం ఆరాజ్యానికి రాజెవరు? అలాంటి ప్రశ్నలకు వజ్రముషినుంచి సమాధానాలు రాబట్టవచ్చునని శివదత్తుడికి తోచింది. కాని, అందుకు అది తగిన సమయం కాదనుకున్నాడు. ప్రస్తుతం కావలసింది, తను చేరిన ద్వీపం, అక్కడి స్థితిగతుల సంగతి.

"వజ్రముష్టీ! నువ్వీ ద్వీపంలో పన్నెండు సంవత్సరాలనుంచి వుంటున్నావుగదా? ఇక్కడ నివసించే జనుల గురించీ, వాళ్ల ఆచారవిశేషాల గురించీ నీకు బాగా తెలుసు ననుకుంటాను!" అన్నాడు శివదత్తుడు.



వజ్రముష్టి నిస్పృహగా తల వూపాడు. "అయ్యా, యిన్ని సంవత్సరాలనుంచీ, నేనిక్కడ వుంటున్నా, నాకు యీ ద్వీపాన్ని గురించి అంతగా తెలిసిందేమీలేదు. ఆహార సంపాదనకూ, క్రూరమృగాలనుంచి తప్పుకుని బ్రతికేందుకూ చేసే ప్రయత్నంలో నాకాలమంతా వెళ్లబుచ్చాను. ఒకటి రెండు సార్లు మాత్రం, సముద్రకేతుడి ఓడదొంగలు యీ తీరంవెంట వెళ్లటం నాకంట బడింది. అంతకన్న నాకేమీ తెలియదు."

"ఈ ద్వీపంలో యింతవరకూ నీకు మానవమాత్రుడే కనబడలేదా?" అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు శివదత్తుడు.



వజ్రముష్టి ఏదోగుర్తుకు తెచ్చుకుంటున్న వాడిలా తల వూపి, "ఈ పన్నెండు సంవత్సరాల కాలంలో, సుమారు నాలుగైదు సార్లు మనుషులను చూశాను. వాళ్లు ఆజాను బాహులు, వేటగాళ్లు. తలమీద పెద్దపెద్ద కొమ్ములను ధరిస్తారు. వాళ్ల నివాసం మాత్రం,ఈ దాపులలో కాదు. వేట ముగించుకుని, ఎక్కడికో వెళ్లిపోతారు." అన్నాడు.


శివదత్తుడు, మందరదేవుడికేసి సాభిప్రాయంగా చూచాడు. మందరదేవుడు నవ్వి, "శివదత్తా! మనం, ప్రస్తుతానికి ఏదో విధంగా ఈ ద్వీపంలో నివసించక తప్పదు గదా? కనుక, యీ చుట్టుపట్ల పరిశోధించి, ఎలాంటి ప్రదేశంలో వున్నామో తెలుసుకోవటం మంచిది. చీకటి పడకముందే, ఆ పని ముగించుకుని, ఎండవానలనుంచి రక్షణకు, ఏవైనా చిన్నకుటీరాలు నిర్మించుకుందాం," అన్నాడు.

శివదత్తుడు సరేనన్నట్టు తల వూపాడు. తరవాత సైనికులకేసి తిరిగి, వజ్రముష్టిని బంధించివున్న అడవితీగలను విప్పమన్నాడు. కట్లు విప్పగానే, వజ్రముష్టి శివదత్తుడికీ, మందరదేవుడికీ నమస్కరించి, "అయ్యా, నన్నుకూడా మీ అనుచరవర్గంలో చేర్చుకోండి. విశ్వాసపాత్రుడుగా మీకు సేవ చేయగలను!" అన్నాడు.

శివదత్తుడు తన అనుచరులకేసి చూచాడు. వాళ్ళందరూ అంగీకార సూచకంగా చేతులు ఎత్తారు. ఇద్దరు ముగ్గురు సైనికులు, వజ్రముష్టిని సమీపించి, స్నేహసూచకంగా అతడి భుజం తట్టారు.

"ముందు ఆకలి చల్లార్చుకోవాలి. తరవాత, యీ చుట్టుపక్కల పరిస్థితులేమిటో చూడవచ్చు," అన్నాడు మందరదేవుడు.

శివదత్తుడు తల వూపాడు. సైనికులు పోగుచేసుకువచ్చిన ఎండుపుల్లలన్నీ ఒక చోట పేర్చబడి నిప్పు అంటించబడినై. అంతకుపూర్వం చంపబడిన అడవిపందిని



సైనికులు ఎత్తి నిప్పులో పడవేశారు. వజ్రముష్టి కాసేపు ఆ కాల్చబడుతున్న అడవి పందికేసి చూసి, "అయ్యో! ఇది ఒక్కటే మనందరి ఆకలి తీర్చేందుకు సరిపోదనుకుంటాను. మీరు అనుమతించితే, నాలుగైదు నిమిషాల్లో నేను మరేదైనా జంతువును పట్టుకురాగలను," అన్నాడు.

మందరదేవుడూ, శివదత్తుడూ అనుమతించారు. వజ్రముష్టితోపాటు, ఇద్దరు సైనికులుకూడా విల్లంబులు తీసుకుని బయలుదేరారు. అడవిలో కొంతదూరం వెళ్ళిన తరవాత వారికి ఒకచోట నాలుగైదు లేళ్లు మేస్తూవుండటం కనిపించింది. సైనికులు బాణాలు ఎక్కు పెట్టేంతలో, వజ్రముష్టి వారిని వారించుతూ, "ఈ చిన్న జంతువులను పట్టుకునేందుకు మీరు బాణాలను వృథాపుచ్చవద్దు. మీరిక్కడే వుండండి. నేను పని పూర్తిచేసుకు వస్తాను!" అంటూ చెట్లచాటున మెల్లగా బయలుదేరాడు.

సైనికులుకూడా నిశ్శబ్దంగా వజ్రముష్టి వెనక నడవసాగారు. వజ్రముష్టి అడుగులో అడుగు వేసుకుంటూ కొంతదూరం నడిచి, లేళ్ళు వున్న చోటుకు దాపులనున్న చెట్టును పిల్లిలా ఎగబాకాడు. అతడు ఏమి చేయబోతున్నాడో తెలియని సైనికులు, ఇదంతా వింతగా చూస్తున్నారు. వజ్రముష్టి లేళ్లకు పైనవున్న చెట్టుకొమ్మల వెంట పాములా పాకిపోయి, హఠాత్తుగా అక్కడినించి వాటిమీదికి దూకేశాడు.

కనుమూసి తెరిచేంతలో లేళ్ళు చెంగున దూకినై. వాటిలో ఒకటి వజ్రముష్టి బలమైన చేతుల్లో తగుల్కొని పారిపోయేందుకు వృథా ప్రయత్నం చేస్తోంది. వజ్రముష్టి తన చేతుల్లో చిక్కిన లేడిని, సునాయాసంగా భుజానవేసుకుంటూ, "ఈ పన్నెండు సంవత్సరాల కాలం, నా ఆహార సంపాదన ఇలాగే జరిగింది. ఈటె, బాణాలు-ఇలాంటివి వాడేందుకు, అవి నా కెక్కడా లభించ

లేదు. ఒకటి రెండుసార్లు పెద్దపులినుంచీ, ఎలుగుబంటినించీ, పట్టిచేతులతో పోరాడి ప్రాణరక్షణ చేసుకున్నాను," అన్నాడు చుట్టూ చేరిన సైనికులతో.


సైనికులు, వజ్రముష్టి దేహబలాన్నీ, ప్రదర్శించిన తెలివితేటలనూ చూచి చాలా ఆశ్చర్యపోయారు. దాదాపు అయిదు అడుగుల ఎత్తూ, పొట్టి కాళ్ళూ, పొట్టి చేతులూ-అతడిలో అంత శక్తి వుంటుందని మొదట్లో వాళ్ళూహించలేదు.


కొద్దిసేపటితరవాత, అందరూ తిరిగి శివదత్తుడున్న చోటు చేరారు. వజ్రముష్టి లేడిని పట్టిన విధం, సైనికులు చెప్పగా విని, శివదత్తుడు చాలా ఆశ్చర్యపడ్డాడు.

మందరదేవుడు కూర్చున్న చోటునుంచి లేచి, వజ్రముష్టిని సమీపించి అతడి భుజం తడుతూ, "వజ్రముష్టీ, నువ్వు మా అనుచరుడుగా లభించటం మా అదృష్టం అనుకుంటున్నాను. నీకు సముద్రకేతుడు చేసిన ద్రోహంలాంటిదే, నాకూ నరవాహనుడనే వాడుచేశాడు. మన ఇద్దరం పగతీర్చుకునేందుకే బ్రతకాలి!" అన్నాడు.

"మందరదేవుడు చెప్పినట్టు, నువ్వు, మాకు అనుచరుడుగా వుండవలసిన వాడివే! ఈ ద్వీపంలో మేము ఎదుర్కోవలసిన ప్రమాదాలేమైనా వుంటే, అందుకు నువ్వు మావెంట వుండి సహాయపడగల వనుకుంటాను. ఏదో ఒక రోజున నిన్ను పన్నెండేళ్లు ఈ భయంకర ద్వీపంలో ప్రవాసిగా చేసిన, ఆ ఓడదొంగ సముద్రకేతుడిమీద నువ్వు పగ సాధించుకోగలవని నా నమ్మకం!" అన్నాడు శివదత్తుడు.

"అయ్యా, నేనూ అలాంటి సుదినం కోసమే ఎదురుచూస్తున్నాను?" అని వజ్రముష్టి అనేంతలో, సముద్రతీరంనుంచి వికృతమైన కేకలూ, అరుపులూ వినిపించినై. అందరూ ఆశ్చర్యచకితులై ఆ ధ్వని వచ్చిన వైపుకు తలలు తిప్పారు. (ఇంకా వుంది)






## 15

[శివదత్తుడూ, మందరదేవుడూ, తాము చేరిన ద్వీపంలో ఒక విచిత్రవ్యక్తిని కనుగొన్నారు. వాడు, తను శమనద్వీపవాసిననీ, సముద్రకేతుడని పిలవబడే ఒక పిడదొంగ పన్నెండేళ్ల క్రితం, తనను ఆ ద్వీపంలో వదిలిపోయాడని చెప్పారు. ఆ తరవాత, అందరూ భోజనాల దగ్గిర కూర్చోబోయే సమయానికి, తీరంవెంట వికృతమైన కేకలు వినిపించినై. తరవాత—]

శివదత్తుడూ, మందరదేవుడూ, కత్తులు దూసి, పొదల చాటున నక్కుతూ, దాపులనే వున్న సముద్రతీరంకేసి బయలు దేరారు. వారి అనుచరులలో యిద్దరు మాత్రం వెనక వుండిపోయారు. వజ్రముష్టి చెట్లకిందినుంచి పాకుతూ, అందరికన్న ముందు సముద్రతీరం చేరి, వెనుక వస్తున్నవారికేసి 'జాగ్రత్త' అన్న సూచనగా చేయి వూపాడు.

అందరూ నిశ్శబ్దంగా చెట్ల సందునుంచి సముద్రంకేసి చూశారు. తీరంనుంచి ఒక వెయ్యి గజాల దూరంలో చిన్న నౌకా యుద్ధం జరుగుతోంది. ఆ యుద్ధంలో పాల్గొంటున్నవి మొత్తం ఆరు పడవలు. అసలే అల్లకల్లోలంగా వున్న సముద్రంలో అవి ఒకదాని నొకటి తాకుతున్నవి. ఆయుధాలు ధరించిన అనేకమంది యోధులు ఒక పడవమీంచి, మరో పడవమీదికి దూకుతూ, తళతళలాడె కత్తులతో బాహాబాహి యుద్ధం చేస్తున్నారు.

ఉన్నట్టుండి హఠాత్తుగా, నల్లని వికృతాకారు డొకడు నోటితో కత్తి పట్టుకుని, ఒక



పడవ తెరచాపమీదికి సగంవరకూ పాకి, అక్కణ్ణించి కత్తిని కుడిచేత్తో ఝుళిపిస్తూ, 'జై కాలకేయా!' అంటూ అరిచి, మరో పడవమీదికి దూకాడు.

ఇక, ఆ క్షణంనుంచి పోరాటం మరీ భీకరంగా సాగింది. ఇరుపక్షాల యోధుల్లో కొందరు చేతులూ, తలలూ తెగి పడవల నించి దభీమని సముద్రంలో పడిపోతున్నారు. శిరస్త్రాణంలో ఒంటి కొమ్ము ధరించివున్న, ఆ నల్లని వికృతాకారుడు భీకరంగా అరుస్తూ, ఒక పడవమీంచి ఇంకో పడవమీదికి కత్తి గిరగిరా తిప్పుతూ కుప్పిగంతులు వేస్తున్నాడు.

"అయ్యో, వాడే సముద్రకేతుడు! క్రూరాతిక్రూరుడైన సముద్రపు దొంగ!" అన్నాడు వజ్రముష్టి, శివదత్తుడితో.

శివదత్తుడూ, మందరదేవుడూ ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు. ఆ వికృతాకారుడు సముద్రకేతుడని తెలియగానే, ఇప్పుడు జరుగుతున్న యుద్ధం ఆ బందిపోటు ముఠాకూ, సముద్రం మీద పోతున్న మరేదో వర్తకుల పడవలకూ మధ్య అని శివదత్తుడు వూహించాడు. ఇప్పుడు ఏమి చేయటమా అని అతడు ఆలోచించేటంతలో, ఒక చిన్న తొట్టె పడవలాటిది తక్కిన పెద్ద పడవలనుంచి వేరై తీరంకేసి రాసాగింది.

శివదత్తుడూ, మందరదేవుడూ ఆశ్చర్య చకితులయ్యారు. ఆ చిన్నపడవ తీరంకేసి బయలుదేరటం, యుద్ధం చేస్తున్నవారెవరూ గుర్తించినట్టు లేదు. వాళ్ళు మామూలుగానే కేకలు పెడుతూ, పడవల మీదినుంచి దూకుతూ, ఒకరి నొకరు కత్తులతో నరుక్కుంటున్నారు.

కొద్దికాలం గడిచింది. హఠాత్తుగా సముద్రకేతుడు పెద్దకేక పెట్టి, "హేయ్! వాళ్ళు పారిపోతున్నారు. ఈదుకుపోయి ఆ పడవను పట్టుకోండి!" అంటూ అరిచాడు.

వెంటనే సముద్రపు దొంగల ముఠాలోని కొందరు సముద్రంలోకి దూకి, ఆ చిన్న తొట్టెపడవకేసి యీదసాగారు. వాళ్ళ వెంటనే మరి కొందరు దూకి, ఈదుకు పోతున్న ఆ దొంగలను వెనకనుంచి తమ కత్తులతో ఎదుర్కొన్నారు.

అప్పుడు, ఇరు పక్షాలవాళ్ళూ సముద్ర జలంలో ఈదుతూనే, ఒకరితో ఒకరు వీల యితే కత్తులతో, లేకపోతే ముష్టాముష్టి కలియబడి పోరాడసాగారు.

"ఈ యుద్ధం మరీ విచిత్రంగా ఉంది. ఒకవైపు నీటిలో ఈదుతూనే, మరో·వైపు శత్రువును చంపజూడటం...యిలాంటి యుద్ధం నే నెక్కడా చూడలేదు!" అన్నాడు మందరదేవుడు.

శివదత్తుడు అవునన్నట్టు తల వూపాడు. అతడి దృష్టి ఒకమారు పోరాటం జరుగు తున్న పడవలకేసీ, మరోమారు తీరం సమీ పిస్తున్న తొట్టెపడవకేసీ ప్రసరిస్తున్నది. ఈ రెండింటికీ మధ్యగా సముద్రంలో ఈత గాళ్ల మధ్య భయంకర రణం సాగుతోంది.

క్రమంగా తొట్టెపడవ తీరాన్ని సమీ పించింది. ఇంకా ఒడ్డు ఐదారు గజాలు ఉండనగానే, అందులోంచి ఇద్దరు స్త్రీలు నీళ్ళల్లోకి దూకి, గబగబా ఒడ్డు చేరారు.



మరుక్షణంలో, సముద్రకేతుడి భీకరస్వరం సముద్రంమీద మార్మోగింది. వెంటనే రెండు పడవలు తీరంకేసి వేగంగా బయలు దేరినై. మునిగిపోతున్న రెండు పెద్ద పడవ లలోనుంచి కొందరు హృదయవిదారకంగా అరవసాగారు.

"మందరదేవా! ఇక మనం బయట పడక తప్పదు," అన్నాడు శివదత్తుడు. "ఆ పారిపోతున్న స్త్రీలు ఎవరన్నది ప్రస్తు తానికి అనవసరం. మనం, వెంటనే ఆ బందిపోటు సముద్రకేతుణ్ణి ఎదిరించకపోతే, వాళ్ళిద్దర్నీ అతడు సునాయాసంగా దొరక పుచ్చుకుంటాడు!"



మందరదేవుడు వెనుదిరిగి చూశాడు. అతడికి ముగ్గురు సైనికులూ, వజ్రముష్టి మాత్రం కనిపించారు. "తక్కిన ఇద్దరూ ఎక్కడ?" అని ఒక సైనికుణ్ణి మందరదేవుడు ప్రశ్నించాడు.

"అయ్యా, వాళ్లిద్దరూ భోజన సామగ్రి దగ్గిరే వుండిపోయారు!" అన్నాడు ఆ సైనికుడు వెనుదిరిగిచూస్తూ.

"వెంటనే వాళ్ళను ఇక్కడకు పిలుచుకురా!" అని మందరదేవుడు ఆ సైనికుణ్ణి ఆజ్ఞాపించాడు.

సైనికుడు వెనుదిరిగి బయలుదేరేంతలో శివదత్తుడు అతడిని ఆపి, "మందరదేవా, మనం అందరంకలిసి ఎనిమిదిమందిమి మాత్రమే! సముద్రకేతుడి బందిపోటు ముఠా యాభై అరవైకి పైబడే ఉన్నట్టు కనబడుతోంది. మనం వాళ్ళను ఎదుర్కోవాలంటే, ఒక వుపాయం వుంది!" అన్నాడు.

'ఏమిటది!' అన్నట్టు మందరదేవుడు శివదత్తుడికేసి చూశాడు.

"మనం ఇంత స్వల్ప సంఖ్యలో ఉన్నట్టు సముద్రకేతుడు తెలుసుకోవటం మహా ప్రమాదం. అందుకని, మనం అయిదుగురం చెట్ల చాటునుంచి, ఒక్కసారిగా సహస్ర కంఠాలతో అరిచినట్టుగా, భీకరంగా అరుస్తూ, వాళ్ళమీదకు ఉరుకుదాం. ఇక మిగిలిన ముగ్గురూ, ఆ బందిపోటులను వెనుకనుంచి మనలాగే అరుస్తూ, ఎదుర్కొంటారు!" అన్నాడు శివదత్తుడు.

మందరదేవుడు అంగీకరించాడు. భోజనాల దగ్గిర ఉన్న ఇరువురు సైనికులతూ ఈ సంగతి చెప్పి, వాళ్ళతోపాటు బందిపోటు ముఠాను వెనుకనుంచి ఎదుర్కోవలసిందిగా ఆ సైనికుడు ఆజ్ఞాపించబడ్డాడు.

క్రమంగా, సముద్రకేతుడున్న పడవలు రెండూ తీరం చేరసాగినై. సముద్రంలో పోరాటం చల్లారింది. రెండు పడవలు మునిగిపోగా, మిగిలిన రెండు పడవలనూ,


సముద్రకేతుడి బందిపోట్లు వశపరుచుకుని, వాళ్ళూ తీరంకేసి బయలుదేరారు. వాళ్లకు దారిలో, నీట తేలుతూ పోరాడుతున్నవాళ్లు కనిపించగానే, తమవాళ్ళను పడవలలోకి లాగుతూ, శత్రువులను, పడవలమీద ఉండే, కత్తులతో తుదముట్టించసాగారు.

శివదత్తుడు ఆ భయంకర దృశ్యంకేసి ఓమారు చూచి, "మందరదేవా! ఆ బందిపోట్లు మొత్తంమీద అందరినీ హతమారుస్తున్నారు. ఇక, ఆ స్త్రీలను రక్షించే భారం మనం వహించవలసిందే!" అన్నాడు.

మందరదేవుడు సాలోచనగా తల వూపి, "ఇక మనం బయలుదేరుదాం!" అంటూ రెండడుగులు ముందుకు వేసి, పక్కనే వస్తున్న వజ్రముష్టికేసి చూచి, "అరెరే, వజ్రముష్టి నిరాయుధుడు! ఆ సంగతి ఇంతవరకూ మనం గమనించనేలేదు," అన్నాడు ఆశ్చర్యపోతూ.

ఆ మాటలకు వజ్రముష్టి నవ్వాడు. "అయ్యా, నాకు కావలిసిన కత్తిని నేనే సంపాయించుకోగలను. వీలైతే, ఆసముద్రకేతుణ్ణి నా చేతులమీదుగా హతమార్చాలని ఆశగావుంది," అన్నాడు.

అందరూ అక్కడినుంచి బయలుదేరారు. వజ్రముష్టి ఆ ప్రాంతమంతా



బాగా ఎరిగివున్నవాడు గనక, ముందు దారి తీశాడు. ఒడ్డుకు చేరిన స్త్రీలిద్దరూ, ఒకసారి సముద్రంకేసి చూసి, తమను సముద్రకేతుడు వెంబడిస్తున్నాడని గ్రహించి, భయకంపితులై అక్కడ ఉన్న గుబురు చెట్లలోకి పరిగెత్తారు.

అంతలో సముద్రకేతుడు ఉన్న పడవలు రెండూ తీరం చేరినై. అతడు కత్తి పైకెత్తి, 'జై కాలకేయా!' అంటూ నీటిలోకి ఉరికి, వెనుదిరిగి తన అనుచరులకేసి చూస్తూ, "ఆ స్వయంప్రభకు మాత్రం హాని కలగకూడదు! ఆ ముసలిదాన్ని కత్తికి ఎరచేయండి," అన్నాడు భీకరంగా.

సముద్రకేతుడు మోకాటి నీటిలో నడిచి, ఒడ్డు చేరాడు. అతడి వెనకనే, ఇరవైమంది సముద్రపు దొంగలు కూడా ఒడ్డెక్కారు. అందరూ ఆ స్త్రీలు పారిపోయిన గుబురు చెట్లకేసి, నిశ్శబ్దంగా బయలుదేరారు.

"మనం, ఆ ప్రదేశాన్ని ముందు చేరటం అవసరం. వాళ్లు చెట్లను సమీపించేంతలో, అందరం ఒక్కమారు అరుస్తూ, వాళ్ళ మీదకు దూకుదాం. విజయమో, వీర స్వర్గమో..." అన్నాడు శివదత్తుడు.

"అంతా మరాళదేవి కరుణ!" అంటూ మందరదేవుడు కత్తి పైకెత్తి, ఓమారు నమస్కరించాడు.

అందరూ ఆ చెట్ల గుంపులో దొరబడి, కత్తులు దూసి సిద్ధంగా ఉన్నారు. పారి పోయివచ్చిన స్త్రీల అలికిడి ఎక్కడా లేదు. "బహుశా వాళ్ళు, ఇంకా లోపలకు పారి పోయివుంటారు!" అన్నాడు మందరదేవుడు. శివదత్తుడు తలవూపి, "ఒకసారి, ఈ సముద్ర దొంగలను పారదోలితే, తరవాత వాళ్ళెక్కడ దాగివున్నదీ, తెలుసుకోవటం ఏమంత కష్టం కాదు," అన్నాడు.

సముద్రకేతుడు తన అనుచరులతో క్రమంగా చెట్లగుంపుకేసి రాసాగాడు. వజ్రముష్టి అక్కడ ఎత్తుగా పెరిగిన ఒక చెట్టు మీదికి పాకి, కిందకు వంగివున్న ఒక కొమ్మ



మీద పాములా పడుకున్నాడు. సముద్ర కేతుడు అనుచరులతో ఆ చెట్టుకిందికి రాగానే, 'జై కాలకేయా!" అంటూ అతడు వారి మధ్యకు మెరుపులా దూకాడు. అదే సమయంలో 'జై మరాళీ!" అంటూ శివదత్తుడూ, మందరదేవుడూ, సైనికులతో చెట్లమాటునుంచి ఒక్కమారు బయటపడి, సముద్రకేతుడి మీదికి లంఘించారు.

కనురెప్పపాటు కాలం, సముద్రకేతుడు నివ్వెరపోయాడు. ఈలోపల వజ్రముష్టి, సముద్రపు దొంగలలో ఒకడినుంచి కత్తి గుంజుకుని, సింహంలా గర్జిస్తూ ఒకరిద్దరు శత్రువులను హతమార్చాడు.

అసరికి సముద్రకేతుడు తెప్పరిల్లాడు. అతడు తన అనుచరులను ప్రోత్సహిస్తూ, 'జై కాలకేయా!' అని అరిచి, శివదత్తుడి మీదికి దూకాడు. అప్పటికే అతడి అనుచరులు కొందరు వెన్ను చూపి సముద్రం కేసి పరిగెత్తసాగారు. ఇంతలో మరొక వైపునుంచి, ముగ్గురు సైనికులు భీకరంగా అరుస్తూ, దొంగలమీదికి దూకారు.

సముద్రకేతుడు బెదరలేదు. అతడు శివదత్తుడితో యుద్ధం చేస్తూనే కొంచెం కొంచెంగా వెనక్కు జరుగుతూ, "పారిపోకండి, నిలబడండి. శత్రువులు ఎనిమిది మందికన్న ఎక్కువ లేరు!" అని అరవ



సాగారు. ఆ కేకలకు పారిపోతున్న అతడి అనుచరులు వెనుదిరిగి, ధైర్యం తెచ్చుకుని, తిరిగి శివదత్తుడి సైనికులమీద యుద్ధానికి తలబడ్డారు.

నాలుగైదు నిమిషాలసేపు పోరు ముమ్మరంగా సాగింది. వజ్రముష్టిని నలుగురైదుగురు బందిపోట్లు చుట్టుముట్టారు. కాని, అతడు అందరి కత్తిదెబ్బలనూ కాచుకుంటూ, తన చేతిలోని కత్తిని మెరుపులా తిప్పుతూ, వాళ్ళల్లో కొందరిని గాయపరిచాడు. గాయపడినవాడు ఒక్క చావుకేక పెట్టి వెనుకకు పడిపోగానే, ఆ స్థానాన్ని మరొకడు ఆక్రమించుకుంటున్నారు.

పోరాటం, ఈ విధంగా మరెంతో కాలం సాగదని శివదత్తుడు గ్రహించాడు. అతడు, తనకన్న తక్కువ వయసువాడూ, మహాబలశాలీ అయిన సముద్రకేతుడితో యుద్ధం చేస్తూనే, ఒక కంట సముద్రతీరం చేరుతున్న శత్రువుల పడవలు రెంటినీ కనిపెడుతూనే ఉన్నాడు. ఆ పడవలలోనుంచి మరికొందరు శత్రువులు ఒడ్డు చేరితే, ఆ తరవాత అందరూ కలిసి తననూ, అనుచరుల్నికూడా చుట్టుముట్టగలరు. ఈ పరిస్థితుల్లో తను అనుచరులతోపాటు వెనకకు తగ్గటమే మంచిదని అతడు నిర్ణయించుకున్నాడు. ఈసరికి, తను రక్షించ దలచిన స్త్రీలిద్దరూ, అడవిలో చాలాదూరం పారిపోయివుంటారని అతడు భావించాడు.

శివదత్తుడు "జై, మరాళీ!" అంటూ ఒక్క కేక వేసి, సముద్రకేతుణ్ణి కుడి కాలుతో బలంగా తన్ని, అతడు వెనక్కు పడబోయి, తిరిగి కాలూదుకునేంతలో పెద్దగా తన అనుచరులను హెచ్చరించి, చెట్ల గుంపుకేసి పరిగెత్తాడు. అదే సూచనగా, అతడి అనుచరులుకూడా వెనుకడుగు వేశారు. కళ్ళుమూసి తెరిచేంతలో, శివదత్తుడూ, అతడి అనుచరులూ చెట్ల చాటుకు పారిపోయారు. (ఇంకా వుంది)






**16**

[సముద్ర తీరంనుంచి వినవచ్చిన కేకలు ఎవరివో తెలుసుకునేందుకు వెళ్ళిన శివదత్తుడికీ, అతడి అనుచరులకూ సముద్రపు దొంగల నాయకుడైన సముద్రకేతుడు కనిపించాడు. అతడి బారినుంచి తప్పుకు పారిపోతున్న ఇద్దరు స్త్రీలు అడవిలోకి పరిగెత్తారు. వారిని వెన్నంటివస్తున్న సముద్రకేతుణ్ణి, శివదత్తుడు ఎదుర్కొన్నాడు. తరవాత—]

శివదత్తుడు, తన అనుచరులతో చెట్ల చాటుకు పారిపోయేంతలో ఒడ్డుకు చేరిన రెండు పడవలలోనుంచి కేకలు పెడుతూ కొందరు సముద్రపు దొంగలు కిందికి దిగారు. బాగా అలిసిపోయిన సముద్రకేతుడు కత్తిని, అక్కడ ఇసుకలో గుచ్చి రొప్పుతూ, "హెయ్, వాళ్ళంతా చెట్లచాటుకు పారిపోయారు. ఇంతవాకా మీరేం చేస్తున్నారు?" అంటూ తన అనుచరుల్ని కసిరాడు. తరవాత, స్త్రీలు పారిపోయిన వైపుకేసి చేయి చూపుతూ, "ఒక్క ఇరవై మంది మాత్రం ఇక్కడ ఉండి. తతిమ్మావాళ్ళు ఆ ఆడదయ్యాలను వెతికి పట్టుకురండి!" అని ఆజ్ఞాపించాడు.

వెంటనే సముద్రపు దొంగలు కిలకిల మంటూ అడవికేసి పరిగెత్తారు. సముద్రకేతుడి ఆజ్ఞలను శివదత్తుడు విన్నాడు. అతడు తన అనుచరులతో గుబురుగా పెరిగిన పొదల చాటున ఉండి యిదంతా గమనిస్తున్నాడు.

"శివదత్తా, ఇప్పుడు మనం ఏంచేయాలి? చూస్తూ ఊరుకుంటే, ఆ స్త్రీల నిద్దరినీ,



ఈ సముద్రపు దొంగలు తిరిగి పట్టుకోగలరు!" అన్నాడు మందరదేవుడు.


శివదత్తుడు, నిస్సహాయంగా తల వూపి, "ఇప్పటి పరిస్థితుల్లో మనం చేయగలిగిందేమీ లేదు. మనం ఎనిమిదిమందిమీ అసంఖ్యాకంగా ఉన్న, ఈ సముద్రపు దొంగలను ఎదిరించితే సర్వనాశం అయిపోతాం. ఈసరికి, ఆ స్త్రీలిద్దరూ, అడవిలోకి చాలా దూరం పారిపోయి, సురక్షితంగా దాక్కొగలరని ఆశిద్దాం!" అన్నాడు.

ఓ అరగంట గడిచేసరికి, అడవి ప్రాంతమంతా మార్మోగేలా, దొంగల కేకలు వినిపించినై. కొద్దిసేపటికల్లా వాళ్ళు సముద్రకేతుణ్ణి సమీపిస్తూ, "అయ్యా, ఆ ముసలిది కనబడలేదు. దీన్ని మాత్రం పట్టుకోగలిగాం!" అంటూ అతి సౌందర్యవతి అయిన కన్య నొకదానిని, తమ నాయకుడి దగ్గరకు పట్టుకు వచ్చారు.

"అహ్హహ్హ!" అంటూ సముద్రకేతుడు నవ్వి, "మనకు డబ్బు తెచ్చిపెట్టేది ఇదే! ఆ ముసలిది తిండి దండగ తప్ప మరెందుకూ కొరగాదు. ఇక పడవలెక్కండి!" అంటూ వెనుదిరిగి, "అన్నట్టు, ఇక్కడ చేరిన ఆ కొత్తవాళ్ళెవరో గుర్తుపట్టారుగదా? ఈ ప్రదేశంకూడా మరిచిపోకండి. వీలయినప్పుడు వచ్చి వాళ్ళందర్నీ వేటాడాలి!" అన్నాడు రోషంగా.

సముద్రకేతుని నాలుగు పడవలూ తీరం నుంచి లోపలకు బయలుదేరినై. శివదత్తుడు ఆ పడవలకేసి క్షణకాలం చూచి, "ఇక, ప్రస్తుతానికి మనం చేసేదేమీ లేదు. భోజనాలు ముగిద్దాం. పదండి!" అనేంతలో, అల్లంత దూరంనుంచి ఎవరో స్త్రీ రోదిస్తున్న ధ్వని వినబడింది.

శివదత్తుడు ఆశ్చర్యపోతూ, మందరదేవుడికేసి చూసి, ఆ రోదనధ్వని వచ్చిన వైపుకు బయలుదేరాడు. అనుచరులందరూ, అతణ్ణి అనుసరించి నడిచారు.



శివదత్తుడు, తన అనుచరులతో కొద్ది సేపటికల్లా ఆ స్త్రీ ఉన్న చోటుకు వెళ్ళాడు. ఆమె మరెవరో కాదు; సముద్రకేతుడి బారినుంచి పారిపో ప్రయత్నించిన ఇద్దరు స్త్రీలలో ఒకతె! శివదత్తుడు ఆమెను సమీపించి, "అమ్మా మీరెవరు? మీ పేరేమిటి? మీది ఏదేశం?" అని ప్రశ్నించాడు.

ఆ స్త్రీ, శివదత్తుడి ప్రశ్నలు వింటూనే, ఉలిక్కిపడి తల ఎత్తి అతడికేసి చూసి, భయభ్రాంతు రాలైంది. అది గమనించిన శివదత్తుడు, "అమ్మా, మానుంచి మీకు ఎలాంటి కీడూ రాదు. మీరు మరొక యువతితో, సముద్రకేతుడి బారినుంచి పారిపోవటం మేము చూచాం. నా అనుచరులు ఎనిమిదిమందికన్న ఎక్కువ లేరు. ఈ కొద్దిమందితో దాదాపు యాభై అరవైమంది సముద్రపు దొంగలను ఎదిరించటం ప్రమాదకరమని ఊరుకున్నాను!" అన్నాడు.

"అయ్యో, స్వయంప్రభను, ఆ క్రూరులు తిరిగి పట్టుకుపోయారు!" అంటూ ఆ స్త్రీ బిగ్గరగా విలపించ సాగింది.

శివదత్తుడు, ఆమె దుఃఖాన్ని వారించేందుకూ, తను సహాయపడగలనన్న ధైర్యం ఆమెకు కలిగించేందుకూ, తన కథ యావత్తూ ఆమెకు క్లుప్తంగా చెప్పాడు.

అంతా విన్న ఆ స్త్రీ ఏడ్పు మాని, "అయ్యా, నా పేరు దేవమాయి. మాది శమనద్వీపం. పది పన్నెండేళ్ళక్రితం నన్ను ఈ సముద్రకేతుడు బందీగా పట్టుకున్నాడు. అప్పటినుంచీ వాడిదగ్గిర బానిసగా బ్రతుకుతున్నాను. ఇప్పుడు వాడు బంధించుకుపోయిన కన్య పేరు, స్వయంప్రభ! ఆమెను నాలుగు రోజులక్రితమే ఆ క్రూరుడు శమనద్వీప తీరంలో జలవిహారం చేస్తూండగా పట్టుకున్నాడు," అని చెప్పింది.


"అయితే, మీరు పదేళ్లనుంచి ఆ సముద్రకేతుడి దగ్గిర బందీగా ఉంటున్నారన్న మాట? అలా అయితే, ఆ క్రూరుణ్ణి

గురించి సర్వం మీకు తెలిసివుంటుందని భావిస్తాను!" అన్నాడు శివదత్తుడు.

అందుకు దేవమాయి తల వూపి, "అయ్యా, వాణ్ణిగురించి సర్వం నాకు తెలుసు! ఈ ద్వీపం పడమటి తీరంలో 'మకరమండలం' అని పిలవబడే ఒకానొక కొండ ప్రదేశం ఉంది. ఆ ప్రాంతానికి వెళ్ళేందుకు ఒకే ఒక మార్గం ఉంది. అదంతా చిన్న చిన్న ఉప్పుటేరుల మయం. ఆ ఉప్పుటేరుల్లో ఉన్న ఒక మిట్టప్రదేశం ఆతడి నివాస స్థానం!" అన్నది దేవమాయి.

"అయితే, స్వయంప్రభను ఆ క్రూరుడు అక్కడికే పట్టుకుపోయి ఉంటాడు. ఆ మకర మండలంలో నివసించే మనుష్యులు నాగరిక జాతులా? లేక అడవి మనుష్యులా?" అని అడిగాడు శివదత్తుడు.

"ఆ మకరమండల వాసులు కేవలం అనాగరికులు మాత్రం కాదు. వారు పల్లెల్లో నివసిస్తూ ఉంటారు. వేటాడటమే వాళ్ళకు ప్రధానమైన వృత్తి. వారికి ఒక రాజు కూడా ఉన్నాడు. కాని, నాలుగైదేళ్ళుగా ఆ ప్రాంతమంతా అల్లకల్లోలంగా ఉంది. దానికి కారణం మకరమండల ప్రాంతాల్లో గల ఒకానొక కొండ చరియలో నివాసం ఏర్పరచుకున్న పెద్ద మొసలి!" అన్నది దేవమాయి.



"ఒక్క మొసలి కారణంగా...అది ఎంత పెద్దదయినా—దాన్నుంచి మొత్తం మకరమండల వాసులు భయపడుతున్నారా? ఆశ్చర్యంగా వుంది!" అన్నాడు శివదత్తుడు.

"అయ్యో, అది మామూలు మొసలి కాదు!" అన్నది దేవమాయి, వికృతాకారుడైన వజ్రముష్టికేసి భయంగా చూస్తూ. "ఆ మొసలికి పైశాచిక శక్తులున్నవనే వాదు ఉన్నది. దానిని వాళ్ళు, 'మకరదేవత' అని పిలుస్తారు. దానికి ఆహారంగా ప్రతి దినం నలుగు రైదుగురు మనుష్యులను వేస్తూంటారు. ఆ పని మకరమండల రాజైన హరిశిఖుడు స్వయంగా చేస్తూంటాడు. అందుకు కావలసిన మనుష్యులను ఈ సముద్రకేతుడు, హరిశిఖుడికి అమ్ముతూంటాడు!"

"అదా రహస్యం!" అంటూ శివదత్తుడు, మందరదేవుడికేసి చూశాడు.

"ఆ మొసలిని నేను సంహరించగలను. మీరు అనుమతించితే, ఆ మకరమండలానికి నేను బయలుదేరతాను!" అన్నాడు వజ్రముష్టి, శివదత్తుడికేసి చూస్తూ.

వజ్రముష్టి ఇలా అనేసరికి, దేవమాయి ముఖంమీద సంతోష చిహ్నాలు పొడచూపినై. ఆమె వజ్రముష్టికేసి ఆప్యాయంగా





చూస్తూ, "రెండు సంవత్సరాల క్రిందట, మకరమండల వాసి ఒకడు గణంపూని భవిష్యత్తులో జరగబోయేదాన్ని గుర్చి చెప్పాడు. మూడు నాలుగడుగులు ఎత్తుగల వికృతాకారు డొకడు, మకరమండలానికి త్వరలో వస్తాడనీ, అతడి చేతిలో ఆ మొస లికి చావు రాసిపెట్టి ఉన్నదనీ, ఆ తరవాత మకరమండలం, ఏ అరిష్టాలూ లేకుండా, సర్వసంపదలతో తులతూగగలదనీ అతడు అన్నాడు!" అని చెప్పింది.


దేవమాయి మాటలకు శివదత్తుడు నవ్వాడు. తరవాత వజ్రముష్టికేసి తిరిగి, "బహుశా, ఆ వికృతాకారుడు వజ్రముష్టే కావొచ్చు! నువ్వు ఆ మకరమండలానికి దారి చూపితే, మనం అక్కడికి బయలు దేరదాం!" అన్నాడు.

"దారిలో, సముద్రకేతుడి నివాసస్థానం ఉంది! దానిని తప్పుకు పోవటం సాధ్య మయే పని కాదు!" అన్నది దేవమాయి భయంతో వణికిపోతూ.

"ఆ సాధ్యాసాధ్యాలు మేము చూచు కుంటాం. స్వయంప్రభకూడా ప్రస్తుతం, ఆ క్రూరుడి అధీనంలో ఉండివుంటుంది!" అన్నాడు మందరదేవుడు కోపంగా.

"అవును, ఆమెనుకూడా ఆ సముద్ర కేతుడు మకరదేవతకు ఆహారంగా అమ్మ చూస్తున్నాడు. ఆ సంగతి నాకు తెలుసు. అందమైన యువతులకూ, బలిష్ఠులైన యువకులకూ హరిశిఖుడు ఎక్కువ ధనం ఇస్తూంటాడు. అందుకే సముద్రకేతుడు అలాంటి వాళ్లకై సముద్రతీరాలు వెతుకు తూంటాడు!" అన్నది దేవమాయి.

శివదత్తుడు ఆమె మాటలు విని కొంచెం సేపు ఆలోచించి, "దేవమాయీ, ఏవిధంగా నైనాసరే, మేము స్వయంప్రభను రక్షిస్తాం. ఆ క్రూర సముద్రకేతుణ్ణికూడా సర్వ నాశనం చేసితీరుతాం! హరిశిఖుడి సంగతి తరవాత ఆలోచించవచ్చు" అన్నాడు.



శివదత్తుడి మాటలకు మందరదేవుడు అవునన్నట్లు తల ఊపాడు. తరవాత శివ దత్తుడు తన అనుచరులకేసి తిరిగి, "ముందు భోజనాలు ముగించు కుందాం. తరవాత జాగుచేయక ఆ మకరమండలానికి బయలు దేరుదాం!" అన్నాడు.

అనుచరులందరూ అంగీకార సూచకంగా తలలూపారు. దేవమాయితో సహా అందరూ లోగడ వదిలిపెట్టిన భోజనాల దగ్గరకు వచ్చి, త్వరత్వరగా భోజనాలు ముగించారు. అప్పటికి సూర్యుడు నెత్తి మీదికి వచ్చాడు. ఎండ తీక్షణంగా వుంది. కొంచెంసేపు విశ్రాంతి తరవాత, "ఇక బయలుదేరదాం. ప్రొద్దుకుంకే లోపల, ఆ సముద్రకేతుడి నివాసస్థానం ఎక్కడో తెలుసుకోవటం అన్నివిధాలా మంచిది!" అన్నాడు శివదత్తుడు.

కొద్దిసేపట్లో అందరూ ప్రయాణానికి సిద్ధమయారు. ద్వీపానికి పడమటి ప్రాంతాన గల సముద్రకేతుడి నివాసస్థానం తెలిసినది ఒక్క దేవమాయికే అవటంవల్ల, ఆమెకు మార్గం చూపే బాధ్యత ఒప్పచెప్ప బడింది. శివదత్తుడూ, మందరదేవుడూ ఆమెకు ముందు వెనకల నడవసాగారు. అనుచరులు వాళ్లవెనక బయలుదేరారు.

వాళ్ళు నడుస్తున్న మార్గంలో ఎక్కడా జనసంచారం ఉన్న గుర్తులే లేవు. ఎక్కడా కాలిబాటలుగాని, నివాసస్థానాలుగాని వారికి కనిపించలేదు. చిత్రవెత్తుగా పెరిగిన మహా వృక్షాలతో, వాటి మొదళ్లకు అంటిపెట్టుకు పెరుగుతున్న అనేక రకాల అడవిచెట్లతో— ఆ ప్రాంతమంతా మిట్టమధ్యాహ్నంవేళ కూడా చీకటిమయంగా ఉంది. ఆ ప్రాంతాల, వారికి చెట్లనుంచి వేలాడుతున్న పెద్ద పెద్ద కొండచిలువలు కనిపించినై.

అజాగ్రతవల్ల వాటి బారి పడకుండా, శివదత్తుడూ, అతని అనుచరులూ ఎంతో మెలకువతో ముందుకు నడవసాగారు.

సరిగా సూర్యాస్తమయం కాబోయేవేళ వజ్రముష్టి అందరికన్న ముందు నడిచి, దారిపక్కన ఉన్న ఒక పెద్ద చెట్టు ఎక్కాడు. అతడికి దాదాపు ఒక మైలు దూరంలో అల్లిబిల్లిగా ఉన్న సముద్రపు ఉప్పుటేర్లూ, అందులో చిన్న చిన్న భూభాగాలూ కనిపించినై. అలాంటి ఒక ప్రదేశంలో కొందరు మనుష్యులుకూడా ఉండటం వ్రజముష్టి గుర్తించాడు.

వజ్రముష్టి వెంటనే చెట్టు దిగి, శివదత్తుణ్ణి సమీపించి, "అయ్యా, మనం దేవమాయి చెప్పే సముద్రకేతుడి నివాసస్థానానికి ఎంతో దూరంలో లేమనుకుంటాను. ఆ చెట్టుమీంచి చూస్తే, పాముల్లా మెలికలు తిరిగివున్న ఉప్పుటేర్లూ, అక్కడక్కడా భూప్రదేశం కనబడుతున్నది. ఒకచోట కొందరు మనుష్యులుకూడా కనిపించారు. వాళ్లు సముద్రపు దొంగల ముఠా కావొచ్చు!" అన్నాడు.

"అలా అయితే, మనం అందరం ఒకేసారి ఆ ప్రాంతాన్ని సమీపించటం మంచిది కాదు. నువ్వు మరిద్దర్ని వెంటబెట్టుకుని ముందు వెళ్లి, అక్కడి స్థితిగతు లేమిటో తెలుసుకు రా!" అన్నాడు శివదత్తుడు.

శివదత్తుడి ఆజ్ఞ కాగానే వజ్రముష్టి ఇరువురు అనుచరుల్ని వెంటతీసుకుని, బయలుదేరాడు. వాళ్లు చెట్లచాటున ఎంతో జాగ్రత్తగా నడుస్తూ, కొద్దిసేపటికి ఉప్పుటేర్లు ఉన్న ప్రాంతం చేరారు. ఉప్పుటేరు ఒడ్డున గుబురుగా పెరిగిన చెట్ల చాటునుంచి, ముందుకు చూచినప్పుడు వారికి ఉప్పుటేరులో చిన్న చిన్న తెప్పలు కొన్ని కనిపించినై. ఆ ఉప్పుటేరు వెడల్పు, నలభైయాభై గజాలకంటె ఎక్కువ ఉండదు. దాని అవతల అంచున ఉన్న ఎత్తయిన ప్రదేశంనుంచి వికృతమైన నవ్వులూ, కేకలూ వినిపించు తున్నయ్.

(ఇంకా వుంది)






## 17

[సముద్రకేతుడి దొంగలతో, శివదత్తుడు కొద్దిసేపు యుద్ధంచేసి, అడవిలోకి పారిపోయాడు. అక్కడవారికి దేవమాయి అన్న పేరు గల స్త్రీ కనబడింది. ఆమె వల్ల, శివదత్తుడు మకరమంతల వృత్తాంతం విన్నాడు. వజ్రముష్టి ఇద్దరు అనుచరులతో ముందు బయలుదేరాడు. అతనికి సముద్రకేతుని దొంగల ముఠా కనిపించింది. తరవాత—]

వజ్రముష్టి, ఉప్పుటేరు అవతలినుంచి విన వస్తున్న, వికృతమైన సవ్వడి విని, తన అనుచరులవైపుకు తిరిగి,

"అది సముద్రకేతుడి దొంగల ముఠా అయివుండ వచ్చు. వాళ్లెవరైనా—తాగి తందనాలాడుతున్నారని మాత్రం తెలుస్తూనే ఉంది. మీరిక్కడే ఉండండి, నేను తెలుసుకుని వస్తాను!" అంటూ వజ్రముష్టి నేలమీద పాకుతూ పోయి, ఏటి ఒడ్డునే ఉన్న ఒక తెప్పను చేజిక్కించుకున్నాడు.

కొద్దిసేపట్లో వజ్రముష్టి అవతలి ఒడ్డు చేరాడు. అతడు తెప్పను ఒడ్డున ఉన్న ఒక అడవిచెట్టుకు బంధించి, పాకుతూ ముందుకు వెళ్ళాడు. సమతలంగా ఉన్న ఒకచోట దాదాపు పది పన్నెండుమంది సముద్రకేతుడి అనుచరులు, తమ తమ ఆయుధాలను కుప్పగా ఒకచోట పడవేసి, ఒళ్లు మరిచేలా తాగి కేకలుపెడుతున్నారు.

వాళ్లను హతమార్చేందుకు, వజ్రముష్టికి ఇదే మంచి అదనుగా కనిపించింది. అతడు



ఒక్క దూకులో పొదమాటునుంచి ముందుకు ఉరికి, 'జై, కాలకేయా!' అంటూ కత్తిదూసి దొంగలమీదికి వురికాడు.

తమమీదికి ఎలాంటి ఘోరప్రమాదం ముంచుకు వస్తున్నదో దొంగల్లో కొందరి కైనా తెలిసేలోపల, వజ్రముష్టి చేతి వాడి కత్తి వాళ్ల తలలను మొండెంనుంచి వేరు చేసింది. ఇంతలో తెప్పరిల్లిన నలుగురైదుగురు, భీకరంగా అరుస్తూ తమ తమ ఆయుధాలకేసి పరిగెత్తే లోపల, వజ్రముష్టి వారినికూడా తుదముట్టించాడు.

ఒక్కగానొక్క దొంగ మాత్రం ఆ గందరగోళంలో వజ్రముష్టినుంచి తప్పుకుని వుప్పుటేరుకేసి పరిగెత్తగలిగాడు. కాని వజ్రముష్టి ఆతణ్ణి వదల దలచలేదు. బ్రతికి బయ్యట పడిన ఒక్క దొంగఅయినా, తమకు ముప్పు కలిగించగలడని అతడికి తోచింది.

వజ్రముష్టి, 'జై, కాలకేయా!' అని అరుస్తూ, పారిపోతున్న దొంగకేసి పరిగెత్తాడు. నిరాయుధుడూ, తాగిన మత్తులో తడబడుతూవున్న ఆ సముద్రపు దొంగ వెను తిరిగి వజ్రముష్టి భీకరాకారంకేసి ఒక మారు చూచి, "చచ్చాను!" అని పెద్దగా అరుస్తూ, ఒక్క గెంతున, ఎదురుగావున్న ఉప్పుటేర్లో దూకాడు.

వజ్రముష్టికూడా అతడి వెనుకనే ఏటిలో దూకబోయేంతలో, తాటిబొందులా అప్పటి వరకూ నీటిలో తేలుతున్న మొసలి ఒకటి ఆ సముద్రపు దొంగమీదికి వురికింది. కన్నుమూసి తెరిచేంతలో మొసలి, ఆ దొంగను నోట కరుచుకుని పారిపోయింది.

వజ్రముష్టి 'హహ్హహ్హ' అంటూ బిగ్గరగా నవ్వి, తరవాత పళ్లు కొరుకుతూ, "సముద్రకేతుడికి కూడా ఇలాంటి చావు తప్పదు! నా చేతిలో...లేకపోతే...మొసలి వాత బడి...జై. కాలకేయా!" అంటూ అరిచాడు.

ఆ సరికి, వజ్రముష్టి వెంట వచ్చిన ఇద్దరు అనుచరులూ ఏటి ఒడ్డుకు వచ్చి, వజ్రముష్టి

కేసి చేతులు ఊపారు. ఇక జాగుచేయటం మంచిదికాదని భావించి వజ్రముష్టి, తక్షిణమే ఒక తెప్పకొయ్యమీద ఎక్కి యివతలి ఒడ్డుకు చేరాడు.

వజ్రముష్టి ఏకాకిగా అంతమంది శత్రువులను హతమార్చటం చూచిన అనుచరులిద్దరూ అతడి ధైర్య సాహసాలను వేనోళ్ల మెచ్చుకున్నారు. తరవాత అందరూ కలిసి శివదత్తుడు వున్న చోటుకు వెళ్ళారు.

వజ్రముష్టిని అంతదూరాన చూస్తూనే శివదత్తుడు, "వెళ్ళిన పని ఏమైంది? సముద్రకేతుడి అనుచరులు ఆ ప్రాంతాల ఎక్కడా లేరుగదా?" అని ప్రశ్నించాడు.

వజ్రముష్టి జరిగినదేమిటో చెప్పేందుకు బిడియపడుతున్నంతలో, వెంటవున్న అనుచరు లిద్దరూ శివదత్తుడికి అతడు చేసిన సాహసకార్యం గురించి వర్ణించి చెప్పారు. శివదత్తుడూ, మందరదేవుడూ వజ్రముష్టి సాహసానికి అచ్చెరువందారు.

"వజ్రముష్టీ! నీ సాహసం కొనియాడ దగిందే! నీవు లోగడ కోరినట్టు అవకాశం వుంటే, సముద్రకేతుణ్ణి హతమార్చే పని నీకే వదులుతాను!" అన్నాడు శివదత్తుడు.


దేవమాయి, సముద్రకేతుడి పేరు వింటూనే కోపోద్రేకురాలై, "అయ్యో! వజ్ర



ముష్టి కత్తివాత పడి మరణించినవాళ్ళు ఈ ప్రాంతాల వాడు కాపు వుంచిన వాళ్లయి ఉంటారు. కనుక ఇప్పుడు మనం ఎవరి కంటా బడకుండా అతడి నివాసస్థానం చేర వచ్చు. ఇక్కడికి సుమారు నాలుగైదు మైళ్ల దూరంలో అతడు వుంటున్న ప్రదేశం ఉంది. అక్కడికి మనం చేరాలంటే పడవలమీద, వెళ్ళవలిసిందే!" అన్నది.

"సముద్రకేతుడు వుండేది, పెద్ద దుర్గం లాంటి ప్రదేశం కాదుగదా?" అని అడిగాడు శివదత్తుడు.

అందుకు దేవమాయి, "అక్కడ దుర్గం లాంటి కట్టడాలేమీ లేవు. ఆ ప్రదేశమంతా




సముద్రపు జలంతో నిండివుంటుంది. అక్కడక్కడా ఎత్తయిన భూప్రదేశాలు వున్నవి. అతడు ఉంటున్న ప్రదేశం అలాంటివాటిలో ఒకటి. అతడికి రక్షణ, ఆ ప్రదేశం చుట్టూ ఉన్న ఉప్పునీరు మాత్రమే!" అన్నది.

"అతడి అనుచరులు చాలామంది ఉన్నారుగదా?" అని అడిగాడు శివదత్తుడు.

"అనుచరులకేం, చాలామంది వున్నారు; కాని వాళ్లను మించిన బానిసలూ, శత్రువులుకూడా అక్కడే ఉన్నారు. నేను చాలా కాలం అక్కడే బానిసగా బంధింపబడ్డాను. ఒకసారి మనం, ఆ బానిసలు ఉండే, దావళ్లలో దొరపడి వాళ్లను బంధవిముక్తుల్ని చేయగలిగితే, ఆ తరవాత మన అవసరం లేకుండా వాళ్ళే సముద్రకేతుణ్ణీ, అతడి అనుచరుల్నీ తుదముట్టించగలరు!" అన్నది దేవమాయి ఉద్రేకంగా.

"ఆ బానిసలు సుమారుగా ఎంతమంది వుంటారు?" అని ప్రశ్నించాడు శివదత్తుడు.

"అయిదు వందలు...ఆరు వందలు– అంతకు తక్కువ మాత్రం ఉండరు!" అన్నది దేవమాయి.


"అయితే, ఇక మనం అక్కడికి బయలుదేరుదాం. వజ్రముష్టి సంపాయించిన చిన్న పడవల సహాయంతో, మనమందరం లోతు లేని ఈ ఉప్పుటేర్ల వెంట పోయి, ఆ సముద్రకేతుని గుహ చేరగలం! చీకటి పడుతున్నది. శత్రువును ఏమరుపాటున ఎదుర్కొని, చావుదెబ్బ కొట్టేందుకు ఇదే మంచి అదను!" అన్నాడు శివదత్తుడు.

అందరూ ఉప్పుటేరు దగ్గిరకు బయలుదేరారు. కొద్దిసేపట్లోనే వారు కనుచూపు మేర జలమయంగా వుండి, మధ్య అక్కడక్కడా పచ్చని చెట్లతో వున్న ఒక మిట్ట ప్రదేశాన్ని చేరారు. సముద్రపు దొంగలు విడిచిన పడవలు అక్కడే చెట్లకు కట్టబడి వున్నవి. అందరూ వాటిమీద ఎక్కి దేవమాయి చూపిన దిక్కుకేసి బయలుదేరారు.

ఆ సరికి బాగా చీకటిపడిపోయింది. నెలవంక ఎక్కడో మేఘాల మాటున వెలవెలపోతోంది. అక్కడికి చాలా దూరంగా, సముద్రకేతుడి నివాసస్థానం వున్న చిన్న ద్వీపఖండంలో మినుకు మినుకు మని వెలిగే దివిటీల కాంతి తప్ప — చుట్టూ, భీతికొలిపే గాఢాంధకారం!

ఆ అంధకారంలో ఒకరినొకరు హెచ్చరించుకుంటూ, పడవలు ఒకదానినొకటి తాకి ప్రమాదం సంభవించకుండా జాగ్రత్తపడుతూ, శివదత్తుడు క్రమక్రమంగా ముందుకు పోసాగాడు. దారిలో అక్కడా ఇక్కడా వున్న మిట్టప్రదేశాలమీది చెట్లలోంచి, నీటిపక్షుల అరుపులు వికృతంగా వినిపిస్తున్నవి. నీటిలో ఆహార సంపాదనకు తిరిగే మొసళ్లు, తదితర క్రూర జంతువులూ పడవలవరకూ వచ్చి, వాటి మీద మనుష్యులు కనబడగానే దూరంగా పారిపోతున్నవి.

దాదాపు నడిరాత్రి వేళకు శివదత్తుడు తన అనుచరులతో సముద్రకేతుడు నివసించే మిట్టప్రాంతపు చాయలకు చేరాడు. ఇప్పుడు చేయవలిసింది, ఏమాత్రపు చడిచప్పుడూ కాకుండా పశువులవలె దావళ్లలో బంధింపబడివున్న బానిసలను బంధ



విముక్తుల్ని చేయటం. వాళ్ళ సాయంతో సముద్రకేతుణ్ణీ అతడి అనుచరులనూ హతమార్చటం!

శివదత్తుడు ఇలా భావించేంతలో, అతడు చేరవలసిన ప్రదేశం సమీపించింది. అందరూ నిశ్శబ్దంగా పడవల మీదినుంచి ఒడ్డుకు దిగారు. తరవాత చెట్లచాటున నక్కుతూ కొంత దూరం వెళ్ళేసరికి, హఠాత్తుగా ఆ ప్రాంతాన్నంతా పట్టపగలు చేస్తూన్న అనేక వందల దివిటీల కాంతి వాళ్ళ కళ్ళబడింది.

శివదత్తుడు ఆ కాంతి ప్రసరించని గుబురు చెట్లచాటున దాక్కుని తన అను



చములను సౌంజ్ఞలతో దగ్గరకు పిలిచారు. అందరూ చెట్ల ఆకుల చాటున వుండి, దివిటీల కాంతి వచ్చిన వైపు చూచారు. అక్కడ దాదాపు నలభై యాభై మంది, సముద్రపు దొంగలు, కొందరు నిలబడి, మరి కొందరూ కూర్చుని వాళ్లకు కనిపించారు. సముద్రకేతుడు చేతిలో పాన పాత్ర పట్టుకుని, మధ్య మధ్య మద్యం సేవిస్తూ, కవచధారులై వున్న నలుగురైదుగురు వ్యక్తులతో ఏమో మాట్లాడుతున్నాడు.


దేవమాయి, తన చూపుడు వేలిని వాళ్లకేసి చూపుతూ, "ఆ నలుగురూ మకర మండల రాజైన హరిశిఖుడి సైనికులు! తెల్లవారితే మకరదేవతకు కావలసిన ఆహారంకోసం ఇక్కడికి వచ్చారు. సముద్రకేతుడు బంధించి తెచ్చినవారిలో, యుక్తవయస్కులూ, ఆరోగ్యవంతులైన వారిని ఎంత వెల అయినా ఇచ్చి కొనుక్కుని వాళ్లు వెళతారు!" అని చెప్పింది.

శివదత్తుడు ఆమె మాటలకు ఆశ్చర్యపోయి, "మకరదేవతకు ఆహారంగా వేసేందుకు మానవులు తప్ప జంతువుల్లాంటివి పనికిరావా? అది ఎంత దేవత అయినా మొసలిగదా!" అన్నాడు.

"మకరమండల వాసులంతా దాన్ని దేవతగానే చూచుకుంటారు, బహుశా క్షుద్ర దేవతగా కావొచ్చు! అది అంటే వారికి ఎక్కడలేని భయం. దానికి జంతువులను బలి ఇవ్వటమంటే, వాళ్లు అపచారంగా భావిస్తారు," అన్నది దేవమాయి.

"ఒకవేళ ఆ మూర్ఖులు భావించేదే నిజమైతే, ఆ క్షుద్రదేవత పాలిటి యముడు మన వెంటనే ఉన్నాడు!" అంటూ శివదత్తుడు, వజ్రముష్టికేసి చేయి ఊపుతూ నవ్వాడు.

"నేను ఆ ఒక్క మకరదేవతకే కాదు, ఈ క్రూర సముద్రకేతుడి పాలిటికూడా యముణ్ణి!" అన్నాడు వజ్రముష్టి కోపంతో పళ్ళు కొరుకుతూ.



"సరే, ఇక మనం నిశ్శబ్దంగా వెళ్ళి, ఆ బంధితులైన బానిసల్ని విడిపించటం క్షేమం. ఒకవేళ ఆ ప్రయత్నంలో విఫలుల మైతే, మనం వచ్చిన పడవలు ఇక్కడ వుండనే ఉన్నవి, వాటి సాయంతో పారి పోవచ్చు!" అన్నాడు శివదత్తుడు.

దేవమాయి, బానిసలు బంధించబడి వున్న చావిళ్ళకేసి దారితీసింది. అందరూ చెట్లచాటున నక్కుతూ, అటుకేసి నడిచారు. కొద్దిసేపట్లోనే వారు పశువులశాలలాగా వున్న ఒకచోటికి వచ్చారు. దానిలో పశువుల్లా కట్టు కొయ్యలకు వరసాగ్గా చాలామంది మనుష్యులు కాళ్ళూ చేతులకు సంకెళ్ళు వేయబడి బంధింపబడి వున్నారు.

శివదత్తుడు, అనుచరులను హెచ్చరించి మెల్లగా శాలలో ప్రవేశించాడు. వజ్రముష్టి సొలుపుగా కట్టివేయబడిన ఆ బానిసల దగ్గరకు వెళ్ళి, ప్రతి ఒక్కరికీ తాము వచ్చిన పని చెప్పి, నిశ్శబ్దంగా వుండవల సిందని హెచ్చరించాడు.

తమదగ్గిర వున్న ఆయుధాలతో శివ దత్తుడూ, అతడి అనుచరులూ ముందుగా కొందరు బానిసల సంకెళ్ళు వూడగొట్టారు. అలా బంధవిముక్తులైన బానిసలు తమతోటి వారిని బంధవిముక్తుల్ని చేశారు. ఈ విధంగా కొద్దిసేపట్లో ఆ చుట్టుపక్కల శాలల్లో వున్న అందరు బానిసలూ బంధ విముక్తులయ్యారు.

స్వయంప్రభ ఎక్కడ? ఈ ప్రశ్న దేవ మాయినీ, మందరదేవుణ్ణి కూడా మొదటి నుంచీ బాధిస్తూనే వుంది. వాళ్ళు చాలా మంది బానిసలను అడిగిచూశారు. వాళ్ళల్లో ఎవ్వరికీ ఆవిడను గురించి తెలియదు. స్వయంప్రభను ఈసరికే మకరదేవతకు ఆహారంగా వేశారా? అని వాళ్ళు భయ పడేంతలో, ఒక బానిస ముందుకు వచ్చి, "అయ్యో, ఇంతకు ముందే కావలివాళ్ళు ఒక సౌందర్యవతి అయిన కన్య దొరికినట్టూ,

ఆమెను చాలా వెలకు సముద్రకేతుకు ఎవరికో అమ్మబోతున్నట్టూ మాట్లాడుకోవటం విన్నాను!" అని చెప్పాడు.


ఈ వార్త దేవమాయితో పాటు అందరికీ చాలా ఊరట కలిగించింది. మందరదేవుడు శివదత్తుడి దగ్గరకు వస్తూ, "శివదత్తా! ఇక్కడ ఇంతమంది బానిసలు ఉన్నారుగదా? వీళ్లకు కాపలా అంటూ ఎవరూ లేకపోవటం వింతగా లేదా?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.


శివదత్తుడు ఆ ప్రశ్నకు నవ్వి, "ఈ సముద్రజలం మధ్య ఈ మిట్టమీద కాళ్ళూ చేతులూ గొలుసులతో బంధించబడిన వ్యక్తులు ఎక్కడికి పోగలరు? సరే, ప్రస్తుత కర్తవ్యం సంగతి ఆలోచిద్దాం! స్వయంప్రభ ఈ ప్రాంతంలోనే ఎక్కడో ఉండి ఉంటుంది. మనం ఒక్కుమ్మడిగా ముందు సముద్రకేతుడిమీద పడి, వాణ్ణి అనుచరులతో సర్వనాశనం చేద్దాం!" అన్నాడు.

ఈ లోపల వజ్రముష్టి బానిసలందరినీ ఒక చోట చేర్చి, వాళ్ళకు కర్రలూ, ఇనుప చువ్వలూ... ఈ విధంగా ఏవి దొరికితే అది ఇచ్చి, సర్వసన్నద్ధం చేశాడు. శివదత్తుడి ఆజ్ఞ కాగానే అందరూ మూడు భాగాలుగా విభజింపబడ్డారు. శివదత్తుడూ, మందరదేవుడూ, వజ్రముష్టి ఆ మూడు భాగాలకూ ముందుండి దాడి ప్రారంభించాలని నిశ్చయించబడింది.

అందరూ చెట్లచాటున గల చీకటి ప్రాంతాల వెంట నిశ్శబ్దంగా నడిచి, మూడువైపులనుంచి సముద్రకేతుడి మీదికి భయంకరంగా అరుస్తూ దూకారు. అంత హఠాత్తుగా మీదికి దూకిన శత్రువు లెవరో తెలుసుకుని ప్రతిఘటించే లోపల, సముద్రకేతుడి దొంగల ముఠాలో చాలామంది, శివదత్తుడి అనుచరుల వాడి కత్తులకు బలి అయిపోయారు.

(ఇంకా వుంది)







## 18

[వాగులోవున్న ఒక మిట్టమీద కనబడిన, సముద్రకేతుని దొంగలను, వజ్రముష్టి హత మార్చాడు. తరవాత ఉప్పుటేరులో ఒక చిన్న ద్వీపంమీద వున్న సముద్రకేతుని స్థావరాన్ని, శివదత్తుడూ, మందరదేవుడూ చేరారు. అక్కడ సముద్రకేతుడు బంధించి వుంచిన వారిని విడిపించి, అందరూ సముద్రకేతుని మీద యుద్ధానికి తలబడ్డారు. తరవాత—]

వజ్రముష్టికి, సముద్రకేతుడికీ భీకరమైన పోరు ప్రారంభమైంది. ఒకటి రెండు నిమిషాల్లో, వజ్రముష్టి కత్తిదెబ్బకు, సముద్రకేతుని కత్తి తునాతునియలై పోయింది. వజ్రముష్టి తనచేత గల కత్తిని దూరంగా విసిరివేస్తూ, "ముష్టాముష్టిగా పోరాడి, నిన్ను హతమార్చాలనే నా కోరిక!" అంటూ సముద్రకేతుణ్ణి నడుము పట్టుకుని, చాప చుట్టలా భూమిమీదికి విసిరాడు.

ఆ దెబ్బకు దిమ్మెరపోయి సముద్రకేతుడు 'అబ్బా' అంటూ లేచేంతలో వజ్రముష్టి బలమైన చేతులు అతడి కంఠాన్ని పడిసిపట్టుకున్నై. "పాపాత్ముడా, నీ పాపాలకు యిదే ప్రాయశ్చిత్తం!" అంటూ వజ్రముష్టి అతడి కంఠాన్ని నులిమి, ఛీత్కరిస్తూ లేచి కాళ్లతో అతణ్ణి బలంగా తన్నాడు. సముద్రకేతుడిలో చలనం లేదు.

కొద్దిసేపట్లో సముద్రకేతుడి అనుచరుల్లో చావగా మిగిలినవాళ్లు బంధించబడ్డారు. అంతవరకూ యీ పోరాటాన్ని ఎలా ఆపాలో తెలియక, వింతగా చూస్తున్న హరికేశుడి భటులు ముందుకు వచ్చి, "ఇదంతా



ఏమిటి? ఎవరు మీరు?" అంటూ శివదత్తుణ్ణి కోపంగా ప్రశ్నించారు.

శివదత్తుడు జరిగిన దంతా చెప్పి, "అయ్యా, మేము మీ మకరమండల రాజైన హరిశిఖుడికి మిత్రులుగా వుండదలిచాం. మీరు ఒక మొసలిని దేవతగా పూజించి, రోజూ మనుష్యబలులు యిచ్చే సాంప్రదాయాన్ని గురించి విన్నాం. ఆ పిశాచిని హతమార్చగల వ్యక్తి మాలో వున్నాడు" అంటూ వజ్రముష్టిని వారికి చూపించాడు.

ఇంతలో దేవమాయి, స్వయంప్రభతో అక్కడికి వచ్చింది. ఆమె సురక్షితంగా వుండటం అందరికీ చాలా సంతోషం కలిగించింది.

తరవాత హరిశిఖుడి భటులు శివదత్తుడి కోరికపై అతణ్ణి మకరమండలానికి తీసుకుపోయారు. హరిశిఖుడు వారికి గొప్పగా స్వాగతం యిచ్చి, "మీరు నా భటులతో చెప్పినట్టు మకరదేవతను చంపేవాడు మీలో వున్నాడా?" అని అడిగాడు.

దానికి వజ్రముష్టి ముందుకు వచ్చి, "మహారాజా! నేను చిన్నప్పటినుంచీ మా శమనద్వీపంలో మొసళ్లను వేటాడటం నేర్చినవాణ్ణి! మీరు దయవుంచి ఆ మొసలి ఉన్న స్థానం నాకు చూపితే, దాన్ని కనుమూసేంతలో తుద ముట్టించగలను!" అన్నాడు వినయంగా.

వజ్రముష్టి మాటలకు హరిశిఖుడు నవ్వి, "ఆ మొసలిని మూర్ఖులైన చాలామంది దేవతగా పూజిస్తున్నారు. కాని అదంటే అందరికీ భయమే! నీవంటి మరుగుజ్జు మానవుడు దానిని హతమార్చ గలడని ఒక నమ్మకం కూడా ఉంది. మీ యజమాని అంగీకరిస్తే, నీ శక్తి సామర్థ్యాలు చూడాలని నాకు కుతూహలంగా ఉంది!" అన్నాడు.


శివదత్తుడు అంగీకార సూచనగా తల వూపాడు. తరవాత హరిశిఖుడితో విన

యంగా, "మహారాజా! ఈ మొసలి కలిగించే ఆపదలనుంచి మీ ప్రజలను మేము రక్షిస్తాం. దీనికి ప్రతిగా మీనుంచి మేము కొంత సహాయం కోరవచ్చునా?" అన్నారు.

హరిశిఖుడు నవ్వి, "సహాయమా? అది ఎలాంటిదైనా చేయగలను. మకరదేవతగా పిలవబడే, ఈ మకర పిశాచికి నా ప్రజల మూఢ విశ్వాసంవల్ల నేనెంతో ధనం ఖర్చు పెట్టి మనుష్యులను దానికి ఆహారంగా సమర్పించేందుకు కొంటున్నాను" అన్నాడు.


అప్పుడు శివదత్తుడు, హరిశిఖుడికి, కుండలినీ, మరాళద్వీపాల వృత్తాంతమంతా చెప్పి, "మీకు గొప్ప నావికాపళం, పెద్ద సేన ఉన్నదని విన్నాను. మా దేశాలను క్రూరుల పరిపాలననుంచి విముక్తి చేసేందుకు మీరు సహాయపడాలి!" అని అడిగాడు. హరిశిఖుడు అంగీకరించాడు.


ఆ రాత్రి శివదత్తుడికీ, అతడి అనుచరులకూ, హరిశిఖుడు గొప్ప విందు చేశాడు. మకరమండలంలోని అన్ని ప్రాంతాలకూ వార్తాహరులు పంపబడ్డారు. ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న మరుగుజ్జు వచ్చాడనీ అతడు మూఢులచే మకరదేవతగా పిలవబడే పిశాచిని, చంపగలడనీ వాళ్ళు చాటింపు వేశారు.



మరునాడు మిట్టమధ్యాహ్నం వేళ మకర మండల వాసులందరూ, మొసలి నివసించే ప్రాంతానికి వచ్చారు. అక్కడ ఉన్న ఒక కొండ శిఖరంనుంచి చూస్తే, కింద పారుతున్న ఒక నది కనబడుతుంది. ఆ నది అంచున ఒకగుహ ఆమొసలికి నివాసస్థానం.

వజ్రముష్టి అడుగు పొడవు గల రెండు కత్తులను, పిడులదగ్గిర బలమైన తాడుతో బిగించి, దానిని గుప్పెటతో పట్టుకుని అందరూ చూస్తూండగా శిఖరంమీది నుంచి నదిలోకి దూకాడు. తరవాత నది అవతలి ఒడ్డు చేరి, మొసలి నివసించే గుహ దగ్గిరకు వెళ్ళాడు.


CHITRA




వజ్రముష్టి గుహను సమీపించేంతలో, లోపలినుంచి నిప్పులు చెరిగే కళ్లతో పర్వతంలా ఉన్న మొసలి బయటికి వచ్చి నోరు తెరుచుకుని అతడిమీదికి దూకింది. వజ్రముష్టి ఉన్న చోటునుంచి వెనకడుగు వేయకుండా తన చేతగల కత్తులను దాని నోటిలోకి పోనిచ్చాడు. రెండు వైపులా గల వాడి కత్తులు మొసలి రెండు దవడలలో బలంగా గుచ్చుకుపోయినై. అది బాధతో అటూ ఇటూ కొట్టుకుని నదిలోకి దూకింది

వజ్రముష్టి అదే అదనుగా భావించి తనదగ్గిర ఉన్న పెద్ద కత్తిని ఒరలోనుంచి దూసి, మొసలితోపాటు నదిలో దూకాడు. ఒకటి రెండు గంటలసేపు నీటిలో వజ్రముష్టికీ, మొసలికీ ఘోరమైన పోరు జరిగింది. వజ్రముష్టి దాని తోక దెబ్బలనుంచి తప్పుకుంటూ, క్రమంగా దాని శరీరాన్ని తన కత్తితో బాగా గాయపరిచి. చివరకు కొన ఊపిరితో ఉన్న మొసలిని ఒడ్డుకు లాగాడు.

కొండ శిఖరంనుంచి ఈ భయంకర పోరాటాన్ని తిలకిస్తున్న ప్రజలూ, హరిశిఖుడూ మొసలి మరణం చూచి జయజయధ్వానాలు చేశారు. ఆ తరవాత వారం రోజులపాటు మకరమండలంలో ఆనందోత్సవాలు జరిగినై.

హరిశిఖుడు తను చేసిన వాగ్దానం ప్రకారం, శివదత్తుడికి గొప్ప నావికా బలాన్నీ, ఇరవైవేలమంది సైనికులనూ ఒప్పచెప్పాడు. ఒక శుభముహూర్తాన శివదత్తుడూ, మందరదేవుడూ తిరిగి మరాళ, కుండలినీ ద్వీపాలను నరవాహనుడినుంచి జయించేందుకు బయలుదేరారు. వారి వెంట దేవమాయి, స్వయంప్రభ కూడా ఉన్నారు. స్వయంప్రభ శమనద్వీప రాజకుమార్తె అన్న సంగతి అప్పుడు దేవమాయి శివదత్తుడికి తెలియబరిచింది.

శివదత్తుడు వెంటనే శమనద్వీపానికి రాయబారులను పంపాడు. స్వయంప్రభా,



మందరదేవుల వివాహం ఆ మూడు రాజ్యాలకూ మేలుచేయగలదని అతడి నమ్మకం.

తన కుమార్తె క్షేమంగా వున్నదనీ, ఆమెను మరాళద్వీపరాజైన మందరదేవుడు వివాహమాడ గోరుతున్నాడనీ తెలిసినప్పుడు శమనద్వీపరాజైన శమనుడు ఎంతగానో సంతోషించాడు. అతడుకూడా కొంత నావికా బలంతో, సైనికబలంతో కాబోయే అల్లుడికి సహాయపడేందుకు బయలుదేరాడు.

వేగులవల్ల తనమీదకు రానున్న యీ దాడిని గురించి విన్న నరవాహనుడు, భయంతో వణికిపోయాడు. మరాళ, కుండలినీ ద్వీపాలు రెంటినీ రక్షించుకోవటం తలకు మించిన కార్యమని అతడికి తోచింది. అతడు గుట్టుచప్పుడు కాకుండా, మరాళద్వీపాన్ని వదలి, వున్న బలాన్నంతా కుండలినీ ద్వీపంలో కేంద్రీకరించాడు.

ఏ ప్రతిఘటనా లేకుండా శివదత్తుడూ, మందరదేవుడూ, ముందుగా మరాళ ద్వీపాన్ని ఆక్రమించుకున్నారు. మరునాడు కుండలినీ ద్వీపంలో దిగారు. తీరంలో ఎక్కడా నరవాహనుడి సైనికుడే లేడు.


శివదత్తుడికి యిది చాలా ఆశ్చర్యం కలిగించింది. అతడు లోపలి ప్రాంతాలకు వేగులను పంపాడు. వారు వెళ్ళిన కొద్ది సేపటికే తిరిగి వచ్చి, "అయ్యా, మనం దాడి వస్తున్నామని తెలిసి లోగడ నరవాహనుడిచేత చిత్రహింసలకు గురిఅయిన కోయలు, ఒక్కుమ్మడిగా తిరుగుబాటు చేశారు. వాళ్ళ మూకలు, యిప్పుడు కుండలినీ నగరాన్ని ముట్టడిస్తున్నట్టు తెలిసింది!" అని చెప్పారు.

ఈ వార్త మందరదేవుణ్ణి చాలా నిరుత్సాహపరిచింది. "ఏ నాటికైనా, నా స్వహస్తాలతో ఆ క్రూర నరవాహనుణ్ణి చంపి తీరుతానని ప్రతిజ్ఞ చేశాను. ఇప్పుడు ఆ ప్రతిజ్ఞ వమ్మయేలా వుంది!" అన్నాడు మందరదేవుడు.

తరవాత శివదత్తుడు, ఓ యాభై మంది అశ్వ సైనికులను యిచ్చి, వజ్రముష్టిని ముందు పంపాడు. ఒకవేళ నరవాహనుడు యింకా బ్రతికి వుంటే, అతణ్ణి చంపవద్దని కోయలకు ఆజ్ఞాపించ వలసిందిగా, అతడు హెచ్చరించ బడ్డాడు.

వజ్రముష్టి ఆశ్వికులతో కుండలినీనగరం చేరేసరికే, మిడతల దండులా కోయలు నగరంమీద పడ్డారు. వాళ్ల కత్తులకూ, బాణాలకూ నరవాహన సైనికులు వందల వేల సంఖ్యలో దుర్మరణం పాలయారు. వజ్రముష్టి, శివదత్తుడినుంచి తను తెచ్చిన వర్తమానం కోయ నాయకులకు తెలియ బరుస్తూ, కోటను సమీపించేంతలో, ఒక బురుజుమీద కాళ్ళూ చేతులూ బంధింప బడిన నరవాహనుడు కోయభటుల మధ్య కనిపించాడు.

వజ్రముష్టి, "అతణ్ణి చంపకండి, చంప కండి!" అని అరుస్తూ, గుర్రాన్ని బురుజు కేసి పరిగెత్తించేంతలో, క్రూర నరవాహనుడు బురుజుమీది నుంచి కిందవున్న అగడ్తలోకి తోయబడ్డాడు. అదే సమయంలో ఆ ప్రాంతాల గుమిగూడిన కోయలు హర్ష ధ్వానాలు చేశారు. వజ్రముష్టి అగడ్తను సమీపించేసరికే నరవాహనుడు మరణించాడు.



రెండు మూడు గంటల తరవాత శివదత్తుడూ, మందరదేవుడూ, శమనుడూ అక్కడికి వచ్చారు. వారికి కోయ నాయకులు ఘనమైన స్వాగతం యిచ్చారు. అప్పటికప్పుడే మందరదేవుడు మరాళ ద్వీపంతోపాటు కుండలినీ ద్వీపానిక్కూడా రాజుగా ప్రకటింపబడ్డాడు. కోయలందరికీ లోగడ నరవాహనుడు ఆక్రమించుకున్న భూములు తిరిగి ఇచ్చివేయబడినై.

వారం రోజుల తరవాత అతి వైభవంగా మందరదేవుడికీ, స్వయంప్రభకూ వివాహం జరిగింది. శివదత్తుడు, హరిశిఖుడు పంపిన సైనికులందరికీ గొప్ప గొప్ప బహుమానా

లిచ్చి, తిరిగి వారిని, వారి మకరమండలానికి పంపివేశాడు.

తరవాత ఒకరోజున శివదత్తుడి కోరికపై మందరదేవుడు నిండు దర్బారు ఏర్పాటు చేశాడు. దానికి మరాళ, కుంతలినీ ద్వీపాల్లోని పెద్దలంతా విచ్చేశారు. శివదత్తుడు తను సన్యసించి, అడవులకు వెళ్ళుతున్నట్టూ, శేషజీవితాన్ని దైవధ్యానంలో గడపదలిచినట్టూ ప్రకటించాడు.

ఇది మందరదేవుడితోపాటు, సభికులందర్నీ చాలా కలవరపరిచింది. వాళ్లందరూ శివదత్తుణ్ణి మంత్రిగాగాని లేక రాజగురువుగాగాని ఉండి, రాజ్యపాలన సక్రమంగా నడిచేట్టు చూడవలిసిందిగా కోరారు. శివదత్తుడు అంగీకరించలేదు. అతడు సభికులనూ, మందరదేవుణ్ణీ ఉద్దేశించి ఇలా చెప్పాడు:

"పాలకులూ, పాలితులూ ఎలాంటి ధర్మాలను పాటించితే, దేశానికి క్షేమమో యీ సరికి కుంతలినీ మరాళద్వీప వాసులందరికీ తెలుసునని నేను భావిస్తున్నాను. చిత్రసేన, సమరసేనుల పరిపాలనలతోబాటు, క్రూర నరవాహనుడి పరిపాలనను కూడా అందరూ చవిచూచారు. కనుక ఎలాంటిది ధర్మపాలనో, ఎలాంటిది కాదో ప్రజలందరికీ తెలిసి వుంటుంది. దానికి అనుగుణంగా వారు ప్రవర్తించ గలరని నేను నమ్ముతున్నాను!"

శివదత్తుడి మాటలకు సభికులంతా హర్షధ్వానాలు చేశారు. హర్షధ్వానాల మధ్య శివదత్తుడు అందరికీ నమస్కరించి, దర్బారు నుంచి బయలుదేరాడు. రాజూ, ప్రజలూ అతణ్ణి అనుసరించి పట్టణానికి నాలుగైదు క్రోసుల దూరంలో వున్న అరణ్యంవరకూ సాగనంపారు. శివదత్తుడు, అక్కడ అందరికీ మరోమారు నమస్కరించి, అరణ్యంలోకి వెళ్లిపోయాడు.

(అయి పోయింది)

